21-02Pg1exHMNWJQE.qxd:21-02Pg1exHMNWJQE.qxd 1/1/02 6:49 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం : fb.com/vaartha

Published from Srikakulam Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

21-2-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 20 పేజీలు: 14 వెల: 6.50


మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు

శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

5లో

# మిర్చి రైతులను ఆదుకుంటాం



గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్‌చౌహాన్‌తో వర్చువల్‌గా మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## కేంద్ర మంత్రితో సాయం కోసం మాట్లాడా..

## అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంవల్లే ధరల పతనం

## పోలవరం నీరు బనకచర్లదాకా తీసుకెళ్లేందుకు కేంద్ర సాయం అడిగా..

## ఢిల్లీలో మీడియాతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త ప్రతినిధి:** మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారిని ఆదుకుంటామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. మిర్చి ధర పతనంపై కేంద్రంతో మాట్లాడామన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి రేట్లు పడిపోయాయి. గతంలో అంతర్జాతీయ మార్కెట్ బాగుండటంతో రైతులకు మంచి ధరవచ్చిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయాయి. మిర్చి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.. కేంద్రమంత్రి పర్యటనలో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సమస్యలను వివరించామన్నారు. శుక్రవారం అధికారులతో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మిర్చి ధరల అంశంపై సమీక్షిస్తారు. అని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరామన్నారు.ఈ యేడాది 12 లక్షల మెట్రిక్ టన్నులు మిర్చి సేకరించాల్సి ఉంది...ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చింది. దాదాపు 5 లక్షల ఎకరాల్లో ఈ యేడాది రాష్ట్రంలో మిర్చి సాగైంది. ఎప్పుడూ లేనంతగా రేట్లు పడిపోయాయి. ఎట్టి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరాం. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 25 శాతం మాత్రమే ఇస్తారు. సాగు ఖర్చులను లెక్కలు వేసి ధరలు నిర్ణయించాలి. అవన్నీ సరిచేయాలని కేంద్రమంత్రిని కోరాం. దీనిపై సమీక్షా సమావేశంలో చర్చించిన తర్వాత స్పష్టత ఇస్తామని కేంద్రమంత్రి చెప్పారు. ఏ విధంగానైనా రైతులను ఆదుకోవడం ముఖ్య ఉద్దేశం. శనివారం వ్యాపారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడి ధరల పతనానికి కారణాలు >>2



గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తాచేత ప్రమాణం చేయిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

## రామ్‌లాలా మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన ప్రమాణ స్వీకారం

## డి.సిఎంగా పర్వేష్‌సింగ్ వర్మ, మరో ఐదుగురు మంత్రులు ప్రమాణం

## హాజరైన ప్రధాని మోడీ, పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయె సిఎంలు, ఎపి సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

## మంత్రులకు వెంటనే శాఖల కేటాయింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** రెండున్నరదశాబ్దాలు దాటిన తర్వాత దేశరాజధాని ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలామైదాన్‌లో జరిగిన భారీ సభలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణ స్వీకారంచేసారు. లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షా, పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయేపాలిత రాష్ట్రాల ముఖ్య >>2

## ఎపి ఫైబర్‌నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై

# వేటు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఫైబర్‌నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై వేటు పడింది. ఫైబర్‌నెట్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ భరద్వాజ, ఫైబర్‌నెట్ బిజినెస్ హెడ్ సురేశ్, ప్రొక్యూర్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్ ఖాన్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివి రెడ్డి ఆదేశాలిచ్చారు. గత 9 నెలలుగా ఫైబర్‌నెట్‌లో కనీస పురోగతి లేదని ఒక్క రూపాయి ఆదాయం కూడా తీసుకురాలేకపోయామని జివి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఎపి ఎస్‌ఎఫ్‌ఎల్‌లో సంస్కరణలు చేస్తున్నా అధికారులు సహకరించడం లేదని అందుకే ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు ఛైర్మన్ స్పష్టం చేశారు. సంస్థలో 400 మందిని తొలగించాలని ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోలేదని జివి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల తొలగింపు ఆదేశాలపై ఫైబర్‌నెట్ ఎండి, ఇడి సంతకాలు చేయలేదని, ఉద్యోగులకు జీతాల రూపంలో సంస్థ సొమ్ము చెల్లించారని మండిపడ్డారు. ఫైబర్‌నెట్‌లోని ఉన్నతాధికారులు గత ప్రభుత్వంతో చేతులు కలిపారని అన్నారు. ఫైబర్‌నెట్‌కు జిఎస్టీ అధికారులు రూ.377 కోట్లు జరిమానా విధించారని, కానీ అధికారులు తనకు చెప్పలేదని తెలిపారు. ఈ 9 నెల్లలో ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయామని, >>2

# ఇక వడివడిగా పోలవరం

## పూర్తి సాయం అందించడానికి కేంద్రం అంగీకారం

## కుడి, ఎడమ కాల్వల నిర్మాణ ఖర్చు రీయింబర్స్‌మెంట్ అడిగాం

## కేంద్ర జలశక్తిమంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశమైన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్



గురువారం కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ భేటీ దృశ్యం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరిస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ స్పష్టం చేసారని సిఎం చంద్రబాబు తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో కలిసి కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు ఢిల్లీలో సమావేశమయ్యారు. సమావేశం మంచిగా జరిగిందని సిఎం చంద్రబాబు మీడియాకు వెల్లడించారు. పోలవరం ఎడమ, కుడి కాలువల నిర్మాణానికి చేసిన ఖర్చును రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని విన్నవించినట్లు తెలిపారు. డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు కూడా ఇప్పటికే రెండు కట్టర్లతో మొదలయ్యాయని తెలిపారు. మార్చి నుండి మూడో కట్టర్‌తో పనులు చేపడతామని వెల్లడించారు. డయాఫ్రం వాల్ నిర్మాణానికి సమాంతరంగా ఇసిఆర్‌ఎఫ్ డ్యాం పనులు మొదలు పెట్టేలా, అవసరమైన డిజైన్స్, సిడబ్ల్యూసి నుంచి త్వరగా వచ్చేలా సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు త్వరలో పోలవరం సందర్శనకు వస్తానని సిఆర్ పాటిల్ తెలిపారు. గోదావరినుంచి 200 టిఎంసిల వరద నీటిని బనకచెర్లకు తరలించే లక్ష్యంతో చేపట్టిన పోలవరం బనకచెర్ల లింక్ ప్రాజెక్టుకు మద్దతు కోరినట్లువెల్లడించారు. ఈప్రాజెక్ట్ రాష్ట్రాన్ని కరవు రహితంగా మారుస్తుందని తెలిపారు. 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. పరిశ్రమలకు 20 టిఎంసిల >>2

## 24 నుంచి

# అసెంబ్లీ

## 28నే బడ్జెట్ సమర్పణ

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభమవుతోన్నాయి. ఆ క్రమంలో మార్చి 4వ తేదీన రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నట్లు తొలుత సమాచారం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ షెడ్యూల్‌ను కాస్తా ముందుకు జరిపారు. ఫిబ్రవరి 28వ తేదీన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. ఇక ఈ బడ్జెట్ సమావేశాల ప్రారంభమవుతోన్న నేపథ్యంలో ఆ రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రసంగించనున్నారు.

అలాగే 25వతేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేతీర్మానంపై చర్చ ప్రారంభం కానుంది. అదేరోజు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సిఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. ఇక అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24వ తేదీనుంచి ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే బడ్జెట్ అంశాలు నిధులకేటాయింపుపై సిఎం చంద్రబాబు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖతో సహా వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు.

## వెలిగొండ పూర్తికి

# మరో రెండేళ్లు!

## ప్రాజెక్టుకు మరో రూ. 4వేల కోట్లు అవసరం: మంత్రి నిమ్మల

**విజయవాడ,, ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** వెలిగొండ ప్రాజక్టు పనులను పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనత గత ప్రభుత్వానిదని, ఆ ప్రాజక్టు పూర్తి కావాలంటే దాదాపు రూ.4 వేల కోట్ల నిధులతో పాటు 2 ఏళ్ల సమయం పడుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, 25 లక్షల మందికి త్రాగు నీరు అందజేసే వెలిగొండ ప్రాజక్టు ప్రధాన పనులు ఏవీ పూర్తి చేయకుండా రైతులను గృహనిర్బంధం చేసి పటిష్టమైన బందోబస్తు మద్య ఆ ప్రాజక్టును జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. శ్రీశైలం వద్ద నున్న హెడ్ రెగ్యులేటరీ, రిటైనింగ్ వాల్ పనులు, మొదటి, రెండవ సొరంగం పనులను, ఫీడర్ కెనాల్ పనులను మరియు నిర్వాశితుల కాలనీల నిర్మాణ పనులను ఏ మాత్రం పూర్తి చేయకుండా వెలిగొండ ప్రాజక్టును జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. సొరంగం1 లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర రోడ్డును మరియు సొరంగం2 లో 2.00 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టిని తొలగించాల్సి ఉందని, అందుకు దాదాపు తొమ్మిది మాసాలు పడుతుందన్నారు. సొరంగం 2లో ఇంకా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ చేయాల్సిన పనులుఉన్నాయని అందుకు దాదాపు ఎనిమిది మాసాలు >>2

# గ్రూప్-2 పరీక్షలకు భారీ ఏర్పాట్లు



గురువారం ఎపిపిఎస్సి గ్రూపు2 మెయిన్ రాత పరీక్షలపై సమీక్షిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్

## 23న పరీక్షల నిర్వహణపై కట్టు కథలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు : సిఎస్ విజయానంద్

**విజయవాడ, ఫిబ్రవరి20.ప్రభాతవార్తప్రతినిధి:** ఈనెల 23వతేదీన నిర్వహించనున్న ఎపిపిఎస్సి గ్రూపు2 మెయిన్ రాత పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఎపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధతో కలసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారంలేకుండా అన్ని పరీక్షాకేంద్రాలవద్ద కట్టుదిట్టమైన బందోబస్తుతో పాటు ఇతర ఏర్పాట్లను చేయాలని కలెక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. 13 పాత జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే మార్గదర్శకాలను జిల్లాలకు పంపడం జరిగిందని వాటిని పూర్తిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు 92వేల 250 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పరీక్షలు సజావుగా జరిగేందుకు వీలుగా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ముఖ్యంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి సోషల్ మీడియాలో ఎక్కడైనా ఎవరైనా వదంతులు లేదా నకిలీ వార్తలు ప్రసారం చేసినా లేదా సర్క్యులేట్ చేసినా వెంటనే విచారణ చేసి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లు, ఎస్పిలకు స్పష్టం చేశారు.

ఇదే సమయంలో ఎవరైనా నకిలీ వార్తలు ప్రసారం లేదా వదంతులు సృష్టించినా అభ్యర్థులు వారి తల్లిదండ్రులు ఎవిధమైన ఆందోళన చెందవద్దని ఆయన హితవు చేశారు. పరీక్షలు సజావుగా సక్రమంగా జరిగేందుకు వీలుగా ఇప్పటికే అన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. సెన్సిటివ్ పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన ప్రాంతాల్లో మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లు,ఎస్పిలు,ఎపిపిఎస్సి అధికారులను ఆదేశించారు. ముందుగా ఎపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధ గ్రూపు2 మెయిన్ పరీక్షల ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ పాత 13 జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా >>2

## గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

2లో

## వల్లభనేనికి

# హైకోర్టులో చుక్కెదురు



**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడికేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వంశీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇటీవల వంశీ దళిత యువకుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్, దాడి చేసిన కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్నాడు.

వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులుజారీచేసింది. గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసులో వంశీ నింది తుడిగా ఉన్నాడు. ఈ కేసులో తనకు >>2

## రైల్వే పరీక్షల్లో

# భారీ అవినీతి!

## పలువురు అధికారుల అరెస్టు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** పశ్చిమ రైల్వే జోన్‌లో పదోన్నతులకు సంబంధించిన కేసులో రైల్వే అధికారులు సహా ఆరుగురిని అరెస్టు చేసినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వెల్లడించింది. పశ్చిమ రైల్వే జోన్‌లో లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ (ఎల్‌డిసిఇ) పరీక్షల్లో అభ్యర్థులకు అనుకూలంగా ఉండేందుకు భారీగా లంచం వసూలు చేశారన్న ఆరోపణలు, అభియోగాలపై పశ్చిమ రైల్వే, వడోదరలోని డిఆర్‌ఎం కార్యాలయంలో ఇద్దరు ఐఆర్‌పిఎస్ అధికారులతో పాటు మరికొందరితో కూడిన లంచం నెట్‌వర్క్ (రాకెట్)ను సిబిఐ అదుపులోకి తీసుకొని విచారిస్తోంది. ఈ కేసులో పశ్చిమ రైల్వే జోన్‌లోని వడోదరలో పనిచేస్తున్న 2008, 2018 ఐఆర్‌పిఎస్ బ్యాచ్‌కు చెందిన ఇద్దరు అధికారులతో సహా ఆరుగురు >>2

## విద్యుత్ ఛార్జీల

# పెంపు లేదు..

## ఎపి ఇఆర్‌సి ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ చార్జీలు పెంపులేదని ఎపిఇఆర్‌సి ఛైర్మెన్ ఠాకూర్ రామ్ సింగ్ ప్రకటించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల టారిఫ్‌లను ఏపి విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ విడుదల చేసారు. ఎపిఇఆర్‌సి మూడు డిస్కమ్‌ల కోసం రూ.57,544,17 కోట్ల రుపాయాల ఎఆర్‌ఆర్‌ని అమోదించగా, ఇది డిస్కమ్‌ల ఫైలింగ్‌ల కంటే రూ.1.324.35 కోట్లు తక్కువ అన్నారు. >>2



విద్యుత్ చార్జీల టారిఫ్‌లను విడుదల చేస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ ఠాకూర్ రామ్ సింగ్

21-02pg2exHMNWJQE.qxd:21-02pg2exHMNWJQE.qxd 1/1/02 6:51 AM Page 1





గురువారం న్యూఢిల్లీలో జరిగిన సిఎం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీతో డి.సిఎం పవన్

# హిమాలయాలకు వెళ్తున్నారా?

## డిప్యూటీ సిఎం పవన్‌ను చూసి చమత్కరించిన ప్రధాని మోదీ

### ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అందరినీ ఆకట్టుకొన్న పవన్ ఆహార్యం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ సిఎం రేఖ గుప్తా పదవీ స్వీకార కార్యక్రమంలో ఏపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని నరేంద్రమోదీ చతుర సంభాషణ సాగించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోదీ ఒక్కొక్క ప్రముఖున్ని పలుకరిస్తూ, కరచాలనం చేస్తూ పవన్ కల్యాణ్ కనిపించగానే ఒక్కనిమిషం పాటు అలా ఆగిపోయారు. పవన్ వస్త్రధారణ చూసిన మోదీ నవ్వుతూ హిమాలయాలకు వెళ్లాలనుకుంటున్నావా! అంటూ చమత్కరించారు. మోదీ మాటలకు పడిపడి నవ్విన పవన్ కళ్యాణ్ అలా ఏమీ లేదంటూ సమాధానమిచ్చారు. వెంటనే నీ ముందు చాలా బాధ్యతలు ఉన్నాయి.. వాటిని చూసుకో అంటూ మోదీ పవన్ కల్యాణ్ వీపులో చేయి వేసి పలకరించారు. మోదీ మాటలకు పవన్ కల్యాణ్ వెనుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సైతం నవ్వుతూ కనిపించారు. వేదికపై ఉన్నవారందరికి నమస్కరిస్తూ ముందుకుసాగిన మోదీ పవన్ వద్ద కొద్దిసేపు ఆగి.. ప్రత్యేకంగా మాట్లాడటంపై రాజకీయంగా పలు భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పవన్‌పై మోడీ మరోసారి తన అభిమానాన్ని చూపించారంటూ జనసైనికులు కామెంట్స్ చేస్తున్నారు.ప్రత్యేకంగా పవన్‌వేదికపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన వస్త్రధారణ చూసి పిఎం మోడీ సైతం ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో పవన్ కల్యాణ్ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన పోరాడుతుందని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా హిందూ ఆలయాల పరిరక్షణ కోసం ప్రత్యేక సనాతన బోర్డు ఏర్పాటుచేయాలనే డిమాండ్‌ను పవన్ వినిపిస్తున్నారు. దీంతో పవన్ కల్యాణ్ పేరు దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

# రైతులను ఆదుకుంటాం

>> తెలుసుకుంటానని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్రానికి 3 సార్లు లేఖలు రాశాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అధికారులు వచ్చి కేంద్ర అధికారులతో మాట్లాడారు. మా ప్రధాన ఉద్దేశం మిర్చి రైతులను ఆదుకోవాలని కోరడానికి ఢిల్లీకి వచ్చాం. రైతులు నష్టపోకుండా ఏం చేయాలో చేస్తాం. రైతులను పట్టించుకోని వారు మాట్లాడుతున్నారు. పంటలకు సంబంధించి ధరలు ఒక్కోసారి తగ్గుతాయి.. ఒక్కోసారి పెరుగుతాయన్నారు. రైతుకు గిట్టుబాటు ధరలేనప్పుడు ప్రభుత్వం వారికి కచ్చితంగా అండగా నిలుస్తోందన్నారు. రైతులకు గతంలో ఏమీ చేయలేని వారు ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారు. 2019కి ముందు ధరలు తగ్గితే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.138 కోట్లు విడుదల చేసి మిర్చి రైతులను ఆదుకున్నాం. మళ్లీ డబ్బులివ్వబోయేది ఎన్డీయేనే. బాధ్యత లేకుండా మిర్చి యార్డులోకి వెళ్లారు. ఎన్నికల కోడ్ అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుంది. కానీ పోటీలో మేం లేం కాబట్టి మాకు వర్తించదని చెప్తున్నారు. ఎన్నికల కమిషన్ వెళ్లొద్దని చెప్పినా వినకుండా వెళ్లారు. ఇల్లీగల్ పనులు చేసే సెక్యూరిటీ కావాలని అడిగారు. మీరు చేసే ఇల్లీగల్ పనులకు పోలీసులు రక్షణగా ఉండాలా? నేరాలు చేస్తుంటే మీ వెనక పోలీసులు రావాలా? జల్ జీవన్ మిషన్, పోలవరంపై జలశక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిసాను. జల్ జీవన్ మిషన్, పోలవరంపై ఆయనతో చర్చించాం. పోలవరం పనులు సజావుగా సాగుతున్నాయి. 2027 నాటికి పూర్తి చేయాలని ఆశయంగా పెట్టుకున్నాం. నదుల అనుసంధానంపైనా చర్చించాం. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీరు ఉపయోగించుకుంటే రాష్ట్రంలో కరవు లేకుండా ఉంటుంది. పోలవరం నుంచి బనకచర్ల నీళ్లు తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం కోరాం. దీనిపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రతినిధులు కూడా రాష్ట్రానికి వస్తారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి నీటిని అందించాలన్నదే లక్ష్యం, కానీ గత ప్రభుత్వం ఈ పథకాన్ని ఒక్కశాతం కూడా ఉపయోగించుకోలేదు. రాష్ట్రానికి రూ. 27 వేల కోట్లను కేంద్రం మంజూరు చేసింది. పైపులైన్ల ద్వారా కాకుండా బోరు బావుల ద్వారా ఇస్తామని చెప్పారు. కేంద్రం ఇచ్చిన రూ.50 వేల కోట్ల నిధులను యూపీ ఖర్చు చేసింది. గుజరాత్‌లో ఇంటింటికీ కుళాయి ద్వారా నిరంతరంగా నీళ్లు ఇస్తున్నారు. కేంద్రం ఈ పథకాన్ని మళ్లీ నిబంధనలు మార్చి 2028కి పనులు పూర్తి చేయాలని సమయం పెంచింది. దీని ప్రకారం గతంలో కేటాయించిన రూ.27 వేల కోట్లు మాత్రమే వస్తాయి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కుళాయి ద్వారా నీరివ్వాలంటే అదనంగా రూ.54 వేల కోట్లు అవసరం. దీనిపై కూడా కేంద్రంతో మళ్లీ సంప్రదిస్తాం. ప్రస్తుతం రూ.27 వేల కోట్లకు డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రాన్ని నిధులు కోరతాం. తప్పుడు విధానాలతో ప్రజలకు నష్టంగత ప్రభుత్వం అవలంబించిన తప్పుడు విధానాల వల్ల ప్రజలు ఏ విధంగా నష్టపోతారో ఈ జల్ జీవన్ మిషన్ ఒక ఉదాహరణ. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేశారు. వాటిల్లో కొన్ని పథకాలను మేము పట్టాలు ఎక్కించాం. గ్రాంట్ కేటాయించి నిధులు ఖర్చు చేసి యూసీలు ఇచ్చాం. కేంద్రం ఇచ్చే పథకాలు ఉపయోగించుకుంటే రాష్ట్రానికి ఎంతో మంచి జరుగుతుంది. కానీ గత ప్రభుత్వ చేతగాని పాలన వల్ల సమస్యలు వచ్చి పడ్డాయి... వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నాం. సముద్రంలో కలిసే నీటినే వాడుకుంటున్నాంనదుల ప్రవాహంలో చివరన ఉన్న ఎపి బిట్టచివర ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో నేను 9 ఏళ్లు సిఎంగా ఉన్నప్పుడు అనేక ప్రాజెక్టులు పూర్తి చేసి తెలంగాణకు నీళ్లందించాం. ఇప్పుడు సముద్రంలోకి వెళ్లే నీరు ఉపయోగించుకోవాలని చూస్తున్నాం. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని ఎపి ఉపయోగించుకునే అవకాశం ఉంది. వాటినే వాడుకుంటున్నాం. రాజకీయం అంటే ప్రజల సమస్యల కోసం పని చేయడం రాజకీయం అవుతుంది. ఎపిలో ఎన్డీయే చిత్తశుద్ధితో పని చేస్తోంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇక కేంద్రమంత్రులు కింజరపు రామ్మోహననాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు సిఎం చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి శివరాజ్‌చౌహాన్‌తో మిర్చి ధరలపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.అంతకు ముందు సిఎం చంద్రబాబు ఢిల్లీ సిఎం రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని ఆమె అభినందించారు.జ్ఞాపికను అందజేసారు.



గురువారం ఢిల్లీ సిఎంగా ప్రమాణం చేసిన రేఖా గుప్తాకు జ్ఞాపికను అందించి అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

# వడివడిగా పోలవరం

>> నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా కేటాయించవచ్చని సిఎం చంద్రబాబు తెలిపారు.స్వయంగా మూడు సార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించి పనుల విడుదల వేగవంతం చేసినట్లు చంద్రబాబు అన్నారు. 2025 డిసెంబర్ నాటికి డయా ఫ్రంవాల్ నిర్మాణం, 2027 డిసెంబర్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు, ఏజెన్సీలతో సమీక్షిస్తున్నామని సిఎం చంద్రబాబు కేంద్రమంత్రికి తెలిపారు. పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం పోలవరం ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని సీఆర్ పాటిల్ తెలిపారన్నారు.కేంద్రమంత్రి పాటిల్‌తో భేటీ సందర్భంగా ఆయన సిఎం చంద్రబాబు,డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఘనంగా సత్కరించి,జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు పాల్గొన్నారు.ఈ భేటీ అనంతరం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు ఈ కార్యక్రమం అనంతరం ఎన్డీఏ నేతలకు బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా విందులో చంద్రబాబు నాయుడు,పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

>> మంత్రులు, బిజెపినేతలు హాజరయ్యారు. ఎపినుంచి సిఎం చంద్రబాబు, డిప్యూటిసిఎం పవన్‌కల్యాణ్‌లతోపాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా పాల్గొన్నారు. ఉదయం ఇంటినుంచి బయలుదేరిన రేఖాగుప్తా హనుమాన్ ఆలయంలో పూజలుచేసారు తర్వాత ఆమె రామ్‌లీలామైదానానికి చేరుకుని అందరినీ పలకరించారు. సుమారు 25వేలమంది భద్రతాసిబ్బంది బందోబస్తుతో ఉన్న రామ్‌లీలామైదాన్‌లో ఆమె ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసారు. సుమారు 50వేలమందికిపైగా హాజరయిన అభిమానులు, బిజెపి కేడర్‌లమధ్య గుప్తా సిఎంగాను, పర్వేష్‌సింగ్ వర్మ డిప్యూటి సిఎంగాను ప్రమాణాలుచేసారు. రేఖాతోపాటు బిజెపి ఎమ్మెల్యేలు పర్వేశ్‌వర్మ, ఆశీస్‌సూద్, మజీందర్‌సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్‌సింగ్, కపిల్‌మిశ్రా, పంకజ్‌కుమార్‌లు మంత్రులుగా ప్రమాణంచేసారు. కొత్త సిఎంకు జడ్‌కేటగిరీ సెక్యూరిటీని కేటాయించారు. ఇదిలా ఉండగా ప్రమాణ స్వీకారంచేసిన తర్వాత రేఖాగుప్తా మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామన్నారు. మార్చి 8వ తేదీన రూ.2500 నగదును వారి ఖాతాల్లోకి బదలాయిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని అన్నారు. ప్రధానిమోడీ కలలను సాకారంచేయడం అనేది ఢిల్లీలోని 48 మంది బిజెపి ఎమ్మెల్యేల బాధ్యత అని అన్నారు. మహిళలకు ఆర్థికంగా సాయం అందించే హామీలన్నీ మేం ఖచ్చితంగా నెరవేరుస్తామని, మార్చి 8 నాటికి సొమ్ములు వారి ఖాతాల్లో ఉంటాయని అన్నారు. ఇదిలా ఉంటే ప్రమాణ స్వీకారంచేసిన తర్వాత మధ్యాహ్నం 3 గంటలప్రాంతంలో కేంద్ర మంత్రి జెపినడ్డాతో కలిసి సిఎం రేఖాగుప్తా ఢిల్లీ సచివాలయానికి చేరారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఎమ్మెల్యేలు ఎంపిలు అధికారులు ఘనస్వాగతం పలికారు. సిఎం ఛాంబర్‌లోకి వెళ్లిన రేఖాగుప్తా ముఖ్యమంత్రిగా బాధ్యతలుచేపట్టారు. ఢిల్లీకి నాలుగో మహిళా సిఎంగాను, రెండో బిజెపి మహిళా ముఖ్యమంత్రిగా ఆమె రికార్డు నెలకొల్పారు. సాయంత్రం ఐదు గంటలకు వాసుదేవ్‌ఘాట్, యమునా బజార్‌ను సిఎం సందర్శించారు. తన మొదటి కేబినెట్ సమావేశం ఢిల్లీలోని సచివాలయంలోనే నిర్వహిస్తారు. ఈమేరకు అధికారులు సిఎం షెడ్యూలును సైతం విడుదలచేసారు.

# వెలిగొండ పూర్తికి మరో రెండేళ్లు!

>> పడుతుందన్నారు. అదే విధంగా సొరంగం2లో 6.8 కి.మి. మేర లైనింగ్ పనులు ఉన్నాయని, భారీ టన్నెల్ బోరింగ్ మిషన్ కూడా ఉందని, దాన్ని తొలగించేందుకు చాలా సమయం పడుతుందన్నారు. 21.8 కి.మి. మేర ఫీడర్ కెనాల్ పనులను కూడా నిర్వహించాల్సి ఉందన్నారు. ఇన్ని పనులు పెండింగ్‌లో ఉంటే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. అదే విధంగా ఈ ప్రాజెక్టు విషయంలో తమ ప్రభుత్వంపై బురద జల్లే విధంగా ప్రతి పక్షపార్టీ నాయకులు మాట్లాడం వింతగా ఉందన్నారు. 1996 సంవత్సరంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ ప్రాజెక్టుకు భూమి పూజచేసి, 2014 లో రూ.1,373 కోట్లను కేటాయించి అందులో 96 శాతం నిధులు అంటే రూ.1,319 కోట్లను వెచ్చించి 30 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో బడ్జెట్ రూ.3,518 కోట్లు కేటాయిస్తున్నట్లు చూపించినప్పటికీ అందులో కేవలం 18 శాతం నిధులు అంటే రూ.647 కోట్లను మాత్రమే వెచ్చించడం జరిగిందన్నారు.

పూర్తికాని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన ఘనుడు జగన్ అన్నారు. అబద్ధాలు చెప్పడం, అభూత కల్పనలు చేయడం, పూర్తికాని ప్రాజెక్టులను ప్రారంభించడంలో జగన్ అంతర్జాతీయ ఖ్యాతి గడించారని నిమ్మల రామా నాయుడు ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఇప్పటివరకు ఏడు వింతలు మాత్రమే ప్రజలకు తెలుసు అని ఎనిమిదో వింత జగన్ రూపంలో చూస్తున్నారని ఆయన అన్నారు.

# చుక్కెదురు

>> ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఇటీవల తీర్పు రిజర్వు చేసింది. నేడు పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చింది. వల్లభనేని వంశీ ఆదేశాల మేరకే గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి జరిగిందని ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. వాహనాలు దగ్ధం చేసి భయభ్రాంతులకు గురి చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అప్పట్లో అరెస్ట్ చేయలేదని తెలిపారు. వైఎస్సార్సీ అధికారంలో ఈ కేసు దర్యాప్తును నీరుకార్చారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ముందస్తు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని తెలిపారు. పిటిషనర్‌పై రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారని పిటిషనర్‌కు, దాడికి ఎటువంటి సంబంధం లేదని వంశీ తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు.ఇరువైపుల వాదనలు విన్న తరువాత వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది.

# ఉన్నతాధికారులపై వేటు

>> ఇంటర్నెట్ వ్యవస్థలో నిత్యం సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఫైబర్‌నెట్ అధికారులు ఎలా పని చేస్తున్నారనేందుకు ఇవన్నీ నిదర్శనమని జివి రెడ్డి అన్నారు. ఫైబర్‌నెట్ ఎండి దినేష్‌కుమార్ ఆగస్టులో వచ్చినా ఒక్కరోజు కూడా సమీక్షించలేదని, ఒక్క ఆపరేటర్‌ను కూడా కలవడం లేదని జివి రెడ్డి వివరించారు. ఫైబర్‌నెట్‌ను చంపేయాలని దినేష్‌కుమార్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఉన్నట్లే దినేష్‌కుమార్ పని చేస్తున్నారని అన్నారు. ఈయన కనీసం టార్గెట్లు పెట్టడం లేదని, అలాగే ఆదాయం పెంచేందుకు కూడా ప్రయత్నించడం లేదని వెల్లడించారు. కానీ సిబ్బందికి అక్రమంగా 3 నెలలు జీతాలు చెల్లించారని వివరించారు. ఆ జీతాల మొత్తాన్ని ఎండి దినేష్, ఉన్నతాధికారుల నుంచి వసూలు చేయాలని అన్నారు.

# రైల్వే పరీక్షల్లో భారీ అవినీతి!

>> నింధితులను అరెస్టు చేసింది. పశ్చిమ రైల్వే జోన్‌లో లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో పదిమంది అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించేందుకు భారీగా లంచం వసూలు చేసిన ఆరోపణలకు సంబంధించిన కేసులో ముంబై చర్చ్ గేట్ డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్,డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్,అహ్మదాబాద్‌లోని సబర్మతి డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌తో పాటు మరో ప్రైవేటు వ్యక్తిని సిబిఐ అరెస్టు చేసింది.

ఈ సందర్భంగా నింధతుల నివాసాలు,అధికారిక ప్రాంతాల్లో 11చోట్ల నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో లంచం తీసుకున్న రైల్వే ఉద్యోగులు నుండి రూ.57లక్షలు విలువ చేసే 650గ్రాముల బంగారం,బంగారు ఆభరణాలు, సుమారు రూ.5లక్షల నగదు, ఎలక్ట్రానిక్ యాంత్రిక పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ తెలిపింది. అరెస్ట్ చేసిన నింధితులను అహ్మదాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుచనున్నట్లు విచారణ కొనసాగుతుందని సిబిఐ తన ప్రకటనలో తెలిపింది.

# మార్చి 1 నుండి 20 వరకు ఇంటర్ పరీక్షలు

**విజయవాడ, ఫిబ్రవరి20.ప్రభాతవార్తప్రతినిధి:** మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగన్నాయి.మార్చి 1నుండి 19 వరకూ ప్రధమ సంవత్సర పరీక్షలు,3 నుండి 20 వరకూ ద్వితీయ సంవత్సర పరీక్షలు రోజూ ఉదయం 9గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకూ జరగనుండగా 26 జిల్లాల్లో 1535 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 10 లక్షల 58వేల 892 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటికి సంబంధించిన ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 3 నుండి 15వ తేదీ వరకూ జరగనుండగా 325 కేంద్రాల్లో ఈపరీక్షలకు మొత్తం 67వేల 952 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు.ఈపరీక్షల ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలలు పరీక్షలమాసాలని కావున ఆయాపరీక్షలు సజావుగా సాగేందుకు తగిన విస్తృత ఏర్పాట్లు చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ఈపరీక్షలకు సంబంధించి 1535 కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 68 కేంద్రాలను సెన్సిటివ్,36 కేంద్రాలు వల్నరబుల్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని అక్కడ గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు,ప్రధమ చికిత్స ఏర్పాట్లు, విద్యుత్, బెంచ్‌లు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు.పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పరీక్షా కేంద్రాలకు 100మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు జారీ చేయాలనిఆదేశించారు.పరీక్షాకేంద్రాల పరిధిలో పరీక్షలసమయంలో జిరాక్సు కేంద్రాలు, నెట్ కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.

# బంగ్లాపై భారత్ విజయం

## ఆరువికెట్ల తేడాతో బంగ్లాజట్టు ఓటమి

**దుబాయ్, ఫిబ్రవరి 20:** ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీలో భారత్‌బోణి కొట్టింది. దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తోజరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన బంగ్లా 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 231 పరుగులుచేసి విజయం సాధించింది. భారత ఓపెనర్ శుభ్‌మన్‌గిల్ 101 పరుగులుచేసి సెంచరీ వీరుడుగా నిలిచాడు. ఇంగ్లండ్‌పై సెంచరీ సాధించి దూకుడుపై ఉన్న కెప్టెన్ రోహిత్‌శర్మ 41పరుగులుచేసాడు. తొలి వికెట్‌కు ఓపెనర్ గిల్‌తోకలిసి పది ఓవర్లలోపే 69 పరుగులు జోడించాడు. రోహిత్ ఔట్ అయ్యా క్రీజులోకి వచ్చిన విరాట్ ఆచితూచి ఆడుతూ 22 పరుగులుచేసాడు. స్పిన్నర్ రిషద్ బౌలింగ్‌లోనే కోహ్లీ వికెట్ పడిపోయింది, శ్రేయస్ అయ్యర్ 15పరుగులేచేసి నిరాశపరిచాడు. అక్షర్‌పటేల్ 8 పరుగులుమాత్రమేచేసి నిరాశకు గురిచేసాడు. వికెట్లు పడుతున్నా ఏకాగ్రతకోల్పోకుండా శుభ్‌మన్‌గిల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెఎల్‌రాహుల్ 40 పరుగులుచేసి జట్టును గెలిపించాడు. కెఎల్‌రాహుల్; శుభ్‌మన్‌గిల్ ఇద్దరూ కలిసి జట్టును విజయం వైపు నడిపించారు. గిల్128 బంతుల్లో తొమ్మిదిఫోర్లు, రెండు సిక్సర్లతో 101 పరుగులుచేస్తే కెఎల్‌రాహుల్ 47 బంతుల్లో ఒకఫోరు, రెండుసిక్సర్లతో నాటౌట్‌గా నిలిచారు. బంగ్లా బౌలర్లలో రషీద్‌కు రెండు, తక్సిన్ అహ్మద్,రెహమాన్‌కు చెరోవికెట్ లభించింది.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు..

>>ఎపిఇఆర్‌సి మొత్తం ఆధాయాన్ని రూ.44.323.30 కోట్ల రుపాయాలను ఆమోదించగా ఇది డిస్కమీల దాఖలు కంటే కొంచెం ఎక్కువే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.12,632.40కోట్ల సబ్సీడిని భరించటానికి అంగీకరించినట్లు తెలిపారు. అన్ని వినియోగదారుల వర్గాలకు టారిఫ్ పెంపును నివారించినట్లు తెలిపారు. వ్యవసాయ వినియోగదారులు, ఉద్యానవన నర్సరీలు, చాకలి, ఆక్వాకల్చర్ రైతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగల కుటుంబాలు మొదలైనవాటితో సహ నిర్ధిష్ట వినియోగదారు వర్గాలకు రాయితీలు, ఉచిత విద్యుత్‌ను అందించే ప్రభుత్వ ఉత్తర్వులు అన్నీకూడా ఉచిత సబ్జీడిలో చేర్చినట్లు తెలిపారు. మొదటిసారిగా ఎపిఇఆర్‌సి స్వల్పకాలిక విద్యుత్ అవసరాల గురించి మరింత వాస్తవిక అంచనా కోసం హార్లీ డిస్పాచ్‌ను ద్వారా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని జెన్‌కోలు దిగుమతి చేసుకున్న బొగ్గును సేకరించేందుకు, ఆర్ఎస్ఆర్ మోడీ ద్వారా బొగ్గును రవాణా చేసుకునేందుకు అనుమతించినట్లు తెలిపారు.

ఏప్రిల్ 1-2025 నుండి ఇళ్లను నిర్మించుకునే లేదా పునఃనిర్మించే వ్యక్తులు వాణిజ్య టారిఫ్ బదులుగా డొమెస్టిక్ టారిఫ్‌లో బిల్ చేయబడతారని తెలిపారు. స్టాండిబై టారిఫ్‌లు ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సస్ కన్జమర్ మాత్రమే కాకుండా ఓపెన్ యాక్సస్ కన్జమర్స్‌కు వర్తిస్తాయని తెలిపారు. 150 కెడబ్ల్యు వరకు కనెక్ట్ చేయబడిన ఈవి చార్జింగ్ స్టేషన్‌లకు ఎల్‌టి వోల్టేజ్ స్థాయిలో విద్యుత్ సరఫరా చేయడానికి అమోదం తెలిపినట్లు తెలిపారు. డిమాండ్ చార్జీలు లేకుండా ఇవిల టారిఫ్ యూనిట్‌కు రూ.6.70 మాత్రమే వసూలు చేస్తాయని తెలిపారు. డొమెస్టిక్ వినియోగదారుల కోసం అదనపు లోడ్‌లను క్రబద్దీకరించే పథకాన్ని ఎపిఇఆర్‌సి అమోదించి, ఈ పథకం మార్చి 1నుండి జూన్ 30వరకు అమలులో ఉంటుందని తెలిపారు. అన్‌లైన్ విండో ద్వారా వినియోగదారులు స్వచ్ఛంధంగా అదనపు లోడ్‌లను ప్రకటించవచ్చునని తెలిపారు.

# గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో గ్రూప్2 ప్రధానపరీక్ష(మెయిన్స్) ప్రక్రియను నిలువరించాలంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను రాష్ట్ర హైకోర్టు గురువారం కొట్టేసింది. ప్రస్తుత వాజ్యాలలో కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి గ్రూప్-2 ఫలితాలు ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో మహిళలు, మాజీ సైనిక ఉద్యోగులు, క్రీడాకారులు, దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు కేటాయించడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ఈ విధంగా తీర్పు వెలువరించింది. ఫిబ్రవరి 23వ తేదీన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిలువరించాలంటూ పలువురు అభ్యర్థులు ఇటీవల ఎపి హైకోర్టును ఆశ్రయించారు. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించనున్న ప్రధాన పరీక్షను నిలుపుదల చేయాలంటూ వేసిన అనుబంధ పిటిషన్లపై న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

ప్రధాన వ్యాజ్యాలపై కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఫిక్స్ చేసి గ్రూప్-2 పోస్టులకు తాజాగా నోటిఫికేషన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశాఖకు చెందిన ఎం. పార్థసారథి, కడపకు చెందిన కనుపర్తి పెంచలయ్యతోపాటు మరో ఇద్దరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాదులు బొద్దులూరి శ్రీనివాసరావు, జీవీ శివాజీ వాదనలు వినిపించారు. ఎపిపిఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్.. రిజర్వేషన్ల అమలుతోపాటు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోను ఈ సందర్భంగా కోర్టు ముందు ఉంచారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న గ్రూప్ 2 ప్రధాన పరీక్షను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ ప్రిలిమినరీ పరీక్ష ఇప్పటికే ముగిసిందని, ప్రధాన పరీక్షను నిలువరించ వద్దని హైకోర్టును కోరిన విషయం విధితమే. అలాంటి వేళ.. ఎపి హైకోర్టు ఈ విధంగా తీర్పు వెలువరించింది.

# గ్రూప్-2 పరీక్షలకు భారీ ఏర్పాట్లు

>> కేంద్రాల్లో ఈపరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 23వ తేదీ ఉదయం 10గం.ల నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకూ పేపర్1 వ్రాత పరీక్ష ఉంటుందని అభ్యర్థులు ఉ.9.30 గం.ల లోపు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఉ.9.45 గం.లకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేయాలని ఆలస్యంగా వచ్చిన ఎవరినీ లోనికి అనుమతించ కూడదని స్పష్టం చేశారు. అదే విధంగా మధ్యాహ్నం 3గం.ల నుండి 5.30 గం.ల వరకూ పేపర్2 పరీక్ష ఉంటుందని అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 గం.ల లోగా ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని 2.45 గం.లకు ఆ పరీక్షా కేంద్రాలా గేట్లను మూసివేసి ఆతర్వాత ఎట్టిపరిస్థితుల్లోను అభ్యర్థులెవరినీ లోనికి అనుమతించకూడదని ఆమె స్పష్టం చేశారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి డిటైల్డ్ ఇన్‌స్ట్రక్షన్లతో కూడిన బుక్ లెట్‌ను అన్ని పరీక్షా కేంద్రాలకు పంపడం జరిగిందని ఆసూచనలన్నీ లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటిండెంట్లు, ఇన్విజిలేటర్లు తుచ తప్పక పాటించి పరీక్షలు సజావుగా జరిగేలే చూడాలని చెప్పారు. గ్రూపు2 మెయిన్ పరీక్షలకు సంబంధించి సోషల్ మీడియాలో పరీక్షలు వాయిదా పడతాయని, ఇతర దుష్ప్రచారం జరుగుతోందని అటువంటి వేమీ అభ్యర్థులు నమ్మవద్దని ఎట్టి పరిస్థితుల్లోను ఈనెల 23వ తేదీన ఈ పరీక్షలను సజావుగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చైర్మన్ అనురాధ స్పష్టం చేశారు.పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేనివిధంగా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలక్టర్లు, ఎస్పిలకు ఆమె సూచించారు.అలాగే పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించాలని చెప్పారు.అదే విధంగా పరీక్షా కేంద్రాల సమీపంలో పరీక్షల సమయంలో జిరాక్సు,నెట్ కేంద్రాలన్ని మూసి ఉంచాలన్నారు.పరీక్ష హాల్లోకి మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర పరికరాలను ఎట్టిపరిస్థితుల్లోను లోనికి అనుతించరాదని తెలిపారు. అంతేగాక అవసరమైన మేర పరీక్షా కేంద్రాల్లో సిసిటివి కవరేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ అనురాధ కలక్టర్లకు సూచించారు.

రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎక్కడైనా సోషల్ మీడియా లేదా ఇతర ప్రచార మాధ్యమాల్లో నకిలీ వార్తలు ప్రసారం చేస్తే వెంటనే స్పందించి పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలక్టర్లకు సూచించారు.అలాంటి వార్తలపై వెంటనే స్పందించి కౌంటర్ చేయడం తోపాటు తప్పుడు లేదా నకిలీ వార్తలు ప్రసారం చేస్తే అలాంటి వారిపై చట్ట పరంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్,ఆశాఖ కమీషనర్ కృతికా శుక్ల, సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల,ఎపిపిఎస్సి కార్యదర్శి ఐఎస్ మూర్తి తదితర అధికారులు పాల్గొనగా వర్చువల్‌గా జిల్లా కలక్టర్లు, ఎస్పిలు, సిపిలు,ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 21-02-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
అష్టమి ఉ.11.59
అనూరాధ ప.3.53
వర్జ్యం : రా.9.54-11.37
దు.ఉ.9.00-9.47
2) మ.12.53-1.40
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. చికాకులు ఎక్కువ అవుతాయి.

**వృషభం :** మీ ఊహలు నిజమయ్యే సూచనలు లేవు. ప్రయాణాలు వద్దు.

**మిథునం:** శ్రమపడ్డా ఫలితం దక్కదు. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

**కర్కాటకం:** కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** సంఘంలో ఆదరణ పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవదర్శనాలు.

**తుల :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:**ముఖ్యమైన నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలు.

**ధనుస్సు:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వాహనయోగం.

**కుంభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభవార్తలు.

**మీనం :** వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైన పట్టుదలతో అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ఆచార్య యార్లగడ్డ భేటీ

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ సయ్యద్ అబ్దుల్ నజీర్ ను రాజ్య సభ పూర్వ సభ్యులు, విశ్వ హిందీపరిషత్తు జాతీయ అధ్యక్షులు, పద్మభూషణ్ అచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసారు. గురువారం విజయవాడ రాజ్ భవన్ లో జరిగిన భేటీ సందర్భంగా యార్లగడ్డ తాజాగా రచించిన అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ హిందీ, డోనాల్డ్ ట్రంప్ అంగ్ల పుస్తకాలను గవర్నర్ కు బహుకరించారు. అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ పుస్తకాన్ని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అవిష్కరించిన విషయం విదితమే. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకంలో రాష్ట్ర పభుత్వం అనుసరించిన విధానం అభినందనీయమని, కులపతి హోదాలో గవర్నర్ అమలు చేసిన తీరు అందరి ప్రశంసలు అందుకుందని గవర్నర్ నజీర్ కు వివరించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిభకు పట్టం కడుతూ ఉప కులపతుల నియామకం జరిగిందన్నారు. విశ్వవిద్యా లయాను ప్రక్షాళన చేసే దిశగా ప్రతిభకు పట్టం కట్టారని ప్రశంసించారు. వివిధ విశ్వవిద్య లయాలు, ప్రత్యేకించి ఆంధ్రా విశ్వవిద్యా లయంలో నెలకొన్న క్రమ శిక్షణా రాహిత్యంపై దృష్టి సారించాలని యార్లగడ్డ గవర్నర్ కు విన్నవించారు. రాష్ట్రంలో హిందీ ప్రచారం, సాహిత్య సృజనల వికాసాన్ని వివరిస్తూ అలూరు భైరాగి, అచార్య ఆదేశ్వరరావుల కవితలను వైఎల్పి వినిపించారు. ఆంధ్రప్రదేశ్ కు సర్ అర్థర్ కాటన్ అందించిన సేవలు సైతం వీరి మధ్య చర్చకు వచ్చాయి.

## పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై మంత్రి సవిత ఆందోళన!



**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** కొండపి ఎంజేపీ బాలుర పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది నితంతరం అప్ర మత్తంగా ఉండాలని, విద్యార్థుల భద్రత పట్ల బాధ్యతతో మెలగాలని గురుకులం కార్యదర్శి మాధవీలతను ఫోన్లో ఆదేశించారు. గురువారం ఉదయం కొండపి ఎంజేపీ బాలుర పాఠశాలలో అయిదో తరగతి చదువున్న మధుమోహన్ పాలు తాగడానికి కిచెన్ రూమ్ కు వెళ్లాడు. పాలు తాగి వస్తున్న క్రమంలో పక్కన టేబుల్ పై ఉన్న వేడి పాలుతో ఉన్న గిన్నె దొర్లి మధుమోహన్ పై పడిపోయింది. దీంతో బాలుడి చాతి కింద, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ఇన్చార్జి అంకిరెడ్డి బాలునికి వైద్య సేవలందించారు. ఘటన జరిగిన వెంటనే ఎంజేపీ ఇన్చార్జి వార్డెన్ స్రవంతి బాలుని తల్లిదండ్రులకు సమాచారమందించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి సవిత.గురుకులం కార్యదర్శి మాధవీలతతో ఫోన్ లో మాట్లాడారు. బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాలుని ఆరోగ్యం నిలకడగా ఉందని, తీవ్ర గాయాలు కావడంతో మరో మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నట్లు వెల్లడించారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, బాలునికి మెరుగైన వైద్యమందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు బాలుని ఆరోగ్యంపై వివరాలు అందివ్వాలని స్పష్టంచేశారు. వేడి పాలు ఉన్నచోట హాస్టల్ నిర్వాహకులు, సిబ్బంది లేకపోవడంపై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత హెచ్చరించారు.స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డొక్కా బాలవీరాంజనేయులుతోనూ మంత్రి సవిత మాట్లాడారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే మంత్రి బాలవీరాంజనేయులు ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, విద్యార్థికి మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు. ఎంజేపీ స్కూల్లో జరిగిన ఘటనపై మంత్రి సవితకు మంత్రి బాలవీరాంజనేయులు సమాచార మందించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు.

## 'గర్భాలయ శిఖర కలశాలు అపవిత్రం'

### ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం గర్భాలయ కలశాలు అపవిత్రం జరిగిందని మాజీ ధర్మకర్తల మండలి అంజూరు తారక శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2022లో కూడా ఇలా జరిగి గందరగోళం మారిందన్నారు. కుంబాభిషేకాల సమయంలో అర్చకులు కలశాలకు అభిషేకించటానికి తప్ప మరెప్పుడు తాకలేదన్నారు.

గర్భాలయ శిఖరాలపై ఏదైనా చేయాలంటే సంప్రదాయబద్దంగా ఆగమ నిబంధనల ప్రకారం చేయాలని అలా కాకుండా చేస్తే చేదు అనుభవాలు ఎదుర్కొన్నారని శ్రీనివాసులు ఆరోపించారు. 2020లో ఏం జరిగిందో ఆలయాధికారులు గుర్తించుకోవాలన్నారు.ఇప్పటికైనా అధికారులు జరిగిన పొరబాటును గుర్తించి సరిదిద్దాలన్నారు.

## బాలికల రక్షణ కోసం ఆద్య పేరిట సరికొత్త కార్యక్రమం

- రాష్ట్రంలోనే తొలిసారి నసనకోట ఎంజెపి పాఠశాలలో ప్రారంభం
- ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త బ్యూరో** బాలికల శక్తిని తెలియజేస్తూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కల్పించే విధంగా రాష్ట్రంలో తొలిసారి శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఆద్య అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్, ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నసనకోట ఎంజెపి పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, ట్రైనీ కలెక్టర్ వినూత్న, ఇతర అధికారులు, మేధావులు హాజరయ్యారు. ముఖ్యంగా బాలికలు చదువుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రేమ, వ్యామోహాలు, సోషల్ మీడియా వంటి వాటికి ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. బాలికలపై ఎవరైనా కనెన్నెత్తి చూడాలంటే భయపడే విధంగా రాష్ట్రంలో పోలీసులు కీచకులను ఎన్కౌంటర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలికలు చిన్న వయస్సులోనే ప్రేమ ఇతర వాటిపై ఆకర్షితులు కాకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనుక్షణం తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ అన్నది అరచేతిలో అద్భుతమని, అదే మీకు శాపంగా మారకుండా చూసుకోవాల న్నారు. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలన్నారు. బాలికల రక్షణ కోసం పోలీసులు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని, సైబర్ క్రైమ్ డ్రగ్స్ వంటి వాటిపై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అమ్మాయిలను చదివిస్తుం టారని వారి నమ్మకాలను వమ్ముచేయకుండా మీరు చదువుకోవాలన్నారు. ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం మొత్తం మీ పాఠశాల, గ్రామాలపై పడుతుందని ఆమె అన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వైద్యులు, సిబ్బందిపై వేటు తప్పదు

### - రాష్ట్ర ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మంత్రి వాసంశెట్టి సుభాష్




**సచివాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** కార్మికులకు ఉచితంగా ఉత్తమ వైద్య సేవలు అందజేయాలనే లక్ష్య ంతోనే ఈఎస్ఐ ఆస్పత్రులను ఏర్పాటు చేయడం జరిగిందని,అయితే అటు వంటి లక్ష్యానికి విఘాతం కల్పించే విధంగా ప్రవరి ్తంచే వైద్యులు,సిబ్బందని ఏమాత్రం ఉపేక్షించబోమని రాష్ట్ర కార్మిక,ఫ్యాక్టరీలు,బాయిలర్ ్స,ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాక మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు.రాజమండ్రి ఇఎస్ఐ వైద్యులు,సిబ్బంది విధుల పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరినీ స్వయంగా గమనించిన తదుపరే 5గురు వైదు ్యలను,4గురు ఔట్‌సోర్సి ంగ్ సిబ్బందిన సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటి సెల్లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాటా ్లడుతూ రాజమండ్రి ఈఎస్ఐ వైదు ్యలు,సిబ్బంది విధులపట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిదోరణి వల్ల ఆస ్పత్రిలో ఓపి గరిష్టంగా 50కూడా లేదని,అయితే వీరిని సస్పెండ్ చేసిన తదుపరి ఓపి 170కి పెరిగిందనే విషయాన్ని ఆయన స్పష్టంచేశారు.తిరుపతి ఇఎస్ఐ వైద్యులు విదుల పట్ల ప్రత్యేక శ్రద్ద చూపడం వల్ల ఆ ఆస్పత్రిలో చాలా మంచి వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని తద్వారా అక్కడ ఓపి దాదాపు 350దాకా ఉందన్నారు.గత ప్రభుత్వం ఈఎస్ఐ లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం జరిగిందని,కాకినాడ ఈఎస్ఐ ఆస్పత్రిని కేంద్రప్రబుత్వానికి అప్పగించిందన్నారు.

రాష్ట్రంలోని కార్మికుల భద్రతకు,సంక్షేమానికి ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యదిక ప్రాదాన్యతను ఇస్తుందని,ప్రస్తుతం ఉన్న 78డిస్పెన ్సరీలకు అదనంగా మరో 18డిస్పెన్సరీలను తమ ప్రబుత్వం మంజూరు చేయడం జరుగుతుందన్నారు.తమ ప్రభుత్వం ఏర్పడిన 9నెలల కాలంలోనే అమరావతిలో 500పడకల ఈఎస్ఐ సెకండరీ కేర్ ఆస్పత్రితో పాటు ఇఎస్ఐ మెడికల్ కళాశాలను మరియు 150పడకల సూపర్ స్పెషాలిటి ఆస్పత్రిని ఏర్పాటు చేసే ప్రతిపాదనలను ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్‌కు పంపడం జరిగిందన్నారు.తిరుపతి ఈఎస్ఐని 50పడకల నుంచి 100పడకల సామర్ా ్యనికి పెంచే చర్యలు చేపట్టామన్నారు.తద్వారా 97రెగ్యూలర్ పోస్టులు,94ఔట్‌సోరి ్సంగ్ పోస్టులు మంజూరు చేయడం జరిగిందన్నారు.కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని విశాఖ ఫార్మాసిటీలో సిఎస్ఆర్ నిధులతో మొబైల్ ఐసి యూనిట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇఎస్ఐ సంచాలకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

## వల్లభనేని వంశీ కస్టడీ, హెల్త్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. ఈ రెండు పిటిషన్లపై ఎస్సీ ఎస్టీ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. వంశీతో పాటు మరో ఇద్దరి కస్టడీ పిటిషన్లపైనా న్యాయస్థానం తీర్పు ఇవ్వనుంది. గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దళిత యువకుడు సత్యవర్ధన్ కిడ్నాప్ దాడి కేసులో ఇటీవల వల్లభనేని వంశీని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన విజయవాడలోని జిల్లా జైలులో ఉన్నారు.

## యూట్యూబర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ప్రభుత్వ భూవివాదమే హత్యకు కారణం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి శ్రీనివాస్



అరెస్ట్ అయిన ముద్దాయిలను చూపుతున్న పోలీసులు

**గుంతకల్లు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** గత ఐదు రోజుల క్రితం జరిగిన యూట్యూబర్ భోగాల తిరుమలరెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రభుత్వ భూమి వివాదమే హత్యకు కారణమని తెలిపారు. ఈ మేరకు గురువారం కసాపురం పోలీసుస్టేషన్ ప్రాంగణంలో డిఎస్పి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మండలంలోని సంఘాల గ్రామానికి చెందిన ముద్దాయి జీవన్‌కుమార్ తనకున్న నాలుగు ఎకరాల పొలం పక్కనే వున్న ఒక ఎకరం ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాడని తెలిపారు. బివిఆర్ న్యూస్ టుడే యూట్యూట్ ఛానెల్ నిర్వహిస్తున్న తిరుమలరెడ్డి ప్రభుత్వ భూమిని ఎలా సాగు చేసుకుంటావని అభ్యంతరం తెలిపాడని పేర్కొన్నారు. భూమిని సాగు చేసుకుంటున్న విషయాన్ని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసి డబ్బులు డిమాండ్ చేశాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం పెరిగి పెద్దదైందన్నారు. తిరుమలరెడ్డిని అడ్డు తొలగించుకోవాలని భావించిన జీవన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు, కసాపురం గ్రామానికి చెందిన బోయ రామన్నల సహాయంతో ఈనెల 17వతేదీ ఉదయం 7.45 గంటల సమయంలో సొంత పొలానికి బైకుపై వెళుతున్న తిరుమలరెడ్డిని ట్రాక్టర్‌తో బలంగా గుద్ది హంద్రీనీవా కాలువలో పడవేశారన్నారు. మృతుని భార్య కామేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయిలను గురువారం అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఒక ట్రాక్టర్, మోటర్‌సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డిఎస్పి తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టిపి వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. కేసు ఛేదింపులో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుళ్లు జాఫర్, కిషోర్‌కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, అంజి, నూర్‌అహ్మద్‌లను డిఎస్పి అభినందించారు.

## శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శేషగిరిరావు ఒక ప్రకటచనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని సూచించారు. 18 సీట్లున్న మినీ ఏసీ బస్సు ఈ నెల 25న సాయంత్రం ఆరింటికి రాజమహేంద్రవరంలో బయలుదేరుతుందని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు విజయవాడ బెర్మ్‌పార్కు హోటల్ వద్దకు చేరుతుందని వివరించారు. పదింటికి మళ్లీ బయలుదేరి 26న ఉదయం శ్రీశైలం చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడి పర్యాటకాభివృద్ధి సంస్థ హోటల్‌లో అల్పాహారం, మధ్యాహ్నభోజన సదుపాయం కల్పిస్తున్నట్లు ఈడీ వివరించారు. టిక్కెట్ ధర పెద్దలకు రూ.4360 పిల్లలకు రూ.3490గా నిర్ణయించినట్లు తెలిపారు. దర్శనం అనంతరం బస్సు తిరుగు ప్రయాణంలో త్రిపురాంతకం మీదుగా 27న తెల్లవారుజామున రెండింటికి విజయవాడ, ఉదయం ఆరింటికి రాజమహేంద్రవరం చేరుకుంటుందని ఈడీ వివరించారు. వివరాలకు 9848629341, 9848007025 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పింఛన్ల వెరిఫికేషన్ పారదర్శకం

### - రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్




**సచివాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్లు వెరిఫికేషన్ ఎంతో పారదర్శకంగా జరుగుతుందని రాష్ట్ర ఎమ్ఎస్ఎంఈ,సెర్ప్,ఎన్నారై ఎంపవర్‌మెంట ్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 8లక్షల దివ్యాంగులకు సామాజిక భద్రతా ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని,ఇందులో ఇప్పటివరకు 1.20లక్షల పింఛన్లు వెరిఫికేషన్ పూర్తయినట్లు తెలిపారు.గతంలోని నియమ నిబంధల ప్రకారమే ఈ ఫించన్లు వెరిఫికేషన్ జరుగుతుందని,అర్హులైన ఏ ఒక్కరికి ఎటువంటి అన్యాయం జరగదన్నారు.ఒక జోన్‌లోని వైద్యులు మరో జోన్‌లో వెరిఫికేషన్‌ను ఎంతో పారదర ్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎమ్ఎస్ఎంఈ ల సర్వే కూడా ముమ్మరంగా సాగుతున్నందని, ఇప్పటివరకు 50శాతం మేర సర్వే పూర్తయిందని,ఈసర్వేకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుది గడువు నిర్ణయించినట్లు మార్చి 15కల్లా ఈ సర్వే పూర్తవుతుందని ఆయన తెలిపారు.

## రాజశేఖరం మృతి పార్టీకి తీరని లోటు

**పాలకొండ (మన్యం జిల్లా), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పాలవలస రాజశేఖరం మృతి వైఎస్సా ర్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఆయన తాము పెద్ద దిక్కును కోల్పోయామని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సా ర్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మన్యం జిల్లా పాలకొండ పట్టణంలోని పాలవలస రాజశేఖరం ఇంటికి వచ్చిన సందర్భంగా రాజశేఖరం భార్య రేగిడి మండలం జెడ్పీటీసీ పాలవలస ఇందుమతిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజశేఖర్ మృతి వార్త నన్ను కలచి వేసింది అన్నారు. తండ్రి సమానుడు తాను పార్టీలో ఎదుగుదలకు నా వెంట నడిపించారని జగన్మోహన్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. మరణ వార్త తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నారు.

## హాబీట్రాట్స్ ట్రస్ట్ గ్రాంట్ 8వ ఎడిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ, సామాజిక, సాంకేతిక అంశాలపై ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత ్సహించే లక్ష్యంతో భారత దేశ సహజ ఆవాసాలు, స్వదేశీ జాతులను రక్షించడానికి స్వలాభాపేక్ష లేని తాము ఈ ఏడాది ది హాబీటాట్స్ ట్రస్ట్ గ్రాంట్స్ 8వ ఎడిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు హాబీటాట్స్ ట్రస్ట్ అధిపతి రుషికేష్ చవాన్ ప్రకటించారు. ఈనెల 15 నుండి మార్చి 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫైనల్ వివరాలు అక్టోబర్ 2025లో వెల్లడిస్తామన్నారు.

## ముంబయిలో పర్యటించిన మంత్రి నారాయణ, సిఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో రాజధాని అమరావతి పాటు,కీలక నగరాల అభివృద్ది లక్ష్యం రాష్ట్ర పురపాలక శాఖా మంత్రిత్వ శాఖ కీలక చర్యలు చేపట్టింది.ఈ క్రమంలో ముంబయి నగరానికి వెళ్ళారు.అక్కడ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అధారిటీ (ఎంఎంఆర్‌డిఏ), సిడ్కో అధికారుల తో మంత్రి నారాయణ, సీఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబులు ఇతర అధికారులు సమావేశమయ్యారు. ఎంఎంఆర్‌డిఏప్లానింగ్ డైరెక్టర్ శంకర్ దేశ్ పాండే,ఇతర విభాగాల అధికారులుముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్న ఎంఎంఆర్‌డిఏముంబయి లో రోడ్లు, మెట్రో రైలు,హౌసింగ్ ప్రాజెక్టులు చేపడుతున్న ఎంఎంఆర్‌డిఏరోడ్లు అభివృద్ధి,మెట్రో రైలు ప్లానింగ్, రవాణా ప్రణాళికలు, ఇళ్ల నిర్మాణం,రీజినల్ డెవలప్మెంట్,నిధుల సమీకరణ పై మంత్రి నారాయణకు ముంబై అధికారులు వివరించా రు. విదేశీ పెట్టుబడుల సహకారంతో మౌళిక వసతులను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని మంత్రికి వివరించిన లీలీళిదీతి అధికారులుప్రభుత్వ ప్రాజెక్టుల కోసం నిధుల సమీకరణ చేస్తున్న విధానాలు తెలుసుకున్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

### నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రు.25వేలకోట్ల బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షులు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావులు గురువారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తమ డిమాండ్లను తెలిపారు. రాజధానితో పాటు 26 జిల్లా కేంద్రాల్లో రు.500కోట్లతో వెంచర్లు వేసి సబ్సిడీపై ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇళ్ళస్థలాలు కేటాయించి వారి స్వంతింటి కల నెరవేర్చాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగికి రు.3 నుండి రు.5లక్షల మేర ప్రభుత్వం బకాయి వుందని , డిఏ బకాయిలు నగదు రూపంలో చెల్లించాల్సి న నగదుతో కలిపితే మరింత పెరుగుతుందని వీటి చెల్లింపుపై ప్రభుత్వం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తక్షణ నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగి అనుమతితో ఆ బకాయిలను 30శాతం సబ్సిడపై ఇళ్ళస్థలాలను కేటాయించడం ద్వారా స్వంతింటి కల నెరవేర్చాలన్నారు.

## మహాకుంభమేళాలో ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్ పుణ్యస్నానం



**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చంద్రయాన్-3తో గఘన కీర్తిని కట్టబెట్టిన ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్యాత్మికతపరంగాను ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్, డిఓఎస్ అధ్యక్షునిగా అత్యంత ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు కూడా ఆయన పదేపదే ఆధ్యాత్మిక భావాలు వెలిబుచ్చేవారు. సంస్కృత భాషలోనూ కొంత పట్టున్న సోమనాథ్ దక్షిణ భారతదేశంలో పేరెన్నిక కలిగిన పలు ఆలయాలను సందర్శించి ఉన్నారు. గత నెలలో ఇస్రో ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు విరమించిన తర్వాత ఆధ్యాత్మికతపరంగా మరింత చొరవ చూపిస్తున్నారు. ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అధికారదర్పం ఎలాగో ఉంటుంది. ప్రస్తుతం ఆయన సాధారణ పౌరుడిగా ప్రయాగరాజ్ త్రివేణి సంగమ తీరంలో కొంతసేపు పడవ కోసం నిరీక్షించి అనంతరం పుణ్యస్నానం ఆచరించారు. మహాకుంభమేళాలో సోమనాథ్‌ని చూసిన భక్తులు ఆయన సాదాసీదాగా ఒక చిన్న బ్యాగు పట్టుకొని నిరీక్షించడాన్ని ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం సోమనాథ్ ప్రయాగరాజ్ తీరంలో పడవ కోసం నిరీక్షించడం, పుణ్యస్నానం చేయడం వంటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విరివిగా కనిపిస్తున్నాయి. భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు గొప్ప విజయాలను అందించిన శాస్త్రవేత్త ఇంత సాధారణంగా వ్యవహరించడాన్ని చూసి అక్కడి భక్తులు, సందర్శకులతో పాటు ఈ దృశ్యాలను తిలకించిన వారు కూడా ఆయనను మరింత గౌరవభావంతో చూస్తున్నారు. భారత శాస్త్ర సాంకేతికరంగంలోని ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని ఇది ప్రతిబింబించిందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

राष्ट्रीय परीक्षा एजेंसी
National Testing Agency
Excellence in Assessment
IIM BODH GAYA
IIM JAMMU
(उच्चतर शिक्षा विभाग, शिक्षा मंत्रालय, भारत सरकार के तहत एक स्वायत्त संगठन
(An Autonomous Organization under the Department of Higher Education, Ministry of Education, Government of India)

2025 మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్‌లో, జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం కొరకు
ఆన్‌లైన్ దరఖాస్తుల ఫారం

ది నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) 2025-26 విద్యా సంవత్సరం కొరకు IIM బోధ్‌గయ మరియు IIM జమ్ము వద్ద 5-సంవత్సర ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ ప్రవేశం కొరకు JIPMAT 2025 క్రింది వివరాల ప్రకారం నిర్వర్తిస్తోంది.

| | |
|---|---|
| ఆన్‌లైన్ దరఖాస్తుల ఫారం యొక్క దాఖలు | 11వ ఫిబ్రవరి, 2025 నుండి 10వ మార్చి, 2025కు (మ.11.50 గం. వరకు) |
| ఆన్‌లైన్ దరఖాస్తుల యొక్క ఫీజు దాఖలు | 11వ ఫిబ్రవరి, 2025 నుండి 11వ మార్చి, 2025కు (మ.11.50 గం. వరకు) |
| ప్రత్యేక వివరాలలో కరెక్షన్ | 13వ మార్చి, 2025 నుండి 15వ మార్చి 2025కు |
| పరీక్ష యొక్క తేది | 26వ ఏప్రిల్, 2025 (శనివారం) |
| పరీక్ష యొక్క సమయం | మ.03.00 గం. నుండి సా.05.30 గం.కు |
| పరీక్షా విధానం | కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (CBT) |
| పేపర్ రకం | మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు |

స్కీమ్/వ్యవధి/మీడియం/పరీక్ష యొక్క సిలబస్, అర్హతా ప్రమాణం, తత్కాలికంగా ఇన్‌టేక్, సీట్ల రిజర్వేషన్, పరీక్షా నగరాలు, ముఖ్యమైన తేదీలు వగైరాలు https://exams.nta.ac.in/JIPMAT/ పై ఉంచిన సమాచార బులెటిన్‌లో పేర్కొనబడ్డాయి. పరీక్షలో హాజరు కావటానికి ఆసక్తి గల అభ్యర్థులు, JIPMAT 2025 కొరకు సవివర సమాచార బులెటిన్ చదవవచ్చు మరియు https://exams.nta.ac.in/JIPMAT/ వద్ద ఆన్‌లైన్ మాత్రమే దరఖాస్తు చేయాలి. పరీక్ష ఫీజు SBI & HDFC బ్యాంక్ చెల్లింపు గేట్‌వేను ఉపయోగించి నెట్ బ్యాంకింగ్/డెబిట్ కార్డ్/క్రెడిట్ కార్డ్/UPI ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవలసి ఉంది. సంబంధిత IIMs యొక్క అర్హతా ప్రమాణాన్ని దరఖాస్తుదారులు చెక్ చేసుకోవాలి. అభ్యర్థులు NTA వెబ్‌సైట్ https://exams.nta.ac.in/JIPMAT/ తో టచ్‌లో ఉండవలసినదిగా సూచించడమైనది. అభ్యర్థులు jipmat@nta.ac.in వద్ద NTAకు రాయవచ్చును లేదా 011-40759000 వద్ద NTAకు పిలుపు ఇవ్వవచ్చును.

సం/-
డైరెక్టర్ (పరీక్షలు)
CBC 21354/12/0007/2425

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యసిద్ధి అవసరం.

న-సి.డబ్ల్యు.వెండైట్

# 'ప్రక్షాళన' మొదలు!

దేశంలో నదులన్నీ జీవనదులే. నదీ స్నానాలకు విశేష ప్రాధాన్యత ఉంది. పర్వదినాలప్పుడు భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఆ నదుల్లో పుణ్యస్నానాలాచరిస్తుంటారు. పన్నెండేళ్లకో సారి ఆయా నదులకు పుష్కరాలూ జరుపుతుంటారు. ప్రస్తుతం మహాకుంభమేళాలో పవిత్ర స్నానాల కోసం జనం తండోపదండాలుగా వచ్చి వెళ్తున్నారు. ఒకరోఇద్దరో కాదు తాజా లెక్కల్ని బట్టి 57కోట్ల మంది స్నానం చేసి వెళ్లారు. అంతటి అమృత స్నానాలు కారణంగా గంగా, యమున, సరస్వతి నదులను త్రివేణి సంగమ పవిత్ర భూమిగానే కొలుస్తాం. కానీ నదీ జలాలు అనేక కారణాల చేత కాలుష్యంతో నిండిపోయాయి. పర్యావరణ శాస్త్రజ్ఞులు వీటి విషయంలో జాగ్రత్తలు చెబుతూనే ఉంటారు. నదులు తమ సహజ స్వరూపస్వభావాలను కోల్పోవడం తెలిశాక వాటి సంరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సంకల్పించిన ప్రభుత్వాలు వాటి మీద పలు కారణాల వలన శ్రద్ధ చూపించలేకపోయాయి. నదుల్లో కాలుష్యం నియంత్రించలేని స్థాయికి చేరుకున్నదని ఏనాడో గుర్తించారు. ఒక అడుగు ముందుకు పడలేదు. ఆయా నదుల్లో మురుగు నీటి ప్రవాహాల వలన కశ్మల కాసారాలుగా పేరుకుపోతున్నాయి. ఇదే పరిస్థితి దేశ వ్యాప్తంగా తారసిల్లుతోంది. పారిశ్రామిక వ్యర్థజలాలే కాదు, ప్లాస్టిక్‌తో కూడిన చెత్తకూడా చివరకు చేరేది ఈ నదీ తీరానికే. నదుల్లో కాలుష్య నియంత్రణకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ప్రత్యేకించి నడుం కట్టిన సందర్భాలు లేవు. జాతీయ హరిత ట్రిబ్యునల్ కూడా అనేక కేసుల్లో వీటి విషయాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నది. గోదావరి, కృష్ణా జలాల్లో సైతం తీసుకున్న జలనమూనాలన్నీ విష లోహాలతో నిండిఉన్నట్లు నివేదికలొచ్చాయి. ఆర్సెనిక్, నికిల్, కాడ్మియం, క్రోమియం వంటి రసాయనిక పదార్థాలు కలిసి ఉన్న ఈ జలాల వలన వాటిని తాగునీరుగా వాడే జనానికి అనారోగ్యహేతువవుతున్నాయి. దేశంలోని 187 నదుల్లో నీరు అత్యంత కాలుష్యాన్ని మోసుకెళ్తున్నట్లు చెప్పుకుంటారు. గంగానదిలోకి ఉత్తరాదిన దాదాపు అన్ని ప్రధాన పట్టణాల నుంచి రోజూ 300కోట్ల లీటర్లకు పైగా మురుగునీరు వచ్చి చేరుతోందని అంచనా. విష రసాయనాలు, క్రిమిసంహారక మందులు, ఇవిగాక పశు కళేబరాలు, మృతదేహాలు కూడా ఈ నదుల్లో కలిసిపోతుండడం వల్ల పవిత్ర నదులుగా భావించే మనం తీరా స్నానం చేస్తే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరతాయో ననే భయం పట్టుకుంటోంది. అందుకే నదీజలాలు తాగునీటిగా ఉపయోగపడవనే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వచ్చేసింది. నదీ కాలుష్యం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇటీవలనే చేసిన అధ్యయనాన్ని బట్టి గంగానది ఇప్పుడు నీటిలో మలసంబంధిత బ్యాక్టీరియా నిండిపోయింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఈ నెల 3న సమర్పించిన నివేదికను బట్టి ఈ నది నీటి నాణ్యత స్నానానికి పనికిరాదు. హరిద్వార్‌లోనూ గంగానది కలుషితమైంది. 1986లో కేంద్రప్రభుత్వం గంగానది శుద్ధికోసం 'నమామి గంగే' ప్రాజెక్టు ప్రారంభించింది. వేలాది కోట్లు ఖర్చుచేసినా సత్ఫలితాలు సాధించ లేకపోయారు. అమెరికా, యూరప్ వంటి పశ్చిమదేశాల్లో నదులను అత్యంత శుభ్రంగా ఉంచుకోవడం మనకు తెలిసిన విషయమే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిన రోజుల్లో కూడా మురుగునీటి శుద్ధి పారిశుధ్య సంరక్షణ వంటి విషయాల్లో వెనుకబడి ఉన్నామనే మన కార్యాచరణలో లోపముందన్నది తేటతెల్లం. ఆ నేపథ్యంలోనే యమునా నదీ కాలుష్యస్థాయిలు నానాటికీ పెరిగిపోయా యని పెద్ద చర్చేసాగుతోంది. నిన్నమొన్నటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడాయమునా నది కాలుష్యం గురించిప్రచారంజరిగింది. ప్రధాన పోటీ లో ఉన్న ఆప్, భారతీయ జనతాపార్టీలు యమునా నదీ జలాలు ప్రక్షాళనపై విసుర్లు కూడా విసురుకున్నాయి. కానీ చివరకు 'యమునా నది ప్రక్షాళన' తాము చేస్తామంటే తాము చేస్తామని హామీలు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం అండదండలు లేకుండా ఇలాంటి మహత్తర కార్యక్రమాలు చేయడం కష్టసాధ్యం. అయినా 'ఆప్' కూడా ఆ పాటే పాడింది. 2020లోనే ఆమ్ ఆద్మీపార్టీ ఢిల్లీ పీఠం ఎక్కినా కేంద్రప్రభుత్వంతో వైరంతో యమునా నదిప్రక్షాళన ఊసేఎత్తలేదు. ఏమైతేనే పాలకులుఎవరైనా, ఏపార్టీ వారైనా ప్రక్షాళన అవసరమేనని ఒప్పుకున్నారు. అనుకున్నట్లుగానే ఈ నెల 16 నుంచి యమునా నది శుద్ధిపనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. నిత్యం పారిశ్రామిక వ్యర్థాలు, 3 కోట్లకుపైగా జనాభా ఉన్న ఢిల్లీ ప్రాంతాల నుంచివస్తున్న మురుగు కూడా దీనిలోనే కలుస్తాయి. 4అంచెల ప్రణాళిక తో ముందుకు వెళ్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడకుండానే ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పనులు మొదలయ్యాయి. యమునా నది ఉత్తరాఖండ్ హిమాల యాలను దాటి హర్యానా, యుపి సరిహద్దుల మీదుగా ప్రవహించి ఢిల్లీకి చేరుకుంటుంది. ప్రస్తుతానికి ఈ 57 కిలో మీటర్ల మేర పనులు పూర్తి చేస్తారు. ఢిల్లీని దాటితే మధుర ఆగ్రాల ప్రాంతంలో కూడా నదీజలాలు కాలుష్యమే. నదిశుభ్రం కోసం క్లీనింగ్ ఆపరే షన్ మొదలెట్టారు. ట్రాష్ స్కిమ్మర్లు, వీడ్ హార్వెస్టర్‌లు, డ్రెడ్జి యుటిలిటీ యూనిట్లతో నదిని శుభ్రం చేస్తున్నారు. సుందరీకరణ, కాలుష్యం కలిగించే వ్యర్థాల తొలగింపు జరుగుతోంది. మురుగునీటితో పేరుకుపోయిన మేటలను డ్రెడ్జింగ్ యంత్రాలు తొలగిస్తాయి. ఆ తర్వాత సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంటులను ఏర్పాటుచేయిస్తారు. ఏమయితేనేం ఢిల్లీ విషయంలో కేంద్రం ఓ ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర నదుల్లో కాలుష్యం తొలగించేందుకు కూడా యుద్ధప్రాతిపదికపై నడుం కట్టాల్సి న ఆవశ్యకత ఉంది.



కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.

జార్జి బెర్నార్డ్ షా



మీరు గౌరవాన్ని కోరుకుంటే, ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.

శామ్యూల్ జాన్సన్

## ప్రజావాక్కు



### కుల భావజాలానికి కాలం చెల్లింది!

వైకాపానేత, పులివెందుల శాసనసభ్యులు జగన్ మోహన్ రెడ్డి తన విజయవాడ పర్యటనలో చంద్రబాబు నాయుడుకి తన సామాజిక వర్గానికి చెందిన వారు ఎదగటం ఇష్టం ఉండదంటూ ఒక వ్యర్థప్రేలాపన చేశారు. వల్లభనేని వంశీని అరెస్టు చేస్తే న్యాయ పోరాటం చేయవచ్చు. జగన్ అందుకు అన్నివిధాలా సహాయ పడవచ్చు. ఇక్కడ కుల ప్రస్తావన అసంబద్ధం, దివాళా కోరు రాజకీయాలకు పరాకాష్ఠ! గతంలో కులాలమధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందారు. వైకాపా పాలనలో బిటెక్ రవి గారిని కూడా వేధింపులకు గురిచేశారు. మరి ఇదే నీతిసూత్రం అప్పుడు కూడా వర్తించాలి కదా? ఇదే భావజాలం కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ఆ పదకొండు స్థానాలు కూడా రావు.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఎస్జీటీ ఉపాధ్యాయులకు పరీక్షల విధులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాల్లో అధిక భాగం స్కూళ్లలోఒకరు లేక ఇద్దరుఎస్జీటీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈఎస్జీటీ ఉపాధ్యాయులకు మార్చి, ఏప్రిల్ నెలల్లోఇంటర్మీడియట్ పరీక్షలఇన్విజిలేషన్ డ్యూటీలు, పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ స్పాట్ వాల్యూయేషన్ విధులు కేటాయిస్తున్నారు. అందువల్ల ప్రాథమిక పాఠశాలలు సింగిల్ టీచర్స్ స్కూల్స్ అవుతున్నాయి. దీంతో ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతున్నది. రాబోవురోజుల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులను పదవ తరగతి పబ్లిక్ పరీక్షల విధులకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ డ్యూటీ, స్పాట్‌వాల్యూయే షన్ డ్యూటీల నుంచి ఎస్జీటీ ఉపాధ్యాయులను మినహాయించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### మాదకద్రవ్యాల నియంత్రణ ఎక్కడ?

మాదకద్రవ్యాల సమస్య రోజురోజుకు తీవ్రతరమై యువతరాన్ని నిర్వీర్యం చేస్తుంది. మాదకద్రవ్యాల మత్తులో పడి నిండు నూరేళ్ల జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. వీటిని సేవించడంవల్ల కలిగేదుష్ఫలితాలను చిన్నవయసు నుంచే పసిపిల్లలకు వివరించి చెప్పాలి. పాఠశాలలో వీటి దుష్ఫలితాలను గురించి స్పష్టంగా బోధించాలి.

- తూలుగు రమణారావు, అక్కరాపల్లి

### కుంభమేళా భక్తుల జేబుకు చిల్లు

మహా కుంభమేళా ఫిబ్రవరి 26న వచ్చే శివరాత్రితో ముగియనుంది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్ రాజ్ తరలివెళ్తారు. విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు వెళుతున్నారు. ఈడిమాండ్‌ను ఆసరాగాచేసుకుని విమానయాన సంస్థలు భక్తుల జేబుకు చిల్లులు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో రూ.5000 నుండి రూ. 10,000 లోపు ఉండే చార్జీలను ఏకంగా రూ.30 వేలకు పైనే వసూలు చేస్తున్నాయి. ఈ వారం ఆరంభంలో ప్రయోగ్ రాజ్ నుండి బెంగుళూరు ప్రయాణానికి ఓ ప్రయివేటు విమాన కంపెనీ ఒక్కొక్కరికి రూ. 39,146 వసూలు చేసింది. సాధారణంగా రూ.10 వేల లోపు ఉన్న విమాన చార్జీలను కుంభమేళా సమయంలో బెంగుళూరుకు రూ.22వేల వరకు వసూలు చేశాయి. తాజాగా ఈ చార్జీలు మరింత దంచుకోవడం పై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వెంటనే కేంద్ర విమాన మంత్రిత్వ శాఖ ట్రావెల్స్ ఏజెన్సీలపై చర్యలు తీసుకొని విమాన చార్జీలను తగ్గించే విధంగా చేయాలని ప్రయాణికుల విన్నపం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భారత్,బంగ్లా సంబంధాలు

షేక్ హసీనాకు ఆశ్రయం ఇవ్వడం వల్ల బంగ్లా కొంత మనకు దూరం జరిగిన పాకిస్థాన్‌తో అంటకాగడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదు భారత్‌లోద్వారా స్కింతయారీలో అమర్త్యసేన్‌తో పాలుపంచుకున్న మహమ్మద్ యూనిస్ పాలకుడుగా బంగ్లాలో నివసించే మైనారిటీలకు ముఖ్యంగా హిందువులకు ఏమాత్రం విశ్వాసం కలిగించిన దాఖలాలు లేవు అదే అతి పెద్ద విషాదం. అయితే భారత్‌కు బంగ్లాకు సాంస్కృతిక సంబంధాలు కూడా ఉన్నాయి. అంత మాత్రమే కాదు భారత్ బంగ్లా మధ్య కుషియారానది రహీంపూర్ కాలువ సంబంధాలు కూడా ఉన్నాయి. కావున ఆ దిశగా భారత్ బంగ్లా అడుగులు పటిష్టంగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

### ప్రజల అవసరాలు పట్టించుకోండి

గ్రామాల్లో పాఠశాల, వైద్య శాల, పార్కు, గ్రంథాలయం, పబ్లిక్ టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు ఉన్నప్పుడే గ్రామం సమగ్రా భివృద్ధి చెందుతుంది. ప్రభుత్వాలు ఇంటి పన్ను వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఉచితబియ్యం, బస్సు, రైతుబంధు వంటి పథకాలు ప్రకటిస్తూ ప్రజల అవసరాలను మాత్రం విస్మరిస్తున్నాయి.

- పుట్లూరి రాంనర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించాలి

**ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభాలెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్లమంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీ ర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సి న అవసరం ఉంది.**

రామ కిష్టయ్య సంగన భట్ల

ఒక సమాజపు సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతు లు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయ రానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతి లో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్న మైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగు తుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమా దంలో పడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్‌కు వెళ్లినవ్యవసాయ కూలీలు 185 సంవ త్సరాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగువాళ్లు ఉండగా తమ వారసు లకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారికతను సాధించి పెట్టేందుకు కృతనిశ్చయంతో, తెలుగుభాషా మాధ్యమంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలున్నాయి. ఉత్స వాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ ఛానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి ఛానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్సి టీలో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సు లున్నాయి. అంతేకాకుండా, మారిషస్ తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక కళానిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావితరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈక్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలి యాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠ శాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్ వేల్స్, క్వీన్స్ లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. అమెరికాలో తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది. ఇది గత ఏడు సంవత్సరాలలో 86శాతం పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్





3న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళా సారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డ మ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసి యేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతేకాదు మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్యసమ్మేళనం కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్‌రికార్డ్స్, తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాదిమంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగిపోని సంఘటన. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్స వంలో దాదాపు 45 దేశాలనుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటిపైకి వచ్చాయి. తెలుగు చరిత్రలో కనీవినీ ఎరుగని రికార్డ్అది. జయహో భారతీయం భారతదేశం, జిజ్ఞాస-భారతదేశం తెలుగు అసోసియే షన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్రప్రదేశ్ అసోసియే షన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగుఅసోసియేషన్ ఆఫ్‌లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసి యేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్-కువైట్, తెలుగుకళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగుసమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగుకల్చరల్ సొసైటీ నార్తెన్ ఐర్లాండ్, తెలుగు కళాసమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ - న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాడ్మింటన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి - న్యూజిల్యాండ్, తెలుగు కళాసమితి-ఒమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతోపాటు ఆయా దేశాలలో వివిధరాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషనునికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీభాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధాపరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్రశిక్ష విధించిన విషయం చరిత్రచెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తనకాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబులాగా మనలను తప్పుపడతాయని హెచ్చరించారు. ఈతరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాలపట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు తెలుగులెస్స అన్న నానుడి దేశ భాషలందు తెలుగు లెస్ అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగుమాట్లాడేవారు 15కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్ల మంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగామారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సి న అవసరం ఉంది. •

# పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవడం ఎలా?


బి.మధుపాళి

మార్చి, ఏప్రిల్ మాసాలు భారత్‌లో వార్షిక పరీక్షల సీజన్‌గా పరిగణించబడుతున్నది. విద్యార్థినీవిద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల వేటలో తమ కృషిని కొనసాగిస్తారు. పరీక్ష అంటేనే ఒక రకమైన ఒత్తిడి పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించాలనే ఆశావహ మానసిక ఒత్తిడి లేదా పాజిటివ్ స్ట్రెస్ ఉన్న యువత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందుతారు. పరీక్షలకు తయారు అవుతున్న విద్యార్థులు అతిగా ఆలోచిస్తూ, ఏమవుతుందో అనే అనవసర ఆందోళనలు, తీవ్రమైన నెగెటివ్ ఒత్తిడులు పరీక్షల్లో ఫలితాలను తారుమారు చేస్తాయని తెలుసుకోవాలి. విద్యార్థులపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ప్రభావం కూడా పరీక్షల ఒత్తిడిని పెంచుతుందని గమనించాలి. పరీక్షల్లో తాహత్తుకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నయువతలో 'పరీక్షల ఆందోళన' తారస్థాయికి చేరి ఫలితాలను మరింత ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. గత పరీక్షల్లో పొందిన మార్కులు లేదా ర్యాంకుల కన్న కొంతైనామెరుగైన ఫలితాలను సాధించాలనే ఆచరణయోగ్య లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మన శక్తి సామర్థ్యాలకు మించి మార్కులు లేదా ర్యాంకులు రావాలని ఆశపడడం వల్ల మన చదువులపైప్రతికూల ప్రభావాలు పడడంతోపాటు గతంకన్న తక్కువ స్థాయిలో ఫలితాలు వస్తాయి. పరీక్షలంటే అనవసర ఆందోళనలు మన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయి. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురికావడం సాధారణంగా జరుగుతుంది. ప్రతికూల ఒత్తిడిపెరిగిన యువతలో ఏకాగ్రత సడలడం, ఆందోళనలు పెరిగి ఎక్కువ సమయం చదవకపోవడం జరుగుతుంది. పరీక్షలంటే భయం పెరిగిన యువతలో శారీరకంగా అతిగా చెమటలు పట్టడం, వాంతులు, జీర్ణసంబంధ సమస్యలు, గుండెవేగం పెరగడం, శ్వాస మందగించడం, తలనొప్పి, కోపం పెరగడం, అధిక బీపీ, ప్రతికూల ఆలోచనలు వెంటాడడం, భయదాడి (పానిక్ అటాక్) లాంటి అవలక్షణాలన్ని కనిపిస్తాయి. రాబోయే పరీక్షలకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని చదవడం ప్రారంభించాలి. పరీక్షా ఫలితాలపట్ల అనవసర ఆలోచనలు మన ఏకాగ్రతను మింగేస్తాయి. సబ్జెక్టుల వారీగాప్రణాళికలు రాసుకొని ప్రాధాన్యతా క్రమంలో చదవడం మంచిది. చదివిన పాఠాలు ఎంతవరకు గుర్తున్నాయో తెలుసుకోవడానికి స్వయం పరీక్షలు రాయాలి. చదువుతున్న సమయంలో గంట లేదా రెండు గంటలకు ఒకసారి స్వల్ప విరామం తీసుకోవడం, దీర్ఘశ్వాసలు తీసుకోవడం ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి. గత పరీక్షలో పొందిన మార్కులకన్న ఎక్కువరావాలనే లక్ష్యాలు మంచి ఫలితాలను ఇస్తాయి. నిన్నటికన్న నేడు మెరుగైతే మనం ప్రగతి బాటన నడిపినట్లే అని నమ్మాలి. మనం చదివేచదువుపై అనవసర ప్రతికూల ఆలోచనలకు స్వస్తిపలకాలి. నా శక్తి వంచన మేరకు చదువుతున్నాను, నేను మంచి ఫలితాలను సాధించగలను, నేను అనుకున్న ఫలితాలు పొందకపోయినా రానున్న పరీక్షల్లో మెరుగు పరుచుకోగలను లాంటి ఆత్మ విశ్వాసాన్ని పెంచే ఆశావహ ఆలోచనలు మన ప్రతిభను పెంచుతాయి. దినచర్యను నిర్ణయించుకొని, మధ్యమధ్య పాలు లేదా టీ లాంటివి తాగుతూ మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలి. చదవడాన్ని వాయిదా వేయవద్దు. చదువుతున్న పాఠంలోని ముఖ్యఅంశాలను అండర్‌లైన్ చేసుకోవడం మంచిది. గ్రాఫ్‌లు, లెక్కలు, డయా గ్రామ్స్, సూత్రాలు, సమీకరణాలు లాంటిఅంశాలను చదివే సందర్భంలో రాసుకుంటూ చదవడంమంచిది. ఒకసారిరాస్తే పదిసార్లు చదివినట్లే అని తెలుసుకోవాలి. ప్రతిరోజు కొన్ని నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించండి. పరీక్ష రోజునకనీసం 15, 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. పరీక్షకు వెళ్లే ముందు అతిగా తినడం మంచిది కాదు. పరీక్షకు ముందు రోజు సమయానికి నిద్రపోవాలి. సమయానికి చేరలేమేమో అనే ఆందోళనలు మన ఏకాగ్రతకు భంగంకలిగిస్తాయి. పరీక్ష హాలుకు తీసుకుపోవలసిన హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిల్‌లు, ఇతర సామాగ్రినిముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించరని గుర్తుంచుకోవాలి. •

# సామాజిక న్యాయదిశగా వర్గీకరణ అడుగులు

గురం రాంమోహన్ రెడ్డి

సామాజిక సమ న్యాయం దిశగా అడుగులు పడుతున్నాయి. మహోజ్వాలంగా సాగిన ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం వర్గీకరణ రూపేణ ఫలితాలు అందేందుకు మార్గాలు సుగమవుతున్నాయి. ఎస్సీలకు, ఉపకులాలకు ఎ.బి.సి వర్గీకరణ రూపేణ విద్యా, ఉద్యోగ రంగాల్లో వాటను పొందనున్నారు. తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి వున్నామని అధికారికంగా ప్రకటించింది. ఇచ్చిన మాటకు కట్టుబడి వుండాలన్న సంకల్పంతో జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమీషన్ను నియమించింది. ఎస్సీలోని 59 కులాలు అభిప్రాయాలను ఆలోచనలను మనోగతాన్ని కమీషన్ సేకరించి, నివేదికి రూపొందించి ప్రభుత్వంకు అందజేసింది. ఏక సభ్య కమీషన్ అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను రాష్ట్ర కేబినేట్ ఆమోదించి చట్ట సభలైన శాసనసభ, శాసన మండలలో ప్రవేశపెట్టి అధికారిక ప్రకటనను శాసన సభలో ముఖ్యమంత్రి శాసన మండలి ఆర్థికమంత్రి చేసి చర్చకు పెట్టారు. ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను అధికార పక్షంతోపాటు ప్రధాన రాజకీయ పక్షాలు బి.ఆర్.యస్., బి.జె.పి. ఎం.ఐ.ఎం, సి.పి.ఐ పార్టీల సభ్యులు ససమర్థించారు. ఎస్సీలకు, ఉపకులాలకు, మాలలకు సమన్యాయం దక్కే దిశగా అడుగులు పడటాన్ని అన్ని పార్టీలు స్వాగతించిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ అమలు కోసం చట్టం చేయాలా, ఆర్డినెన్స్ తీసుకురావాలన్న యోచనలో నిమగ్నమైంది. గతంలో షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లను ఎ.బి.సి.డిగా వర్గీకరణ చేసి విద్య ఉద్యోగ రంగాల్లో అమలు చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ రిజర్వేషన్ల ఎ.బి.సి. మాత్రమే అమలు చేయాలని సూచించింది. 9 శాతం ఎస్సీలకు ఉపకులాలకు (ఎ గ్రూప్) 5 శాతం మాలలు ఇతర ఉపకులాలకు "డి గ్రూప్), 1 శాతం ఉపకులాలకు (సి గ్రూపు) మొత్తం 15 శాతం అమలు చేయాలని సూచించింది. ఎస్సీ జాబితాల్లోని మొత్తం కులాలకు సమన్యాయం దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర జనాభాల్లో ఎస్సీలు 61 లక్షల 84 వేల 319 శాతం జనాభా వున్నట్లుగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక, ఆర్థిక విద్యా, ఉపాధి రాజకీయ సమగ్ర సర్వేలో వెల్లడైంది. మొత్తం తెలంగాణ జనాభలో ఎస్సీల శాతం 17.43 ఉన్నట్లు సర్వేలో తెలింది. సుప్రీమ్ కోర్టు భారత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునుఅమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చకచకగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఎస్సీల (59 కులాల) జనాభా, అక్షరాస్యత ఉపాధి, విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల నియమాకాలు, ఆర్థిక



స్థితిగతులను అధ్యాయనం చేసిన కమీషన్ రిజర్వేషన్ల వర్గీకరికరించి ప్రభుత్వంకు సిపార్సు చేసింది. కమీషన్ 199 పేజీల నివేదికలో ఎస్సీల్లోని 59 కులాలపై వివరణాత్మక అంశాలను పొందుపర్చి మూడు గ్రూపులుగా విభజించాలని సూచించిన నేపథ్యం వేగంగా ఆచరణ యోగ్యమైన నిర్ణయాలకు తెలంగాణ ప్రభుత్వం ఉపక్రమిస్తుంది. 2011 జనాభాగణన ప్రకారం గ్రూప్లో అత్యంత వెనుకబడి ఎవరు పట్టించుకోని ఎస్.సి. కులాలకు 1 శాతం, గ్రూపు 2లో మధ్యస్థంగా లబ్ధిపొందిన 18ఎస్.సి.కులాలకు 9 శాతం (జనాభాలో 62.748 శాతం) గ్రూపు 3లో మెరుగైన ప్రయోజనం పొందిన 26 ఎస్.సి. కులాలకు 5 శాతం (జనాభాలో 33,963 శాతం) రిజర్వేషన్లు కల్పించనున్నది. కమీషన్ గ్రూపు 1లో బావుర్, బుడజంగం, చలాటి, దక్కలి, జగ్గలి, పంబాద, పంబాలో, వంబండ, మాగ్, మన్నే, మస్తీ, మాంగ్ గరోడి, మాతంగి, మోహతర్, ముండాల, సంబన్, స్రప్తు కులాలకు 1 శాతం రిజర్వుషన్లు వర్తించనున్నాయి. గ్రూపు 2లోని అరుందతీయ, బైద్ల, చమర్, మోచి, మూని, చమర్, రవిదాస్, చమర్ రోహిదోస్, చంచర్, చండాల, డోమ్, ఓంబరా, పైడి, పానో, ఎల్లమ్మ వాడ్లు గోడార్, జాంబువులు, ఎస్సీ మాదిగదాసు, మస్తీక, పామిడి, పంచమ, పరియ ప్రమగర, చిందోల్లు, యాటల, వల్లువన్, ఎస్.సి. కులాలకు 9శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గ్రుపు3లోని ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, అనాముక్, అరేమాల, అర్వమాల, బ్యాగర, చలవాడి, డోర్, ఘాసి, చండి, శల్లీ, గోసంగి, హెలియా, హెలియాదాసరి, మాదాసి కురవ, మదారి కురవ, మహర్, మాల, మాలదాసరి, మాలదాసు, మాల హన్నాయ్ మాల జంగం, మాల మస్తీ, నేతకాని, మాలసన్యాసి, మిత అయ్యల్వార్, పాక్, మోత, రేల్లి కులాలకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. రిజర్వేషన్ల పరిధి నుండి క్రిమిలేయర్ను మినహాయించడానికి వర్గీకరణలోని 4వ నంబర్ (డి గ్రూపు) ను సిఫార్సు నుంచి తొలగించేలాని కమీషన్ సిపార్సు చేసిన క్రమమంలో ప్రస్తుతం గ్రూపు1, గ్రూప్2, గ్రూప్3 వర్గాలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయి. 1999లో ప్రారంభమైన ఉద్యమ ఆకాంక్షలు నేరవేరడానికి బాటలు పడ్డాయి. ప్రకాశం జిల్లా ఇది మూడిలో ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం ఆరంభమై మహాజ్వాలంగా గల్లి నుంచి హస్తిన వరకు 32 ఏళ్లపాటు కొనసాగి విజయ తీరాలకు చేరుకోబోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కదిలించి, మెప్పించి ఒప్పించి ఎం.ఆర్.పి. ఎస్.ఉద్యమం దళిత బహుజనుల్లో శ్రామికు కులాల్లో ఉద్వేగాన్ని నింపి జయగీతం పాడనున్నది. ఇప్పటికే హర్యానా రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబర్ 19 నుంచి విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుంది. సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు అన్ని రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు కొరకు ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమబేరిమోగించనున్నది. •

21-2Pg5exH.qxd:21-2Pg5exH.qxd 1/1/02 6:04 AM Page 1



# ఒటిటిలు 'ఎథిక్స్ కోడ్' పాటించాలి




## స్వీయనియంత్రణ సంస్థలు అశ్లీలకంటెంట్ నిషేధించాలి

### కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఇండియాస్ గాట్ లాటెంట్ కార్యక్రమంలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశంలో తీవ్ర దుమారంరేపాయి. ఈక్రమంలో ఐటి నిబంధనల్లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఒటిటిలు, సామాజిక మాద్యమాలు తప్పనిసరిగా పాటించాలనికేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఎ'రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండాచూడాలని ఆదేశించింది. సమాచార ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మార్గదర్శకాలు విడుదలచేసింది. ఒటిటి ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు వచ్చాయి. ఐటి నిబంధనల్లోని నైతిక నియమావళిని ఖచ్చితంగా అనుసరించాలని సూచించింది. లేనిపక్షంలో ఆంక్షలు విధించాల్సి ఉంటుందని కూడా ప్రకటించింది. ఆన్‌లైన్ క్యూరెటెడ్ కంటెంట్‌పై సోషల్‌మీడియా తప్పనిసరిగా కేంద్రం చట్టాలను అనుసరించాల్సిందేనని అన్నారు. వయసు ఆధారిత నిబంధనలు విధిగా పాటించాలన్నారు. చట్టంనిషేధించిన కంటెంట్‌ను ప్రసారంచేయ కూడదని నిర్దేశించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల కంటెంట్‌ను రెగ్యులేట్ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కేంద్రం స్పందించింది. స్వీయనియంత్రణ ఉన్న ఒటిటిలు నైతిక విలువలుపాటించాలన్నారు. ఐజిఎల్‌లో పాల్గొన్న ఒక వ్యక్తిని తల్లితండ్రుల గురించి శృంగారంపై ప్రశ్నించడంతో ప్రముఖ యూ ట్యూబర్ అల్హాబాదియాపై తీవ్రనిరసనలు వ్యక్తం అయ్యాయి. ఆతడి వ్యాఖ్యలపై పలువురు పార్ల మెంటు సభ్యులుకూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసారు.

సమయ్‌రైనాషోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేసారు. దీనితో పలు రాష్ట్రాల్లో ఆతడిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్‌చేయాలని ఒక పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు అల్హాబాదియా వ్యాఖ్యలపై అసహనం వ్యక్తంచేసింది. అశ్లీల కంటెంట్ నియంత్రించేందుకు చర్యలు తీసుకునే ఆలోచన ఉందా అని సుప్రీం కేంద్రాన్ని స్పందిం చింది. దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసులుసైతం జారీచేసింది.



## భారత్‌లో టెస్లా తయారీ అన్యాయమే!

### మస్క్ పక్కన ఉండగానే ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా దిగ్గజ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా భారత్‌మార్కెట్‌లోకి ఎంట్రీకి సిద్ధం అవుతోంది. ఇప్పటికే ఈ సంస్థ నియామకాలు, షోరూంల ఏర్పాటుకోసం ప్రయత్నాలు ప్రారంబించింది. అయితే ఈప్రక్రియ ఎంత మాత్రం ట్రంప్‌కు ఇష్టంలేదు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలనే టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ప్రణాళిక అమెరికాకు అన్యాయం చేయడమే అని అన్నారు. మస్క్ పక్కన ఉండగానే అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలుచేసారు. ఇద్దరూకలిసి ఒక టివి ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. భారత్‌లోకి టెస్లా ఎంట్రీ ప్రణాళికలపై ట్రంప్ మాట్లాడారు. ప్రపంచంలోని ప్రతిదేశం అమెరికాను వాడుకోడానికి ప్రయత్నిస్తోందని, సుంకాలతో మానుంచి లబ్దిపొందాలని చూస్తున్నారని అందువల్లనే ఎలాన్‌మస్క్ తన కార్లను విక్రయించడం అసాధ్యం అవుతోందన్నారు. భారత్‌నే చూడండి ఆయన భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఆయన వరకూ అది మంచిదే కావచ్చు. కానీ అమెరికాపరంగా అది చాలా అన్యాయమైన నిర్ణయమని ట్రంప్ అన్నారు.

గతవారం ప్రధానిమోడీతో భేటీని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ఆ సమావేశంలో విద్యుత్ కార్లపై అధిక సుంకాల విషయాన్ని మోడీతో ప్రస్తావించినట్లు తెలిపారు. సుంకాలసమస్యను పరిష్కరించుకోవడంతోపాటు వీలయినంత సత్వరమే వాణిజ్య ఒప్పందంకోసం ఇరుదేశాలు కలిసి పనిచేసేలా నిర్ణయంచామని అన్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో టెస్లా అధినేతతో భేటీ అయ్యారు. తర్వాత కొన్నిరోజులకే ఈసంస్థ భారత్‌లో నియామకాలుచేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచే అమ్మకాలు ప్రారంభించనున్నది. అయితే కార్ల తయారీపై మాత్రం టెస్లా నిర్ణయాన్ని ప్రకటించలేదు. భారత ప్రభుత్వం నూతన ఈవీ పాలసీని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కార్లతయారీ సంస్థలుదేశంలో కనీసం 500 మిలియన్ డాలర్లుపెట్టుబడి పెట్టడంతో ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే దిగుమతి సుంకాలను 15శాతానికి తగ్గించేవిధంగా కేంద్రం కొత్తవిధానం తెస్తోంది. దీనితో మస్క్ భారత్‌లో టెస్లా తయారీకి సిద్ధం అవుతున్నారు.



## ఒకప్పటి బహిష్కృతనేత

# ఇపుడు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీలో ఒకప్పుడు అసెంబ్లీ మార్షల్స్ బలవంతంగా ఎత్తుకుని బయటకు తీసుకెళ్లిన వ్యక్తి ఇపుడు అదే ఢిల్లీ అసెంబ్లీకి స్పీకర్ అయ్యారు. రోహిణి ఎమ్మెల్యే విజేందర్‌గుప్తాను పార్టీ స్పీకర్‌గా ఎంపికచేసింది. సుమారు పదేళ్లక్రితం అసెంబ్లీనుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన పాత వీడియోలు ఇపుడు వైరల్ అవుతున్నాయి. 2015లో ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే అల్కాలాంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. దీనితో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులోపాల్గొన్న బిజెపి ఎమ్మెల్యే అయిన విజేందర్‌గుప్తాను అప్పటి స్పీకరు ఆరోజు సాయంత్రం నాలుగు గంటలవరకూ సభనుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకుని అసెంబ్లీనుంచి బయటకు తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆయన అభిమానులు ఇపుడు వైరల్ చేస్తున్నారు. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా తనను ఎంపికచేయడంపట్ల గుప్తా హర్షంప్రకటించారు. హైకమాండ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ముడా కేసులో 8వేల పేజీలతో

# లోకాయుక్త 'బి' రిపోర్టు!




**మైసూరు, ఫిబ్రవరి 20:** మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికారసంస్థ (ముడా) కుంభకోణంపై కర్ణాటక లోకాయుక్త ఎస్పీ టిజె ఉదేశ్ గురువారం ఎనిమిది పేజీల తాత్కాలిక బి రిపోర్టును కోర్టులో దాఖలుచేసారు. లోకాయుక్త అధికారుల బృందం ముడా దర్యాప్తునకు సంబంధించిన పత్రాలు నాలుగు బ్యాగ్‌ల్లో ప్రజాప్రతినిదుల కోర్టుకు తరలించారు. ఎస్పీ ఉదేశ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దర్యాప్తు జరుగుతోందన్నారు. కోర్టుకు సమర్పించిన పత్రాలు దర్యాప్తునకు సంబందించిన కీలకమూనవన్నారు. ముడా కుంభకోణం కేసులో సిఎం సిద్ధరామయ్యతోపాటు ఆయన భార్యకు లోకాయుక్త క్లీన్‌చిట్ ఇచ్చింది.

ఈ కుంభకోణంలో ఆరోపణలపై ఆధారాలు లేవని దాంతో కుంభకోణాన్ని నిరూపించలేమని పేర్కొంటూ లోకాయుక్త పోలీసులు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు లేఖరాసారు. ఐపిసి, అవినీతి నిరోధక చట్టం, కర్ణాటక బూసేకరణ చట్టం వంటి అనేక నిబంధనలను లేఖలోప్రస్తావించారు. అక్రమా లకు పాల్పడినట్ల ఎదుర్కొంటున్న సిఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతితోపాటు నలుగురికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని ఈకేసులో నలుగురు నిందితులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలులేక నిరూపితం కాలేదన్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు స్నేహ మయికి వారంరోజులు గడువు ఇస్తున్నట్లు లేఖలో వెల్లడించారు.

కేసులో దర్యాప్తుసాగుతోందన్నారు. కేసులు నలుగురు నింది తులపై చట్టపరమైన చర్యలు సాధ్యంకాదని తుదినివేదికను కోర్టుకు అందించామని ఎస్పీ ఉదేశ్ అన్నారు. లోకా యుక్తపై సామాజిక కార్యకర్త ఫిర్యాదుదారుడు స్నేహ మయి కృష్ణ స్పందించారు. లోకాయుక్తపై ఆయన విమర్శలు కురిపించారు. రాజకీయ నేతలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. లోకా యుక్తపై తనకు సందేహాలునిజమని రుజువు చేసారన్నారు. లోకాయుక్త అధికారులు తమ ఆత్మలను రాజకీయ నాయకులకు అమ్ముకున్నట్లు వ్యవహరించారని విమర్శించారు. తాను అవసరమైన అన్ని పత్రాలు ఇచ్చినప్పటికీ సిద్ధరామయ్య పార్వతి మల్లిఖార్జనస్వామి దేవరాజ్‌లపై ఎలాంటి ఆధారాలేలేవంటూ బీ రిపోర్టు నుదాఖలుచేయబోతున్నారని ఆరోపించారు.

## కుంభమేళాలో స్నానంచేస్తున్న మహిళల విడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు

### కేసు నమోదు చేసిన యుపి పోలీసులు



**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 20:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు 55కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళా భక్తుల వీడియోలు విక్రయిస్తున్న రెండు సామాజిక ఖాతాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు యుపి పోలీసు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల గోప్యత, గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి వీడియోలను కొన్ని ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తున్నాయి. సోషల్ మీడియా మానిటరింగ్ టీమ్ దీన్ని గుర్తించింది. దీనిపై కొత్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ వీడియోలు అప్‌లోడ్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను గుర్తించేందుకు మెటా నుంచి వివరాలు కోరినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ వీడియోలు విక్రయిస్తున్నట్లు మరో కేసు నమోదయింది. వీటిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహాకుంభమేళాకు సంబంధించి అభ్యంతకరమైన, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జనవరి 13న మొదలైన మహా కుంభమేళా కార్యక్రమం ఫిబ్రవరి 26 వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 నాటికి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలుచేసే భక్తులసంఖ్య 60 కోట్లుదాటే అవకాశంఉందని అంచనా వేస్తు న్నారు. తొలుత దీనికి 45కోట్లమంది మాత్రమేవస్తారని అంచనావేయగా ఊహించనిరీతిలో భక్తులు పోటెత్తారు.

## శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

**కొలంబో, ఫిబ్రవరి 20:** శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి చెందాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. రైలులోని ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. అయితే ఏనుగుల గుంపును ఢీకొన్న రైలు పట్టాలు తప్పింది. కొలంబోకు తూర్పున ఉన్న హాబరానాలోని వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్టులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గాయపడిన రెండు ఏనుగులకు చికిత్స అందిస్తున్నారు. శ్రీలంకలో గత యేడాది ఏనుగుల వల్ల 170 మంది మృతి చెందారు. అయితే వేర్వేరు ఘటనల్లో 500 ఏనుగులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. లంకలో సగటున ప్రతి యేడాది సుమారు 20 ఏనుగులు రైలు ఢీకొనడం వల్ల మృతి చెందుతున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అడవుల నరికివేత వల్ల జంతువులు మానవ ప్రదేశాల్లోకి వస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో రాత్రి పూట రైళ్లను నెమ్మది నడపాలని, హారన్లు ఇవ్వాలని డ్రైవర్లకు ఆదేశాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. శ్రీలంలో సుమారు ఏడువేల ఏనుగులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బౌద్ధ మతస్తులు ఆ జంతువుల్ని పవిత్రంగా భావిస్తారు. ఏనుగుల్ని చంపితే అక్కడ జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

## జెలెన్‌స్కీ ఒక సక్సెస్‌ఫుల్ కమెడియన్

### ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ట్రంప్ వ్యాఖ్యలు వైరల్



**వాషింగ్టన్,ఫిబ్రవరి 20:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఒక విజయవంతమైన కమెడియన్ అని వ్యాఖ్యానించారు. అంతకుముందే తప్పుడు సమాచారం ఉచ్చులో ట్రంప్ ఉంటున్నారని, తనకు రేటింగ్ తగ్గిందని, ఈసారి ఎన్నికలు లేకుండానే జెలెన్‌స్కీ అధ్యక్షుడు కావాలని కలలు కంటున్నారన్న ట్రూత్‌లో పోస్టుచేసారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ రష్యా ఇచ్చిన తప్పుడు సమాచారమే వాస్తవమన్న భ్రమలో ట్రంప్ ఉన్నారని తనకు 57శాతం రేటింగ్ ఉందని ప్రైవేటు ఏజెన్సీలే చెప్పాయని ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ట్రంప్ తప్పుడు సమాచార బబుల్‌లో కొనసాగుతున్నారని చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడికి కోపం వచ్చింది. ఆయనొక సక్సెస్‌ఫుల్ కమెడియన్ అనిపించుకున్నారని అలాగే కొనసాగుతారని భావిస్తున్నట్లు పోస్టుచేసారు.అంతేకాకుండా రష్యాతో మొదట ఉక్రెయిన్ వివాదాన్ని ప్రారంభించిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. 350 బిలియన్ డాలర్లు అమెరికా ఖర్చుచేసినా యుద్ధంలో విజయం సాధించలేకపోతున్నారని ట్రంప్ వ్యాఖ్యా నించారు. అమెరికా లేకుండా రష్యాసేనలను ఢీకొనడం కష్టమేనని గతంలోనే జెలెన్‌స్కీ చెప్పిన సంగతి తెలిసిందే. అమెరికా లేకుండా ఉక్రెయిన్ ఈసమస్యను ఎప్పటికీ పరిష్కరించుకోలేదని ట్రంప్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌చేస్తున్న వ్యాఖ్యలు రష్యాకు మద్దతిచ్చేవిగా ఉన్నాయని, తనకు ఎన్నికల్లో రేటింగ్ నాలుగుశాతంగా ఉందని చేసిన వ్యాఖ్యలు రష్యా ఇచ్చిన తప్పుడు సమాచార మేనన్నారు. మొదట వివాదం తామే ప్రారంభించామని చెప్పడంకూడా విడ్డూరంగా ఉందని రష్యా ఉక్రెయిన్ యుద్ధంలోకి జెలన్‌స్కీ అమెరికాను లాగుతున్నారని ట్రంప్‌చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ఖండించారు. యూరోప్‌కంటే అమెరికా 200 బిలియన్ డాలర్లు వ్యయంచేసిందని, యూరోప్ సొమ్ములకు గ్యారంటీ ఉందని, అమెరికా ఎప్పటికీ వెనక్కి తీసుకోలేదని అన్నారు. ఈ యుద్ధం అమెరికాకంటే యూరోప్‌కే ఎక్కువ ప్రయోజనకరమని వేర్పాటుకు మద్యలో ఒక పెద్ద సముద్రం ఉందన్నారు.

## 30 యేళ్ల క్రితం కేసులో

# మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు..

**ముంబయి, ఫిబ్రవరి 20:** దాదాపు 30 ఏళ్ల క్రితం మోసానికి పాల్పడిన కేసులో ఎన్సీపి నేత, మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మాణిక్‌రావ్ కొకటేకు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మంత్రితో పాటు అతని సోదరుడికి జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ నాసిక్ కోర్టు తీర్పు వెలువరించింది. నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ కోటాలో ఫ్లాట్‌లు పొందారని మాజీ మంత్రి దివంగత టిఎస్ డిఘూలే అప్పట్లో చేసిన ఫిర్యాదుతో కోకటే సోదరులపై కేసు నమోదైంది. 1995 నాటి ఈ కేసులో మొత్తం 10 మంది సాక్షులను విచారించిన నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు కోకతే సోదరులిద్దరినీ దోషులుగా తేల్చి శిక్షలు విధిస్తూ తీర్పు ఇచ్చింది. మరోవైపు, కోర్టు విచారణకు హాజరైన మంత్రి మాణిక్‌రావ్ మాట్లాడుతూ ఈకేసులో తనకుబెయిల్ మంజూరైందని తెలిపారు. ఈతీర్పుపై అప్పీల్‌కు వెళతానని చెప్పారు.

## జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందన్న లోక్‌పాల్‌కు

# సుప్రీం నోటీసులు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ ఉత్తర్వులు ఆందోళనకర మంటూ ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు పంపింది. హైకోర్టు సిట్టింగ్ అదనపుజడ్జిపై దాఖలైన రెండు ఫిర్యాదులను లోక్‌పాల్ విచారి స్తోంది. లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టి స్టే విధించింది.

## తూర్పు ఐరోపా నుంచి అమెరికా దళాలు వెనక్కి!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు అనుకూలంగా మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ మేరకు జర్మనీ పత్రిక బిల్డ్ కథనం ప్రచురించింది. దీని ప్రకారం.. 1990 తర్వాత నాటోలో చేరిన దేశాల్లో ఉన్న అమెరికా సేనలను వెనక్కి పిలిపించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. దీంతో అల్బానియా, బల్గేరియా, క్రొయేషియా, ఎస్తోనియా, ఫిన్‌లాండ్, హంగేరీ, లాత్వియా, లిథువేనియా, మాంటెనెగ్రో, నార్త్ మెసిడోనియా, పోలాండ్, రొమానియా, స్లొవేకియా, స్లొవేనియా, స్వీడన్‌ల నుంచి దళాలు వెనక్కి వచ్చే అవకాశాలున్నాయి. వీటితోపాటు ఇటలీ, కొసావో నుంచి అమెరికా దళాలు వైదొలిగే అవకాశాలున్నాయి.

ముఖ్యంగా బాల్టిక్ దేశాల నుంచి దళాలను వెనక్కి రప్పించడంపై ట్రంప్ సానుకూలంగా స్పందించొచ్చని అధికార వర్గాలు నమ్ముతున్నాయని ఫైనాన్షియల్ పత్రిక పేర్కొంది. దీనిపై లథువేనియా అధ్యక్షుడు స్పందిస్తూ.. అమెరికా-ఐరోసా సైనిక సహకారం భవిష్యత్తుపై చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. అమెరికా దళాలను వెనక్కి తీసుకొంటుందనే సంకేతాలు ఇప్పటివరకు లేవన్నారు.

తూర్పుఐరోపాలోని పోలాండ్‌లో అమెరికా దళాలు అత్యధికంగా ఉన్నాయి. వీరి సంఖ్య 10,000కు పైగా ఉండొచ్చు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ముగించేలా ట్రంప్ హడావుడిగా చర్యలు చేపట్టారు. కాస్తభూమితో పోయేదాన్ని యుద్ధం వరకూ తీసుకొ చ్చారని జెల్‌న్స్కీనే ట్రంప్ నిందించారు. ఈ క్రమంలో తాజాగా తూర్పు ఐరోపా నుంచి సేనల విరమణ కూడా రష్యాకు సానుకూలంశం అవుతుంది.

**పెంటగాన్ రక్షణ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని ఆదేశాలు**

పెంటగాన్‌న డిఫెన్స్ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సే ఆదేశాలు జారీ చేశారు. యేటా 8 శాతం చొప్పున తగ్గించుకొంటూ రావాలని పేర్కొన్నారు. ఈ కోతలను ఫిబ్రవరి 24 నాటికి సిద్ధం చేయాలని వెల్లడించారు. బడ్జెట్ తగ్గింపుల నుంచి 17 విభాగాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. వీటిల్లో అణ్వాయుధాలు, అమెరికా దక్షిణ సరిహద్దుల్లో కార్యకలాపాలు, మిసైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌లు వంటివి ఉన్నాయి. గతేడాది అమెరికా 850 బిలియన్ డాలర్లను రక్షణ కోసం వెచ్చించింది. 2023 నాటికి దీనిలో 300 బిలియన్ డాలర్లను తగ్గించాలని హెగ్సే లక్ష్యంగా పెట్టుకొన్నారు.

## ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

# పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించింది. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. దాంతో నాగేశ్వరన్ మార్చి 31, 2027 వరకు పదవిలో కొనసాగుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన 2022, జనవరి 28న సిఇఎగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతో పాటు కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం ఆయన కార్యాలయం బాధ్యత. మాజీ క్రెడిట్ సూయిస్ గ్రూప్ ఎజి, జూలియస్ బేర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్, విద్యావేత్త అయిన నాగేశ్వరన్.. కెవి సుబ్రమణియన్ స్థానంలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియామకయ్యారు.

ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో మందగమన సంకేతాల మధ్య 2024-25 ఆర్థిక సర్వే రాబోయే ఆర్థిక సంవత్సరానికి 6.3-6.8 శాతం వృద్ధి రేటును అంచనా వేసిన కొద్దివారాల తర్వాత.. నాగేశ్వరన్ పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కేంద్రం అంచనా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 6.4 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. నాగేశ్వరన్ సిఇఎగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు.. 2019 నుంచి 2021 వరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలిలో పార్ట్‌టైమ్ సభ్యుడిగా పని చేశారు. భారత్, సింగపూర్‌లో అనేక బిజినెస్ స్కూళ్లకు పని చేశారు. నాగేశ్వరన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (ఎంబిఎ) డిగ్రీని పొందారు. 1994లో మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆయన ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆప్ బిజినెస్ డీన్, క్రియా విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

## చైనాతో అమెరికా ఒప్పందం!

### వాణిజ్య యుద్ధ భయాల వేళ ట్రంప్ పచ్చజెండా

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** దూకుడు నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. డ్రాగన్‌తో ట్రేడ్ వార్ డీల్ రూపుదాల్చే అవకాశం ఉందని తాజాగా వ్యాఖ్యలు చేశారు. 2020లోనే చైనాతో ఒక గొప్ప వాణిజ్య ఒప్పందం జరిగిందని మీడియాతో మాట్లాడుతూ గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ జరుగుతుందన్న ఆందోళనల వేళ అగ్రరాజ్య అధ్యక్షుడి నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన నోటిలో టారిఫ్ పదమే వినిపిస్తోంది. దానికి తగ్గట్టే మిత్రులు, శత్రువులు అనే తేడా లేకుండా అన్ని దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తానని తేల్చి చెప్పారు. వాణిజ్య లోటును తగ్గించుకోవడం కోసమే ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు.

చైనా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకునే వస్తువులపై 10 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దానికి చైనా కూడా కౌంటర్ ఇచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ద్రవీకృత సహజ వాయువుపై (ఎల్ఎన్‌జి) 15 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ముడి చమురు, వ్యవసాయ పరికరాలు, పెద్ద ఇంజిన్ల కార్లపై 10 శాతం సుంకాన్ని వసూలు చేయనున్నట్లు తెలిపింది. ఇలా ఒకరిపై ఒకరు పరస్పర సుంకాలు విధించుకుంటున్న తరుణంలో ట్రంప్ నుంచి ఈ స్పందన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

21-2Pg6exHMNWJQE.qxd:21-2Pg6exHMNWJQE.qxd 1/1/02 6:19 AM Page 1



# రాష్ట్రంలో అత్యంత శక్తిమంతమైన, సమర్ధవంతమైన పాలన సాగుతోంది

## - డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో అత్యంత శక్తివంతమై,సమర్ధవంతమైన ప్రభుత్వపాలనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సాగిస్తున్నామని రాష్ట్ర



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేసారు.గత ప్రభుత్వం ఆర్థికరంగంలో చేసిన విధ్వంసాన్ని గుర్తించి, పరిస్థితిని చక్కదిద్దే దిశలో ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తున్నామన్నారు.తమంతా ప్రతి విషయంలోను సమన్వయంతోనే కలిసి ముందుకెళ్తున్నాం పవన్ కళ్యాణ్ తెలిపారు.ప్రమాణస్వీకారం ముగిసిన తర్వాత ఎన్డీఏ నేతలందరికీ భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా విందును ఏర్పాటు చేశారు. విందుకు హాజరై బయటకు వస్తున్న సమయంలో పవన్‌తో జాతీయ మీడియా కాసేపు చిట్‌చాట్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏపీలో తాజా పరిస్థితులపై మీడియా అడిగిన ప్రశ్నలకు పవన్ సమాధానం ఇచ్చారు.వెన్నునొప్పితో ఏపీలో కొన్ని భేటీలకు హాజరుకాలేకపోయానని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇప్పటికీ వెన్నునొప్పి తీవ్రంగా బాధిస్తోందని పవన్ కళ్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తోందన్నారు.పవన్ జగన్ అప్పుల కుప్పగా మార్చినందున ఆర్థిక ఇబ్బందులు చవిచూడాల్సి వస్తుందన్నారు.వాటి ప్రభావం ప్రజలపై లేకుండా సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేస్తున్నామని పవన్ కళ్యాణ్ వివరించారు.పర్యావరణ, అటవీశాఖలు నాకు ఇష్టమైన శాఖలని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.నిబద్ధతతో నా మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నా అన్నారు.ఏపీ పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధిని తాము అధికారంలోకి అడుగుపెట్టిన తరువాత గాడిలో పెట్టామన్నారు.జల్‌జీవన్ మిషన్ అమలులో కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు.ఇందుకు అవసరమైన నిధులను కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ తెప్పించుకుంటున్నామన్నారు.గ్రామీణ రహదారుల రూపురేఖలు మారుతున్నాయన్నారు.అన్ని మౌలిక వసతుల కల్పనకు అవకాశం కల్పిస్తున్నామన్నారు.సనాతన ధర్మం పట్ల తనకు అపారమైన నమ్మకం,గౌరవం ఉన్నాయన్నారు.తాను వాటిని ఆచరిస్తున్నా అన్నారు.ప్రధాని తన పట్ల అభిమానంతో " హిమాలయాలకు వెళ్తున్నావా ! అని చమత్కరించారన్నారు.తాను ఆయన చెప్పినట్లే బాధ్యతగా వ్యవహరిస్తున్నానన్నారు.ఈ దేశంలో అత్యుత్తమ సంస్కరణలతో,చప్రజల పట్ల బాధ్యత కన్పరుస్తూ ప్రధాని మోడీ పరిపాలన అందిస్తున్నారన్నారు.ఆయన పట్ల ప్రజాభిమానానికి నిదర్శనం ఢిల్లీలో 27ఏళ్ళ తరువాత బిజెపి అధికారంలోకి రావడమన్నారు.ఇది సామాన్య విషయం కాదన్నారు.



స్వర్ణశోభితంగా కనువిందు చేస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయ దృశ్యం (ఇన్‌సెట్‌లో) కన్నప్ప

# భోళాశంకరుని సన్నిధిలో మహాశివరాత్రి సంబరాలు

## నేడు కన్నప్ప ధ్వజారోహణతో శివరాత్రికి శ్రీకారం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** తిరుపతి జిల్లాలోని శ్రీకాలహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గెలిచిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి ఇవి మొదటి శివరాత్రి బ్రహ్మోత్సవాలు కాబట్టి ఆయనే అన్ని తానే అయి పర్యవేక్షించుకుంటూ ముందుకు సాగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముగ్గురు మంత్రులను రప్పించి సమీక్షలు జరిపారు. ఖర్చులతో సంబంధం లేకుండా నిర్వహించుటకు నిర్ణయించారు.ఇక్కడి ఉత్సవాల్లో అగ్రతాంబూలం భోళాశంకరుడు తనకు కన్నులు అర్పించిన తిన్నడికి ఇచ్చారు.ఇది ఈ దివ్యక్షేత్రంలో ప్రసిద్ధి. ఆలయానికి తూర్పున కొండపై భక్తకన్నప్ప ఆలయ నిర్మాణం గమనిస్తే మూగజీవాలకే కాకుండా తన భక్తులకు కూడా ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో మనకు అర్థమౌతుంది.శుక్రవారం సాయంత్రం భక్త కన్నప్ప ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమౌతాయి.ఇందుకు అధికారులు ముస్తాబులు చేశారు. కన్నప్ప కొండను అందంగా తీర్చి దిద్దారు. నెల రోజుల నుంచి అధికారులు, సిబ్బంది రేయింబవళ్ళు తేడా లేకుండా కృషి చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు.శివరాత్రికి అవసరమైన ఏర్పాట్లు అన్ని చేపట్టారు. దేశ నలుమూలలోని ప్రజా ప్రతినిధులు మంత్రులకు శాసనసభ్యుడే ఆహ్వానాలు అందించారు. స్వర్ణశోభిత ఆలయంలో బ్రహ్మోత్సవ సంబరం: దక్షిణకైలాసంగా బాలసిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం స్వర్ణశోభితంతో విరాజిల్లుతోంది.వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబం సహకారంతో ఆలయం బంగారుమయమైంది. సాధారణంగా పరమేశ్వరుడు స్మశానాధీశుడుగా విష్ణుమూర్తిని లక్ష్మీనిలయుడుగా వర్ణిస్తుంటారు. శివుని ఆలయాలు సాధారణ అలంకారాలతో కనిపిస్తుంటే, వైష్ణవాలయాలు స్వర్ణకాంతులతో కనువిందు చేస్తూంటాయి. తెలుగుదేశం గతంలో నియమించిన పాలకమండలి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో దాతల సహకారంతో కైలాసనాథున్ని నిలయాన్ని స్వర్ణమయంగా మార్చారు. 2017లో మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకుని వాయులింగేశునిపై అచంచల భక్తిభావంతో పలువురు దాతలు ముందుకు వచ్చి భూరి విరాళాలుగా ఆలయంలో స్వర్ణతాపడం పనులను చేపట్టిరికార్డు స్థాయిలో పూర్తిచేశారు. ఆలయ శిఖరాలు సుమారు 99 కలశశిఖరాలు ఆలయపరిధిలో ఉండగా నేడు అన్నింటినీ బంగారు తాపడం చేయించి ప్రతిష్టింపచేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచే శ్రీకాళహస్తి ఆలయం స్వర్ణకాంతులతో ప్రకాశవంతమవుతూ భక్తులకు కనువిందు చేస్తోంది. అంతేకాక శ్రీకాళహస్తికే తలమానికంగా ఉండిన శ్రీకృష్ణదేవరాయలచే నిర్మించబడిన గాలిగోపురం 2010లో కుప్పకూలడంతో ప్రధానలోటుగా మారింది. అయితే నవయుగ నిర్మాణ సంస్థ ప్రతిష్టాత్మక ంగా తీసుకుని రాజగోపురాన్ని పునఃనిర్మించి కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు.ఈ ఏడాది గోపురానికి సరికొత్త అందాలను దిద్దారు. దాంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తికి తలమానికమైన గాలిగోపురం కూడా బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక కళ సంతరించుకుంది.గోపురం చుట్టూ హరితాన్ని ఆపాదించారు . ఇక ఆలయం లోపల స్వామివారి ధ్వజస్తంభానికి బంగారు తాపడం పనులు భక్తులు ఆనందపరవశులయ్యేలా చేస్తోంది. స్వామి వారి గర్భాలయమే అత్యంత విశేషమహిమాన్వితమైనది స్వామివారి ఉచ్ఛ్వాసనిశ్వాసలకు నిలయమైన వాయుదీపం చూసి భక్తులు భక్తితన్మయత్వంలో మురిసిపోతుంటారు. అలాంటి మహాభాగ్యంతోపాటు శివరాత్రికి స్వామివారి పానమట్టం స్వర్ణతాపడం భక్తజనాన్ని మనోఆనందాన్ని రెట్టింపుచేయనున్నది.

**.జ్ఞానాంబిక-స్వర్ణాంభిక:** శ్రీకాళహస్తి ఆలయంలో కొలువుదీరిన దేవేరి జ్ఞానప్రసూనాంబికాదేవి స్వర్ణతేజోమయంతో వెలిగిపోతోంది. దేవేరి జ్ఞానాన్ని అనుగ్రహించే మాతగా సకల కోరికలను తీర్చే కల్పవల్లిగా భాసిల్లుతోంది. అలాంటి అమ్మవారి నిలయం మహాశివరాత్రికి స్వర్ణశోభితంతో భక్తజనాలకు కనువిందు చేస్తోంది. పాలకుల విశేషకృషితో అమ్మవారి నిలయాన్ని బంగారు తేజోమయంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ముఖమండపాన్ని బంగారు తాపడం చేయించారు.దీంతో దేవేరి నిలయం స్వర్ణశోభితంగా మారింది. అంతేకాక అమ్మవారి మకరతోరణం కూడా దాత ముందుకు వచ్చి స్వర్ణతాపడం చేయించడంతో గర్భాలయంలో దేవేరి అటు నిత్యాలంకరణలో బంగారు చీర, వజ్రకిరీటం, బంగారు మకరతోరణంతో జ్ఞానాంబిక స్వర్ణాంభికగా భక్తులకు దర్శనమిస్తోంది. ఇలా ఆలయంలో ప్రధానమైన కలశాలు, ధ్వజస్తంభం, అమ్మవారి గర్భాలయం స్వర్ణశోభితంగా మారి శ్మశానాధీశుని నిలయం స్వర్ణతేజో నిలయంగా మారి శివరాత్రికి భక్తులకు ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో తేలియాడేలా చేస్తోంది. రేపటి నుండి ప్రారంభమౌతున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల సంబరాల్లో భక్తజనాలను స్వర్ణాలయం విశేషంగా ఆకర్షించనున్నది.

# గన్నవరంలో మైనర్ బాలికలు అదృశ్యం

## - 4 గంటల్లో పట్టుకున్న పోలీసులు

**గన్నవరం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఒకేసారి 5గురు మైనర్ బాలికలు అదృశ్యం కావటం కృష్ణాజిల్లాలో కలకలం సృష్టించింది. విజయవాడలోని ఓప్రయివేటు కళాశాలలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఐదుగురు మైనర్ బాలికలు గురువారం ఉదయం ఒక్కసారిగా అదృశ్యం కావటంతో పోలీసువర్గాల్లో కలవరం రేకెత్తింది. వెంటనే స్పందించిన గన్నవరం సిఐ శివప్రసాద్ తన సిబ్బందితో రంగంలోకి అదృశ్యమైన విద్యార్థినిలను నాలుగుగంటల్లో పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే గన్నవరం మండలం ముస్తాబాద గ్రామానికి చెందిన నలుగురు బాలికలు కళాశాలకు బస్సులో వెళుతుంటారు. వీరితో విజయవాడ మాచవరంకు చెందిన మరో బాలిక స్నేహం చేస్తుంది. ఈనేపథ్యంలో ముస్తాబాద గ్రామానికి చెందిన ఒక బాలిక కళాశాలకు సరిగా వెళ్ళటం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈఐదుగురు స్నేహితులు ఇంటి నుండి పారిపోవాలని పథకం రూపొందించుకున్నారు. శుక్రవారం వేకువ జామున మూడుగంటల సమయంలో ఓబాలిక అదృశ్యం కావటం తల్లిదండ్రులు గుర్తించి 112కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేసారు. వెంటనే స్పందించిన గన్నవరం సిఐ శివప్రసాద్ రంగంలోకి దిగి ముస్తాబాద గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈబాలిక స్నేహితులను విచారించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో మిగిలిన ముగ్గురు బాలికలు ఇంటలోలేని విషయం వెలుగులోకి వచ్చింది. ఈదశలో ఓబాలిక హైదరాబాద్‌లో పరీక్షరాసేందుకు వెళుతున్నట్లు చెప్పటంతో సదరు బాలిక తండ్రి తన కుమార్తెను ఉదయం 4గంటలకు విజయవాడలో దింపివచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడికాగా పోలీసులు శరవేగంగా విజయవాడ చేరుకుని విచారణ వేగవంతం చేసారు. ఓబాలిక వద్ద ఫోన్ ఉండటంతో ఫోన్‌లో బాలిక తల్లితో మాట్లాడించారు. ఈక్రమంలో బాలికలు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళుతున్నట్లు గుర్తించి ఆమార్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించారు. బాలికలు ప్రయాణిస్తున్న రైలు పిడుగురాళ్ల వద్దకు చేరుకోగానే ఐదుగురు బాలికలను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

# జిఓ నెం.426ని సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే కొనసాగింపు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ దేవాదాయ ,ధర్మాదాయ చట్ట పరిధిలోకి వచ్చే ఆలయాల ప్రాంగణాల్లోని దుకాణాల నిర్వహణకు పిలిచే టెండర్లలో హిందూయేతరులు పాల్గొనకూడదని పేర్కొంటూ 2015 లో ఏపీ ప్రభుత్వం జారీచేసిన జీఓ నెం.426 ని సమర్థిస్తూ హైకోర్టు 2019 సెప్టెంబరు 27న ఇచ్చిన తీర్పుపై స్టే కొనసాగిస్తూ సుప్రీంకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఎండీ రఫీ, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించగా 2020 ఫిబ్రవరి 27న జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ కేఎం జోసెఫ్‌ల నేతృత్వంలోని ధర్మాసనం, హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తర్వాత ఈ కేసు విచారణ 12 సార్లు వాయిదా పడింది. జీఓ అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించిన, ఆలయాల దుకాణాల నిర్వహణలో హిందూయేతరులు పాల్గొనకుండా ఇదివరకు రెండుసార్లు టెండర్లు జారీ చేయడంతో పిటిషనర్లు కోర్టు దిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు.వాటిని దృష్టిలో ఉంచుకొని అధికారులు కోర్టుకు క్షమాపణలు చెప్పి ఆ టెండర్లను ఉపసంహరించారు. మళ్లీ ఇప్పుడు శ్రీశైలం మరికొన్ని ఆలయాల దుకాణాల నిర్వహణకు హిందూయేతరులను మినహాయిస్తూ టెండర్లు పిలిచిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పిటిషనర్లు తాజాగా క్లారిఫికేషన్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై బుధవారం జస్టిస్ అభయ్ ఎస్.ఓక, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టినప్పుడు ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ దేవాదాయశాఖ అధికారులు తప్పు తెలుసుకొని టెండర్లను ముందే ఉపసంహరించుకున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇదే సమయంలో పిటిషనర్ల తరపు న్యాయవాదులు జోక్యం చేసుకుంటూ రాష్ట్ర అధికారులు పదేపదే ఇలాంటి టెండర్లుజారీ చేస్తున్నారని, మూడోసారి ఇలాంటి పొరపాటు చేసినందున భవిష్యత్తులో ఇలా జరుగకుండా స్పష్టత ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరడంతో 2020 ఫిబ్రవరి 27న జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఉందని, తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు అది కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన వైఎస్సార్సీ నేతలు

## - కూటమి దురుద్దేశాలు మాకు తెలుసు: ప్రతిపక్షనేత బొత్ససత్యనారాయణ



గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందిస్తున్న వైకాంగ్రెస్ పార్టీ నేతలు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:**మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తోందని శాసన మండలిలో ప్రతిపక్షనేత బొత్సా సత్యనారాయణ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ అరాచకాలకు పాల్పడుతుంద న్నారు. తాజాగా గుంటూరు పర్యటనలో ఆయనకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏపీ ప్రభుత్వ వైఫల్యంపై వైఎస్సారసీపీ నేతలు బొత్స సత్యనారాయణ,మెరుగు నాగార్జున,అంబటిరాంబాబు,కారుమూరి నాగేశ్వరరావు, మొండితోక అరుణ్‌కుమార్, వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు గురువారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ జస్టిస అబ్దుల్ నజీర్‌ను కలిసి ఫిర్యాదుచేసారు.ఆయనకు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై వినతి పత్రం అందించారు. అనంతరం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎంగా వైఎస్ జగన్ కు జెడ్ ఫస్ల్ సెక్యూరిటీ ఉంటుంది. ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడ భద్రత కల్పించాలి. కానీ గుంటూరు పర్యటనలో ఒక్క కానిస్టేబుల్ కూడా కనిపించలేదు. వైఎస్ జగన్ భద్రతపై మాకు ఆందోళన ఉంది. మా ఆందోళనను గవర్నర్‌కు తెలియజేశాం. ఆయకు రక్షణ కల్పించాలని గవర్నర్‌ను కోరాం మా ఫిర్యాదుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. చట్టం తమ పని తాను చేసుకునేలా చేయాలి. కానీ కూటమి ప్రభుత్వం దురుద్దేశాలు మాకు తెలుసు. జగన్‌ను ఇబ్బందిపెట్టాలనే ఏకపక్షంగా భద్రత తగ్గిస్తున్నారు. మా హయాంలో ఎక్కడైనా భద్రత తగ్గించామా? అని కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి బొత్స నిలదీశారు. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతున్న టీడీపీ నేతలు ఇబ్బందుల్లో ఉన్న రైతులను తమ పార్టీనేత పలకరిస్తే కొత్త భాష్యాలు చెబుతున్నారన్నారు.ఎన్నికల కోడ్ అధికార పార్టీకి వర్తించదా ? అన్నారు.

# మంత్రులపైనా క్రిమినల్ కేసులు

## ఇద్దరు ఢిల్లీ మంత్రులు బిలియనీర్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీలో కొత్త సీఎంగా బాధ్యతలుచేపట్టిన రేఖాగుప్తా కేబినెట్ మంత్రులపై తీవ్రస్థాయి క్రిమినల్‌కేసులు కూడా ఉన్నాయి. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినవారిపై క్రిమినల్‌కేసులు నమోదయి ఉన్నాయి.మంత్రి ఆశిష్‌సూద్‌పై తీవ్రమైన నేరారోపణలున్నట్లు ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఎడిఆర్) క్రటించింది. ఎన్నికల్లో వారిచ్చిన అఫిడవిట్ల ఆధారంగానే వీటిని ప్రకటించింది. షాలిమార్‌బాగ్‌నుంచి తొలిసారి బిజెపి ఎమ్మెల్యే అయిన రేఖ గుప్తా ఢిల్లీ 9వ సీఎంగా గురువారంబాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. కేబినెట్‌మంత్రుల్లో ఇద్దరు బిలియనీర్లు ఉన్నారు. రాజౌరి గార్డెన్‌నియోజకవర్గంనుంచి బిజెపి ఎమ్మెల్యే మంజీందర్‌సింగ్ సిర్సాకు 248.85 కోట్ల ఆస్తులున్నాయి. కరావాల్ నగర్‌నియోజకవర్గానికి చెందిన మంత్రి కపిల్‌మిశ్రా అతితక్కువగా 1.06 కోట్లఆస్తులుప్రకటించారు. ఏడుగురు మంత్రుల సగటు ఆస్తులు రూ.56.03 కోట్లుగా ఉంది. న్యూఢిల్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం తనకు అత్యధికంగా రూ.74.36 కోట్ల అప్పులున్నట్లు చెప్పారు. ఏడుగురు మంత్రుల్లో ఆరుగురు గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువస్థాయి విద్యార్హతలున్నఆరు అయితేఒక మంత్రి మాత్రం 12వ తరగతి మాత్రమే పూర్తిచేసారు.

# నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రిజర్వే షన్లపై మాట్లాడిన కేసులో కోర్టుకు రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజర య్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై బేగంబజార్ పీఎస్‌లో, నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం 3 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభు త్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్‌ఛైర్మన్ తిరుపతి వర్మ అన్నారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు వచ్చే నెల 23కి వాయిదా వేసింది.

# ఎఐజి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్న మాజీ సిఎం కెసిఆర్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గురువారం గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం కెసిఆర్ తన సతీమణి శోభతో కలిసి ఏఐజీ ఆసుపత్రికి వచ్చి పలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కెసిఆర్ తిరిగి తన ఇంటికి వెళ్లిపోయారు. ఆసుపత్రికి వచ్చిన కెసిఆర్ ఆరోగ్యంపై పూర్తివివరాలు సేకరించిన ఆసుపత్రి డాక్టర్లు అవసరమైన పరీక్షలు నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిఆర్ఎస్ అధినేత తన ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో కాలుజారి పడిపోవడంతో తుంటిఎముక విరిగి గాయ పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు తుంటి ఎముక శస్త్రచికిత్స చేయిం చుకున్న కెసిఆర్ కొన్ని నెలలుగా తన ఫాంహౌజ్‌లోనే విశ్రాంతి తీసుకుం టున్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాక్రమాలపై ఫాంహౌజ్ నుంచే పర్య వేక్షించడంతోపాటు ఫాంహౌజ్ కేంద్రంగా పార్టీ నేతలతో సమావే శమవుతున్నారు. కాగా కొన్నినెలల అనంతరం ఫాంహౌజ్ నుంచి బయటకు వచ్చిన కెసిఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ 25 వసంతాల వేడుకలో పాల్గొని కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాగా గురువారం కెసిఆర్ ఏఐజీ ఆసుపత్రికి వచ్చినట్లు తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందగా, సాధారణ వైద్య పరీక్షల కోసమే కెసిఆర్ ఏఐజీ ఆసుపత్రికి వెళ్లినట్లు బిఆర్ఎస్ వర్గాలు ప్రకటించాయి. కాగా తన మనవడు, మాజీమంత్రి కెటిఆర్ కుమారుడు హిమాన్షును చూసేందుకు కెసిఆర్ త్వరలో విదేశాలకు వెళ్లనున్నారని, అందులో భాగంగానే తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ముందు జాగ్రత్త కోసం ఏఐజీ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్నారని సమాచారం అందుతుంది. ఇందులో భాగంగానే కెసిఆర్ తన పాస్‌పోర్టు రిన్యూవల్ కోసం బుధవారం సికిందరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని సందర్శించారని అంటున్నారు. గురువారం వైద్య పరీక్షల అనంతరం కెసిఆర్ తన కుటుంబసభ్యులతో కలిసి నందిహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లారు.

# కలుషితాహారంతో 28 మంది విద్యార్థులకు అస్వస్థత

## మూడు రోజులుగా వర్సిటీలోనే చికిత్స

## యాజమాన్యంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోనీ ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సంఘటన చోటుచేసుకున్నది. పోలేపల్లి సెజ్‌లోనీ ఎస్‌వీకేఎం ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో కలుషిత, నాణ్యతలేని ఆహారం తీసుకోవడం వల్ల సుమారు 28మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు, విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యి మూడు రోజులు కావడంతో సమాచారం బయటకు రాకుండా చర్యలు తీసుకున్నారు. యూనివర్సిటీలోనే బెడ్లపై, మంచాలు వేసి సెలైన్లు పెట్టి చికిత్స అందిస్తూ వచ్చారు. విషయం బయటకు వస్తే తమ యూనివర్సిటీకి చెడ్డపేరు వస్తుందని గుట్టుగా చికిత్స అందించారు. ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి హుటాహుటీగా యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీ యాజమాన్యానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ఫైర్ అయ్యారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని యూనివర్సిటీ యాజమాన్యానికి సూచించారు. యాజమాన్యం నిర్లక్ష్యానికి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటనపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి స్పందించారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. యూనివర్సిటీలోనే ఆహారం కల్తీ జరగడం విద్యార్థులు అస్వస్థకు గురికావడం బాధాకరమన్నారు. యాజమాన్యం మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

# గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

## 300 కిలోల సరకు, కంటైనర్ వ్యాను స్వాధీనం

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** డ్రగ్స్ విక్రేతను పట్టు కున్న ఎస్‌ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడి నుంచి 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర పూణెకి చెందిన అహ్మద్ గులాబ్ షేక్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. విలాసాలకు అలవాటు పడిన నిందితుడు సులు వుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి రవాణా మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో అరకు నుంచి మహారాష్ట్రకు డిసిఎం కంటైనర్ వ్యానులో స్క్రాప్ మధ్యలో గంజాయిని తరలిస్తుండగా... విశ్వ సనీయ సమాచారం మేరకు మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు అబ్దుల్లా పూర్‌మెట్ పోలీసుల సహకారంతో రామోజీ ఫిల్మ్‌సిటీ వద్ద డీసీఎం కంటైనర్ వాహనాన్ని(ఎంహెచ్ 16 సీడీ 2076)పట్టుకుని తనిఖీ చేసి గంజాయిను గుర్తించారు.

# అమృత తుల్యమైన మన తెలుగును కాపాడుకుందాం

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మనం తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే మనకు అలవడే భాష మాతృభాష, ఇదే మన అస్తిత్వం, ఇదే మన సంస్కృతి, సంప్రదాయాలకు మూలం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భాష, సంస్కృతులకు అవినాభావ సంబంధముందని, భాష మన సంస్కృతికి జీవనాడి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతమైన సంస్కృతి, ఉన్నతమైన సమాజానికి బాటలు వేస్తుందన్నారు. భారతదేశపు భాషా వైవిధ్యతే, మన గొప్ప నాగరికతకు పునాది. మన ఆటలు, మాటలు, పాటలు, సంగీతం, కళలు, పండుగలు, పబ్బాలు, వ్యాపార సంబంధాలు భాష లేకుండా పెంపొందలేవు అన్నారు. వీటన్నింటినీ కాపాడుకుని భవిష్యత్ తరాలకు అనుగుణంగా పరిస్థితులు కల్పించాలంటే మన మాతృభాషను మనం కాపాడుకోవాలని అన్నారు. మన దైనందిన జీవితంలో మాతృభాష వినియోగం పెరగాలన్నారు. మన మాతృభాష అయిన తెలుగు ప్రాశస్త్యం గురించి ఎంత చెప్పినా తక్కువే. మన భాష చాలా గొప్పది. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని కృష్ణ దేవరాయలు అన్నా, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా ప్రశంసలందుకున్నా విశ్వనాథ సత్యనారాయణ అమర భాష అని కీర్తించినా సినారె, శ్రీశ్రీ వంటి ప్రముఖులెందరో తమ జీవిత సర్వస్వం తెలుగే అని ఎలుగెత్తి చాటినా తమిళ కవి సుబ్రమణ్య భారతి, తెలుగు వంటి సుందరమైన భాష మరొకటి లేదని పొగడినా, నికొలో కోంటీ, అబ్దుల్ అల్ హసన్ బహమనీ వంటి విదేశీయులు, తెలుగును స్వర్గపు భాషగా పేర్కొన్నా ఇదంతా తెలుగు భాష గొప్పదనమే అన్నారు. ఎన్నో యాసలు, మరెన్నో మాండలికాలు. ఒక్కో దాంట్లో, ఒక్కో అందమైన భావన అన్నారు. ఇవేవీ ఇతర భాషల్లో అంతగా కనిపించవు అన్నారు. అవధానం వంటి అద్భుతమైన ప్రక్రియ ఒక్క తెలుగు భాషకే సాధ్యం అన్నారు. ఇదీ మన తెలుగుభాష గొప్పదనం. అందుకే మన అమృతపు భాషను కాపాడుకోవడానికి మనమంతా పునరంకితం అవుదామని కేంద్ర మంత్రి అన్నారు.

# ఎన్నికల్లో ఓడిపోతే నా పరిస్థితి ఘోరంగా మారేది!

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అధ్యక్ష న్నికల్లో ఓటమి పాలయి ఉంటే తన జీవితం మరింత దారుణంగా ఉండేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అన్నారు. గత ప్రభుత్వం తనతో అత్యంత దారుణంగా వ్యవహరించిందని ఆరోపించారు. మియామిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే తన జీవితం చాలాఘోరంగా మారిపోయేదని అన్నారు. న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ జీవితంగడిసపే పరిస్థితి వచ్చుండేదన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఓటమి పాలయితే తర్వాత పోటీచేసేందుకు చాలా ధైర్యం అవసరం అయ్యేదన్నారు. గత ప్రభుత్వం తనపై అత్యంత దారుణంగా ప్రవర్తించిందంటూ ఆరోపించారు. 2024లో అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాట్ అభ్యర్థి కమలా హ్యారిస్‌పై ట్రంప్ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలకు ముందు ట్రంప్ పోర్న్‌స్టార్‌కు హష్‌మనీ కేసుతో సహా పలు క్రిమినల్, సివిల్‌కేసులు ఎదుర్కొన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైన అనంతరం ఆయనపై ఉన్న రెండు ఫెడరల్‌కేసులనుంచి ఊరట లభించింది. హష్‌మనీకేసులో న్యూయార్క్ న్యాయమూర్తి షరతులులేని డిశ్చార్జిని వర్తింపచేసారు.





# విశాఖలో జగన్‌కు స్వాగతం పలికిన వైసీపీ నాయకులు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**
శ్రీకాకుళం జిల్లాలోని వైఎస్ఆర్సీపి సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖర్ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు జగన్మోహన్ రెడ్డి గురువారం విశాఖకు వచ్చారు. విశాఖ ఎయిర్పోర్టులో జగన్మోహన్ రెడ్డికి పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్, మాజీ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ ,పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త డా.మళ్ళ విజయ ప్రసాద్,గాజువాక సమన్వయ కర్త తిప్పల దేవన్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

## జిల్లాలో క్రైమ్ రేట్
# తగ్గేలా చూడాలి
### పోలీస్ అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం



**నర్సీపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**
జిల్లాలో క్రైమ్ రేట్ తగ్గేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయలపాత్రుడు ఆదేశించారు. అయ్యన్నపాత్రుడుని గురువారం నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో అనకాపల్లి జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎల్. మోహన్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని, గంజాయి ముఠాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అతివేగంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో అతివేగాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవాలని, అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో క్రైమ్ సీఐ అప్పలనాయుడు, టౌన్ సీఐ గోవింద్ రావు పాల్గొన్నారు.

## చింతపల్లిలో
# కుండపోత వర్షం..
### కాఫీ మిరియాల రైతులకు అవస్థ

- వార్త 8లో..



## విశాఖ తీరాన
## షిప్ రిసార్ట్ ఏర్పాటుకు
# రంగం సిద్ధం

- 4 ఏళ్ల కిందట ఒడ్డుకు వచ్చిన 'ఎంవీ మా' నౌకకు హంగులు
- త్వరలోనే అందుబాటులోకి రానున్న రిసార్ట్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**
**పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న విశాఖ నగరానికి మరింత పర్యాటక శోభ రాబోతోంది. పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే విశాఖ బీచ్ రోడ్ లో యుద్ధ విమానాల మ్యూజియంలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మరికొద్ది రోజుల్లో హెలికాప్టర్ మ్యూజియం కూడా అందుబాటులోకి రాబోతోంది. తాజాగా మరొక అద్భుతమైన షోర్ అండ్ షిప్ రిసార్ట్ విశాఖకు వచ్చే పర్యాటకులకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.**
సుమారు నాలుగు సంవత్సరాల కిందట తుఫాను సమయంలో బంగ్లాదేశ్ కు చెందిన 'ఎంవీ మా' నౌక



కైలాసగిరి సమీపంలోని సముద్ర తీరానికి కొట్టుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ నౌకను తిరిగి జల ప్రవేశం చేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దీంతో ఆ నౌక యాజమాన్యం నౌకను యధాతధంగావదిలేసింది. ఈ నౌక నిర్వహణ కోసం ప్రతినెల ఐదు లక్షల రూపాయలు షిప్ యజమాని ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ నౌకను ఫ్లోటింగ్ షిప్ రిసార్ట్ గా మార్చాలని పర్యాటక శాఖ భావించింది. అయితే అనేక కారణాల వలన ఈ ఆలోచన ముందుకు సాగలేదు. కొద్దిరోజుల కిందట విశాఖలో జరిగిన పర్యాటక శాఖ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అమ్రాపాలీ విశాఖకు వచ్చినప్పుడు ఈ అంశం మళ్ళీ తెర మీదకు వచ్చింది. షిప్పి యాజమాన్యం, ఏ.పీ.టి.డి.సి ఎం.డి సంయుక్తంగా ఈ నౌకను పరిశీలించారు. సి.ఆర్.జెడ్ నిబంధనలకు ఇబ్బంది కలగకుండా ఈ నౌకను షిప్ రిసార్ట్ గా మార్చేందుకు కొన్ని అవకాశాలను పరిశీలించారు. ఈ సమావేశం జరిగిన కొద్ది రోజుల తర్వాత పర్యాటక శాఖ ఉన్నతాధికారులు షిప్ రిసార్ట్ ఏర్పాటుకు ఉన్న సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేశారు. ఇదే సమయంలో షిప్ రిసార్ట్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు కూడా ప్రభుత్వం నుంచి అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇవన్నీ త్వరితగతిని జరిగితే మరికొద్ది నెలలోనే విశాఖ వాసులకు, అంతేకాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకు షిప్ రిసార్ట్ అందుబాటులోకి రాబోతోంది.

## శ్రీబాల తులసి తల్లి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్..

**ఎలమంచిలి, ఫిబ్రవరి 20 ,ప్రభాతవార్త:**
నియోజకవర్గ మునగపాక మండలం మడక పాలెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ బాల తులసి తల్లి అమ్మవారి పండుగ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జనసేన టిడిపి బిజెపి నాయకులు గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు



## రికార్డు స్థాయిలో 900 మందికి
# జిమ్‌సర్ 'సిపిఆర్ శిక్షణ'



**విశాఖపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
: గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు అత్యవసర పరిస్థితులలో హృదయ శ్వాశకోశ పునరుజీవనం (సిపిఆర్) ద్వారా ఎలా సహాయ పడవచ్చో తెలియ జేయడానికి, ప్రతి ఒక్కరు సకాలంలో స్పందించి ప్రాణదాతలుగా నిలవడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఎమర్జెన్సి మెడిసిన్ ఎస్‌బిఎమ్ఇ విభాగం రికార్డు స్థాయిలో 900 మందికి శిక్షణ ఇచ్చిందని విభాగం అధిపతి డాక్టర్ దివ్యబన్నా వెల్లడిరచారు. అతర్జాతీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా వైద్యులతో పాటు అంబులెన్సు డ్రైవర్‌లు, నర్సింగ్ సిబ్బంది, ఆక్సిజన్ ప్లాంట్ సిబ్బంది, ఫార్మశీ, ఆతిద్యవిభాగం మరియు సెక్యూరిటి, హౌస్ కీపింగ్ సిబ్బంది మరియు విద్యార్ధులకు దశల వారీగా ఈ శిక్షణ అందించినట్లు ఆమె తెలిపారు. మరో 900 మందికి రానున్న రోజులలో ఈ శిక్షణ అందిస్తామన్నారు. గీతం ఆసుపత్రిలో ని అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా గల

తరువాయి 8లో..



మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, గాజువాక మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, గాజువాక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి,74 వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి.



## ఏపీఐఐసీ భూములను పరిశీలించిన
# జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ..!
### బల్క్ డ్రగ్స్ కు ఇంకా భూమి అవసరం..



**( నక్కపల్లి, ప్రభాతవార్త)**
మండలంలోని ఏపీఐఐసి పెట్రో కారిడార్ కోసం సేకరిస్తున్న భూములను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ముందుగా మండలానికి వచ్చిన ఆమె పెట్రో కారిడార్ కోసం నిర్మించే పవర్ ప్లాంట్ రహదారి నిర్మాణానికి సంబంధించిన జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాగిత గ్రామం నుంచి మూలపర్ర శివారు వాటి మీద వరకు పరిశీలించారు. మూలకర వద్ద నిర్మించబోయే సబ్ స్టేషన్‌ను పరిశీలించి అందుకు సంబంధించిన రహదారి మార్గం తదితర అంశాలతో

తరువాయి 8లో..

## సంపత్ వినాయక ఆలయ
# హుండీ లెక్కింపు




**విశాఖపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**
శ్రీ సంపత్ వినయగర్ ఆలయ హుండి లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. గడిచిన 21 రోజుల నుంచి వచ్చిన ఆదాయ వివరాలను ఆలయ అధికారులు తెలియజేశారు. ఈ 21 రోజుల్లో 14,75,802 రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు. 820 మిల్లీ గ్రాముల బంగారం, 056-000 మిల్లీగ్రాముల వెండి, 108 యూఎస్ డాలర్లు, కుతార్ రేయాల్ -1, బంగ్లాదేశ్ డాకా- 20, చెక్ -111.00 నువ్వ వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ హుండి పర్యవేక్షకులు ప్రసన్న లక్ష్మి , వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు ఎస్బిఐ సిబ్బంది హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నట్టు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్. టి.ఆర్.చోలన్, కమిషనర్, కార్యనిర్వాహక అధికారి టి.అన్నపూర్న ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు

### ఉత్తరాంధ్ర జిల్లాల ఏఆర్వోలతో రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**
ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానంలో ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సంబంధించి పక్కా ఏర్పాట్లు చేయాలని, శాంతిభద్రతల సమస్య రాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఉమ్మడి జిల్లా ఏఆర్వోలను రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల అధికారులతో గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నిక



నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో

తరువాయి 8లో..

## రికార్డు స్థాయిలో 900 మందికి
# జిమ్‌సర్ 'సిపిఆర్ శిక్షణ'

(7వ పేజీ నుంచి తరువాయి)

సిమ్యులేషన్ ఆధారిత వైద్య విద్యా విభాగం (ఎస్‌బిఎమ్ఇ) నిపుణులు డాక్టర్ స్వర్ణలత, దివ్యవాణిల పర్యావేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా సిపిఆర్ పై పెద్ద సంఖ్యలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడాన్ని గురువారం జరిగిన కార్యక్రమంలో జమ్‌సర్ ప్రో వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి అభినందించారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు సామాజిక కార్యకర్తల లాగా అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి సిపిఆర్ ద్వారా ప్రాణదానం చేయాలని అలాగే దీనిపై మరి కొంత మందికి అవగాహన కల్పించాలని సూచించారు

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు

(7వ పేజీ నుంచి తరువాయి)

ఆచితూచి వ్యవహరించాలన్నారు.పోలింగ్ మెటీరియల్ అందజేత, స్వీకరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, జవాబుదారీతనం ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. వారికి స్థానిక అధికారులు తగిన వసతి కల్పించాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని, తాగునీరు, ఆహారం అందజేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులకు చెప్పారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలపాలని, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలని ప్రక్రియకు సంబంధించిన సమాచారం చేరవేతలో జాగురూకతతో వ్యవహరించాలని సూచించారు.

## ఏపీఐఐసీ భూములను పరిశీలించిన
# జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ..!



(7వ పేజీ నుంచి తరువాయి)

కూడుకున్న వివరాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. అనంతరం బోయపాడు, పెద్ద తీనార్ల గ్రామాల పరిధిలో ఏపీఐఐసీ భూములు పరిశీలించే ముందు బల్క్ డ్రగ్స్ కు సంబంధించిన జరుగుతున్న పనులను చూసారు కాంట్రాక్టర్ తో పనులు విషయమై చర్చించారు వేగవంతంగా పనులు జరుగుతున్న విషయాన్ని చూసిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతంగా పనులు జరగడానికి కృషి చేస్తున్న ఆర్డీవో వివి రమణ, తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తి, సీఐ కే కుమార స్వామి లను ఆమె అభినందించారు. అనంతరం ఏపీఐఐసీ భూములను ఆయా ప్రాంతాల్లో పరిశీలించారు. మండల స్థాయి అధికారులతో మాట్లాడారు భూములు సేకరణకు సంబంధించి ఏపీఐఐసీ జడ్ఎం నరసింహారావు డిప్యూటీ జోనల్ మేనేజర్ శీను బాబు, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజేందర్ రెడ్డి తదితరులు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఐఐసి భూసేకరణలో భాగంగా బల్క్ డ్రగ్స్ కు ఇంకా వెయ్యి ఎకరాల అవసరమై ఉందని చెప్పారు ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో అవసరాన్ని మేరకు స్టీల్ ప్లాంట్ రాబోతుందని అన్నారు. స్టీల్ ప్లాంట్ కు సంబంధించి సేకరించిన భూముల్లో పవర్ ప్లాంట్ ఉండడం వలన ఆ పవర్ ప్లాంట్ కు సంబంధించిన సబ్ స్టేషన్ను మార్చే ఆలోచనలో ఉన్నామని అక్కడే పెట్టాలా లేక వేరేచోట పెట్టాలనేది ఆలోచిస్తున్నామని కొద్దిరోజుల్లో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. అనంతరం మండలంలోని పెద్ద బోధిగలం వద్ద సేకరిస్తున్న భూములను పరిశీలించిన ఆమె ఆర్ అండ్ ఆర్ కాలనీకి సంబంధించి ఇప్పటినుంచే అన్ని సదుపాయాలు ఉండేటట్లు చూసుకోవాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. సర్వేర్ పొడగట్ల సత్తిబాబు, ఆర్ ఐ కన్నబాబు, ఏపీఐఐసీ అధికారులు రవికుమార్ లతోపాటు పలువురు అధికారులు ఉన్నారు.

# చింతపల్లిలో కుండపోత వర్షం.
## కాఫీ మిరియాల రైతులకు అవస్థ.

చింతపల్లి ఫిబ్రవరి 20 ప్రభాతవార్త.

చింతపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం వరకు వేడిమితో ఉన్న వాతావరణం ఉన్నప్పటికీ, నాలుగు గంటల సమయం వచ్చేసరికి భారీ కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారిగా భారీ వర్షం పడిపోవడంతో కల్లాలలో ఆరబెట్టిన కాఫీ, మిరియాలు గింజలు తడిసిపోకుండా కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. కాఫీ మిరియాలు గింజలపై టార్పాలిన్లు పరచడానికి కూడా సమయం లేకుండా వర్షం హఠాత్తుగా పడింది. వర్షం వల్ల ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరుకున్నది. గిరిజన ప్రాంతంలో సాధారణంగా తొలకరి వర్షాలు మార్చి ప్రారంభంలో కురుస్తాయి దానికి భిన్నంగా ఊహించని విధంగా భారీ వర్షం ఫిబ్రవరిలో కురిసింది. అకాల వర్షంతో లంబసింగి లో జరిగే వారపు సంత వర్తకులు వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.



## జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పేదాడ రమణి

విశాఖపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలుగా పేదాడ రమణి కుమారి నియమితులైన తరువాత, గురువారం విశాఖపట్నం వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాథమిక పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



ఆనందపురం, ఫిబ్రవరి20, ప్రభాతవార్త

మండలంలోని గంభీరం ప్రాథమిక పాఠశాలకు విశాఖపట్నంలోని గాప్ టఫ్ గ్లాస్ సంస్థ ఫ్యాన్లు ను అందజేసింది. సంస్థ అధినేత గంగిరెడ్డి కొవ్వూరి సుమారు రూ.25 వేలు విలువ చేసే 16 ఫ్యాన్లను అందజేశారు. ఈ మేరకు ప్రతి తరగతి గదిలో 4 ఫ్యాన్లు చొప్పున అమర్చారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పిల్లల సౌకర్యార్థం ఫ్యాన్లు అందించినట్లు గంగిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలోప్రధాన ఉపాధ్యాయుడు యు వి వి ప్రసాద్, ఉపాధ్యాయులు రామకృష్ణ, వరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ చేసి అవు పొట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు

ఆనందపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



ఆనందపురం పశు వైద్యశాల అధికారి ఆపరేషన్ చేసి అవు పొట్టలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి ఆవు ప్రాణాలు కాపాడారు. ఆనందపురం పశువైద్యాశాలలో ఆవుకి ఆపరేషన్ చేసి 50 కేజీల వరకు ప్లాస్టిక్ తీశారు. మండలంలోని వేములవలసకు చెందిన రైతు కోరాడ నాయుడుబాబు కు చెందిన ఆవు ఐదు రోజుల నుండి తిండి తినకుండా ఇబ్బంది పడుతోందని పశు వైద్యుడుని సంప్రదించారు. దీంతో పశు వైద్యాధికారి అనీల్ అవును పరీక్షించి ఆపరేషన్ చేయగా పొట్టలోనుంచి 50 కిలోల వరకు ప్లాస్టిక్ కవర్లు, తాళ్లు తీశారు. ప్లాస్టిక్ వలన మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని డాక్టర్ అనిల్ కుమార్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ ఆపరేషన్లోపశు వైద్య సిబ్బంది సుజాత, దుర్గ లక్ష్మి ,రమణ, సంతోష్, సాగర్, సుబ్రహ్మణ్యం, నర్సింగ్ పాల్గొన్నారు.

# వెల్లంకిలో గృహ నిర్మాణ పనులు పరిశీలన

ఆనందపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:



ఆనందపురం మండలంలోని వెల్లంకి గ్రామంలో నిర్మాణంలో ఉన్న కాలనీ గృహాలను ఎంపీడీవో డాక్టర్. వి.జానకి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ ఇళ్లను సకాలంలో నిర్మించుకోకపోతే ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని నిలిపి వేస్తుందని వివరించారు. మండలంలో వివిధ గ్రామాలకు 2684 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకూ 1219 గృహాల నిర్మాణం పూర్తి అయిందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులందరూ నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంపీడీవో జానకి ఆదేశించారు.


## స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ సదుపాయాలను యధావిధిగా కొనసాగించాలి

గాజువాక,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :




స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ సదుపాయాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఉక్కు పరిపాలన భవనం ఎదురుగా గురువారం ఉక్కు రిటైర్ ఉద్యోగులు అఖిల పక్ష కార్మిక సంఘాలు ఉక్కు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు పేరుతో ఉక్కు యాజమాన్యం రిటైర్డ్ ఉద్యోగుల, పర్మినెంట్ కార్మికుల కాంట్రాక్టు ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీయటమే గాక అనేక ఆంక్షలు విధించి వారి జీవితాలను దుర్లభం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ ఇన్సూరెన్స్1300 వందల నుండి, 20 వేలకు పెంచుతూ యాజమాన్యం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. నిర్మాణ దశ నుంచి,విస్తరణ లాభాలు, టర్న్ అరౌండ్ అనేక దశల్లో అహో రాత్రులు శ్రమించిన కార్మికులు రిటైర్ అయిన తరువాత వారి పట్ల దుర్మార్గంగా వ్యవహరించడం యాజమాన్య పెద్దలకు తగదన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. ఉమ్మడి తెలుగు ప్రజల ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తున్నట్లు ప్రధానితో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయించాలని డిమాండ్ చేసారు. గనులు కేటాయించాలని సయిల్ లో విలీనం చేయాలని, పూర్తిస్థాయి సిఎండి డైరెక్టర్లను యాజమాన్యాన్ని నియమించాలని అవినీతి అధికారులకు ఉద్వాసన పలకాలని ఈ సందర్భంగా కోరారు. దేశంలో అన్ని ఉక్కు పరిశ్రమల్లో నూతన వేతన ఒప్పందాలు జరిగి అమలు జరుగుతుంటే విశాఖ ఉక్కు ప్రతి నెల సగటున 25000 నష్టపోతున్నారని ఏడేళ్లుగా కేంద్ర ఆంక్షలు కొనసాగుతున్నాయని ఇది చాలదన్నట్టు హెచ్ఆర్ఏ , ఇన్సెంటు,నిలుపుదల, తోపాటు గత ఆరు నెలలుగా ఉద్యోగులు వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదని మండిపడ్డారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణం స్పందించి కేంద్ర ప్రభుత్వం తో మాట్లాడి పై అంశాలపై వారి విధానాన్ని ప్రకటించాలని సందర్భంగా కోరారు. అనంతరం ఉక్కు సిజియం హెచ్ఆర్ గాంధీ కి వినతి పత్రం సమర్పించారు. మాటూరు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రిటైర్డ్ఉద్యోగుల సంఘం నాయకులు దీనబంధు, పి పెద్దిరాజు, డి ఆదినారాయణ, ఎంఎ మాధవరావు,ఎన్. బాల భాస్కరరావు,ఎన్ రామారావు, కోరాడ అప్పారావు, కృష్ణారావు,పాల్గొనగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జె, అయోధ్య రాం, వరసాల శ్రీనివాసరావు, కె ఎస్ ఎన్ రావు,నీరుకొండ రామచంద్రరావు. రామస్వామి,విల్లా రామ్మోహన్ కుమార్, బొడ్డు పైడిరాజు, సన్యాసిరావు, కామేశ్వరరావు, పరంధామయ్య, , దాసరి సురేష్, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంతి ఉద్యోగుల పెన్షన్ సవరణలు చేపట్టాలి
### బిఎస్ఎన్ఎల్ విశ్రాంతి ఉద్యోగుల డిమాండ్




ఆరిలోవ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు మూడో వేతన సవరణ తక్షణమే ప్రకటించి, పెన్షన్ రివిజన్ తో పాటు 4జి, 5జి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఏ ఐ బి డి పి ఏ అసిస్టెంట్ రాష్ట్ర కార్యదర్శి జి ఎస్ ఎన్ రాజు అన్నారు. ఈ మేరకు గురువారం ముసలాక్షి నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 2017 జనవరి నుంచి 15% ఫిట్మెంట్తో వేతన సవరణ జరగాల్సి ఉన్న ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు 10 ఏళ్లకోసారి వేతన సవరణ జరగాల్సి ఉన్న 17 ఏళ్లగా పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. గత ఎనిమిదేళ్ల నుంచి పెన్షన్ రివిజన్ జరగకపోవడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని దానికి తోడు కోర్టు కేసులు సాకుగా చూపించి పెన్షన్ సవరణను నిరాకరిస్తుంది అన్నారు. పెన్షన్ సవరణ జరగకపోవడం వల్ల పెన్షనర్లు పై ఆధారపడ్డ లక్షలాది మంది కుటుంబాలు బాధపడుతున్నట్లు తెలియజేశారు ఈ సమావేశంలో ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్. గోవిందరావు, జి. ఫ్రాన్సిస్, పి ఎ రమణ ఎన్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ కోరుతూ
# 23న ఆరు జిల్లాల న్యాయవాదుల సదస్సు

విశాఖపట్నం ఫిబ్రవరి 20.ప్రభాతవార్త



జస్టిస్ ఎట్ డోర్ స్టెప్స్ నినాదంతో విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 23వ తేదీ ఉదయం 10. 30 గంటలకు విశాఖపట్నం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ నూతన కార్యాలయంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాలకు చెందిన న్యాయవాదులతో సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ గురువారం ఇక్కడ తెలియజేశారు. హైకోర్టు బెంచి ఏర్పాటు డిమాండ్ 1993 నుండి ఉందని ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్లో ఉన్న కేసుల్లో 43శాతం ఈ ప్రాంతానికి చెందినవేనని అన్నారు. హైకోర్టుకు విజయవాడ వెళ్లాలంటే 700 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ తో పాటు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆదివారం జరుగు సభలో ఇందుకు సంభందించి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తొలి దశలో రాష్ట్రపతి,సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్యమంత్రి, రాష్ట్ర న్యాయ శాఖ మంత్రికి వినతి పత్రాలు సమర్పిస్తామని మలిదశలో ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. ఈ సదస్సుకు న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. హైకోర్టు కోసం అవసరమైతే ఉద్యమ రూపం దాల్చేలా కార్యక్రమం రూపొందిస్తామని బెవర సత్యనారాయణ తెలిపారు.

## ఘనంగా దుర్గ పోలమాంబ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు
### ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక పదో వార్డు పరిధిలోగల బిఎన్ఆర్ నగర్లో వెలిసిన శ్రీ దుర్గా పోలమాంబ అమ్మవారి ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి సాల్వాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ మద్దిల రాజశేఖర్, తెదేపా నాయకులు ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరి గోవింద్, బలగ సుధాకర్, గాడు అప్పలనాయుడు, కొండమ్మ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గెద్దపేట గ్రామంలో పనిచేయని విద్యుత్ ట్రాన్సుఫార్మరు.



పద్మనాభం,ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

మండలంలో గెద్దపేట గ్రామంలో చింతబంద పొలాలలో ఉన్న విద్యుత్ ట్రాన్సుఫార్మరు మరమ్మతులకు గురైంది. దీంతో రైతులు సాగునీటి కోసం అనే ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం ఆగష్టులో మరమ్మత్తులకు గురైన దానిని విద్యుత్ శాఖ అధికారులు తీసుకెళ్లి పనిచేయని ట్రాన్సుఫార్మరు వేసి చేతులు దులుపుకున్నారని గ్రామ టీడీపీ నాయకుడు గెద్ద ప్రసాదు, ఆప్రాంత రైతులు తవుడు, అప్పలనాయుడు, ఎర్రినాయుడు తదితరులు ఆరోపించారు. నూతన ట్రాన్సుఫార్మరు వేయమని అధికారులను అడిగితే వరిపంట అయిన తరువాత వేస్తామని చెప్పి నేటి వరకు వెయ్యలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నూతన విద్యుత్ ట్రాన్సుఫార్మరును వేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఆ శాఖ అధికారి వెంకటేశ్వరరావును వివరణ కోరగా రెండు రోజులలో ట్రాన్సుఫార్మరును ఏర్పాటు చేస్తారని అన్నారు.

## వైసిపి సాంస్కృతిక విభాగ అధ్యక్షుడిగా మారుతి ప్రసాద్



విశాఖపట్నం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

వైసిపి విశాఖ సాంస్కృతిక అధ్యక్షుడిగా వంకాయల మారుతి ప్రసాద్ ను నియమిస్తున్నట్లు వైసీపీ రాష్ట్ర కార్యవర్గం ప్రకటించింది. ఆ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మారుతి ప్రసాదం నియమిస్తున్నట్లు వైసిపి ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు ఆయన వైసిపి నాయకులకు జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేసానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు

# వివాహితపై అఘాయిత్యం వలనే అప్పన్న హత్య
### కాపులుప్పాడ హత్య కేసులో వీడిన మిస్టరీ
### నిందితులైన భార్య భర్తలు అరెస్ట్

ఆనందపురం, ఫిబ్రవరి20, ప్రభాతవార్త



అన్ని సమస్యలకు పూజలతో పరిష్కారం చూపిస్తానని అందరినీ నమ్మించి తుదకు ఓ వివాహితపై అఘాయిత్యానికి పాల్పడడంతోనే కాపులుప్పాడ వద్ద వెలుగు చూసిన సంఘటనలో జ్యోతిష్యుడు దారుణ హత్యకు గురైనట్టు పోలీసులు విచారణలో వెల్లడయింది. పూజల పేరుతో తనను జ్యోతిష్కుడు అయిన అప్పన్న తరచూ కలుస్తూ వేధింపులకు గురిచేస్తుండడంతో తట్టుకోలేని వివాహిత తన భర్తతో కలిసి జ్యోతిష్కుడును పెట్రోల్ పోసి తగలబెట్టింది. ఈ సంఘటనలో హత్యకు పాల్పడిన భార్యాభర్తలను భీమిలి పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి బీసీ కాలనీకి చెందిన మోతి అప్పన్న గ్రామాలలో తిరుగుతూ జ్యోతిష్యం చెబుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 9న ఆనందపురం వచ్చిన అప్పన్న తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఈ నెల 10న అప్పన్న కుటుంబ సభ్యులు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు జరిపిన విచారణలో కాపులుప్పాడ వద్ద అప్పన్న హత్యకు గురైనట్టు బుధవారం కనుగొన్నారు. దీంతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు కేసు మిస్టరీని ఛేదించారు.

### హత్యకు అసలు కారణం ఇది

భీమిలి మండలం నేరెళ్లవలస ప్రాంతానికి చెందిన భార్యా భర్తలైన ఊళ్ళ చిన్నారావు, మౌనిక అనే ఇద్దరు ఇటీవల ఆనందపురం మండలంలోని లొడగలవాని పాలెంలో ఒక ఇంటిని అద్దెకి తీసుకొని నివసిస్తున్నారు. కాగా వారి ఇంటికి సమీపంలో టీ కొట్టును నడుపుకుంటున్న ఎడ్ల తిరుపతమ్మ అనే మహిళతో ఆ భార్యాభర్తలకు పరిచయం ఏర్పడింది. ఇదిలా ఉండగా జ్యోతిష్కుడు అయినా అప్పన్న ప్రతి ఆదివారం, మంగళవారం తిరుపతమ్మ టీ షాప్ వద్దకు వస్తుంటాడు. ఈ క్రమంలో తమకు బాగా తెలిసిన వారైనా మౌనిక కుటుంబానికి సమస్యలు ఉన్నాయని జ్యోతిష్యుడికి తిరుపతమ్మ చెప్పింది. దీనితో మౌనిక సమస్యలను పరిష్కరిస్తానని చెప్పి వారింటికి వెళ్లి పూజలు చేస్తానని జ్యోతిష్కుడు నమ్మించాడు. ఈ క్రమంలో మౌనిక ఇంటికి వెళ్లిన జ్యోతిష్కుడు ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, భయపెట్టి ఆమెను బలవంతంగా అనుభవించాడు. ఈ విషయాన్ని ఎవరికైనా తెలిపితే కుటుంబాన్ని నాశనం చేస్తానని హెచ్చరించాడు. దీంతో భయాందోళనకు గురైన మౌనిక ఈ విషయాన్ని భర్త చిన్నారావుకు తెలపగా జ్యోతిష్కుడును హతమార్చాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం చిన్నారావు ఒక కత్తిని కొనుగోలు చేశాడు. అనంతరం కాపులుప్పాడలో ఉంటున్న తన తల్లికి అనారోగ్యంగా ఉందని పూజలు చేయాలని నమ్మించి అప్పన్నను ఆనందపురం రప్పించాడు. అతనిని అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై కాపులుప్పాడకు సమీపంలో గల ఒక ప్రైవేటు లేఔట్ లోనికి తీసుకుని వెళ్లి కత్తితో పొడిచి అప్పన్నను హతమార్చాడు. ఈ సంఘటనలో చిన్నయ్య కుడి చేతికి గాయం కాగా కేజీహెచ్ లో చికిత్స పొంది మంగళవారం వచ్చాడు. ఆరోజు తెల్లవారుజామున భార్యతో కలిసి చిన్నారావు టిన్నరు, పెట్రోలు డబ్బాలను పట్టుకొని మోటార్ బైక్ పై సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ శవం పై పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఆనవాళ్లు దొరక్కుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా పోలీసులు విచారణలో ఈ అఘాయిత్యం బట్టబయలు కావడంతో భార్యాభర్తల అయిన చి, మౌనికలను పోలీసులు అరెస్టు చేశారు. వారు వద్ద నుంచి కత్తి, రక్తపు మరకలతో ఉన్న ముద్దాయి జీన్ ప్యాంటు, చనిపోయిన వ్యక్తి ఫోన్ పౌచ్, మోటార్ బైక్, సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు

## విద్యార్ధులకు మండలస్థాయి పోటీలు : ఎంఈవో కే.నరేష్





నక్కపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

హెట్రో సంస్థ ప్రతినిధులు జిఎంలు ఎస్. కుళ్ళాయి రెడ్డి, అకౌంట్స్ జి.ఎమ్.ఎమ్. సుబ్బారెడ్డి, సంస్థ ప్రతినిధులఆధ్వర్యంలో మండలంలో పలు ఉన్నత పాఠశాలల విద్యార్ధులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను గురువారం నిర్వహించారు. మార్చి 3న జాతీయ రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాలి కోన్నతపాఠశాల వేదికగా నిర్వహించిన ఈ పోటీలకు పలు పాఠశాలలనుండి అనూహ్య స్పందన లభిం చింది. స్థానిక మండలవిద్యాశాఖాధికారి కె.నరేష్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో 60 మంది విద్యార్ధులు హాజరయ్యారు.సీనియర్స్ వ్యాసరచన పోటీల్లో గృహోపకరణాల వినియోగంలో భద్రతా ప్రమాణాలు అనే అంశంపై, చిత్రలేఖనంలో రహదారి భద్రత అనే అంశంపై ఈ పోటీలను నిర్వహిం చారు. విభాగాలవారీగా గెలుపొందిన విద్యార్ధుల కు ప్రథమ, ద్వితీ య, తృతీయ స్థానాలవారికి ఆర్ధిక సహకారం అందిస్తున్నట్లు హెట్రో ప్రతినిధులు తెలియజేశారు. ఎమ్.ఈ.వో. నరేష్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ మండలంలో పాఠశాలల విద్యార్థులకు, హెట్రో ఒక వరం అని అందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవలే పదవతరగతి విద్యార్ధులకు హెట్రో సంస్థ స్టడీ మెటీరియల్ ను అందజేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.పాఠశాల హెచ్. ఎమ్. సుందరరావు మాట్లాడుతూ హెట్రో సంస్థ వారు నిర్వహించే ఈ మండలస్థాయి పోటీలకు బాలికోన్నతపాఠశాల పాఠశాల వేదికకావడం ఒక అదృష్టంగా భావించారు. వారుచేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆయన అన్నారు. హెట్రో సిబ్బంది చింతల శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి. ఎస్.ఆచార్యులు, నీలకంఠకుమార్, గుణావతి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నక్కపల్లిలో ఆధార్ సెంటర్ పున: ప్రారంభించాలి : జిల్లా కలెక్టర్‌కు వినతి

నక్కపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



నక్కపల్లి పంచాయతీ కార్యాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని ఏపీఐఐసీ భూముల పరిశీలనలో భాగంగా పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌లను రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వీసం రామకృష్ణ కలసి వినతి పత్రం అందజేశారు. 14 సంవత్సరాలుగా నక్కపల్లి సచివాలయంలో ఆధార్ సెంటర్ నడిచేదని అది మూసి వేయడం వలన మండలంలోని ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే మళ్ళీ పునః ప్రారంభించాలని కోరారు స్పందించిన కలెక్టర్ పరిశీలిస్తామని చెప్పారు.

## నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్‌కు వినతి



నక్కపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులు సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ గురువారం నక్కపల్లి వచ్చిన జిల్లా కలెక్టర్ ను వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ గింజాల వెంకటరమణ లు కలసి వినతి పత్రం అందజేశారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్‌లో భాగంగా ఏర్పాటు చేయబోయే పరిశ్రమలు, రోడ్డు కొరకు సేకరిస్తున్న భూములు, ఇల్లు కోల్పోతున్న వారుకి పెద్ద బోది గల్లంలో ఇవ్వబోతున్న ఇల్లు స్థలాల లే -అవుట్ పరిశీలించడానికి నక్కపల్లి వచ్చిన జిల్లా కలెక్టర్‌కి వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని,2013 భూ సేకరణ చట్టం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన వారికి 25 లక్షల రూపాయలు ప్యాకేజీ ఇవ్వాలని, సాగు భూములకు నష్టపరహారం వెంటనే చెల్లించాలని, డి- ఫారం,సాగు భూములలో గల తోటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు,2013 భూ సేకరణ చట్టం ప్రకారం, భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఎటువంటి పనులు చేపట్టకూడదు అయినా ఇక్కడ అధికారులు మొత్తం 2013 చట్టాన్ని, కోర్టు తీర్పు లను ధిక్కరించి పనులు చేస్తూ నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు, నిర్వాసితులు సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని, సమస్యలు పరిష్కారం చేసే వరకు పనులు నిలుపుదల చేయాలని కోరారు, బల్క్ డ్రగ్స్ పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యానారాయణ, ఉన్నారు.

## జనార్ధన్‌ను అభినందించిన జిల్లా గ్రంధాలయ కార్యదర్శి

నక్కపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



ఉమ్మడి జిల్లా గ్రంధాలయ కార్యదర్శి సి. హెచ్.వెంకట్రావు గురువారం ఉదయం మండలంలో ఉపమాక గ్రామీణ గ్రంధాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు.గ్రంధాలయాధికారి కె.జనార్ధన్‌ను అడిగి వివిధ రికార్డుల ను పరిశీలించారు.గ్రంధాలయానికి సంబంధించిన 2023-24వ సంవత్సర వార్షిక తనిఖీ రికార్డులను, రోజువారీ గ్రంధాల యాన్ని సందర్శిస్తున్న పాఠకుల రిజిష్టర్‌ను చూసి జనార్ధన్ ను అభినందించారు. ఎక్కువ మంది సభ్యులతో ధరావత్తులను కట్టించాలని, గ్రంధాలయ సెస్సు గ్రామపంచాయితీల నుండి జిల్లాగ్రంధాలయ సంస్థ నిధులకు జమ అయ్యేటట్టు చూడాలన్నారు. ఇంకా గ్రంధాలయంలో పాఠకుల సంఖ్యను పెంచితే శాఖాగ్రంధాలయంగా అప్ గ్రేడ్ చేయుటకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.గ్రంధాలయం చుట్టూ గోడలకు మక్కు పెట్టి,పెయింటింగ్ వేయించేలా ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ తో ఫోన్ లో మాట్లాడారు.గ్రంధాలయ ఆవరణ పరిశుభ్రంగా ఉందని జనార్ధన్‌ను అభినందించారు.

## అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ నాయకులు

అనకాపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



స్థానిక విజయ రామరాజుపేట శ్రీ మరిడిమాంబ జాతర మహోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారిని తెలుగు దేశం పార్టీ నాయకులు దర్శించుకున్నారు. తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కే కే వి ఏ నారాయణరావు, శ్రీ భోగి లింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంటు మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు, పార్లమెంట్ కార్యదర్శి మల్ల గణేష్ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదం స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆళ్ల సూర్య రామకృష్ణ డాక్టర్ నారాయణరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొయిలాడ గణేష్ పిల్లా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దాన్యాది వాసం, పుష్ప దివాసం

ఎలమంచిలి ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



పట్టణములోని కొత్తపేట శ్రీ పార్వతి వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా గురువారం వేద పండితుల సమక్షంలో దాన్యాధివాసం, పుష్పాదివాసం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ కృష్ణ శర్మ ,భాగవతల శ్రీనివాసులు శర్మల ఆధ్వర్యంలో క్రొత్త ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధాన్యంతో కొత్త విగ్రహాలకు అభిషేకం చేశారు. రాత్రికి పుష్పాలతో పుష్పాదివాసన నిర్వహించారు వేద పండితులు పూజలు అనంతరం భక్తుల మహాబలిపురం నుండి తీసుకువచ్చిన కొత్త విగ్రహాలకు పూలతో అభిషేకం చేశారు. వేద పండితులు వేద పారాయణ ఆశీర్వచనం చేశారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రమాకుమారి ఆలయం నిర్మాణ కమిటీ సభ్యులు బండారు సత్య బంగారు శెట్టి, పెద్దింటి సూర్యనారాయణ మూర్తులు తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని బల్క్ డ్రగ్స్ కు సంబంధించి ఆ ప్రాంతాన్ని పరిశీలించిన సందర్భంలో పనులు విషయమై కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఉన్న దృశ్యం (నక్కపల్లి ,ప్రభాతవార్త)



## చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం..

ఎలమంచిలి ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త

పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆరో తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులు సి ఫోర్‌సి ఫైవ్ విద్యా ర్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ హృషికేశ్ దాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులను నిరంతరం సేవించాలని వారికి మనకి ప్రత్యక్ష దైవాలని, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని విద్యార్థులకు తెలియజేశారు, ఏసిఓ పట్నాయక్, డీన్ దత్తు, అసిస్టెంట్ డీన్ శ్రీనివాస్, సిబ్యాచ్ ఇంచార్జ్ లోవేశ్వరరావు, ఏవో ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణ నిండు ప్రాణాలను కాపాడుతుంది..

ఎలమంచిలి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



హెల్మెట్ ధారణ ద్వారా నిండు ప్రాణాలను కాపాడడమే కాకుండా ఆ కుటుంబం వెలుగులతో విరిజిలుతుందని డి.ఎస్.పి విష్ణు స్వరూప్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే పట్టణంలోని గురువారం హెల్మెట్ ధారణపై సీఐ ధనుంజయరావు, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ ను డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని,హెల్మెట్ దారణ పాటిస్తూ, డ్రంక్ అండ్ డ్రైవ్ కూడా మానుకొని తోటి వారికి అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించి, కుటుంబ సభ్యుల మనుగడను కాపాడే విధంగా అందరూ నడుచుకోవాలని డిఎస్పి కోరారు. పట్టణంలోనే సర్కిల్ కార్యాలయము నుండి గాజువాక బైపాస్ రోడ్డు జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో,గ్రామీణ ఎస్ ఐ ఉపేంద్ర, పట్టణ ఎస్సైసావిత్రి, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, మునగపాక ఎస్సై ప్రసాద్, పట్టణ ఏ ఎస్ ఐ నాయుడు బాబు, ట్రాఫిక్ ఏ ఎస్ ఐ రమాబాయి, మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ వెంకట్రావు, శ్రీనివాస్, మై హోమ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 21మందికి జరిమానా

### 11 మందికి నాలుగు రోజుల రిమాండ్ : ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ

ఎలమంచిలి ,ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 22 మందిని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా వారిలో 11మందికి ఒక్కొక్కరికి పదివేలు చొప్పున 1,10,000 జరి మానా విధించారని, 11 మందికి నాలుగు రోజులపాటు రిమాండ్ విధించారని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన ,డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడున ని తెలియజేశారు.

## కసింకోటలో జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు

కసింకోట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



మండల కేంద్రంమైన కసింకోతలో పన్ జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమానికి డిఆర్పీలు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు ఆటపాటలతో విద్యను అందించాలని అన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధి కారకాలు ద్వారా మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు శారీరిక, భాష, మేధస్సు, సామాజిక, భావోద్వేక, సృజనాత్మక రంగల ద్వారా పిల్లలకు విద్యనందించడం దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. కృత్యాధార పద్ధతిలో ద్వారా శిక్షకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పీవీ సురేష్, కేఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్లకు పోలీస్ సూచనలు

గొలుగొండ ఫిబ్రవరి20, ప్రభాతవార్త

పోలీస్ స్టేషన్ పరిధిలో రవాణాలో ఉన్న ఆటో డ్రైవర్ల యూనియన్ తో గొలుగొండ ఎస్సై పి రామారావు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, యజమానులు తప్పనిసరిగా సూచనలు అమలు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన సూచనలతో పాటు హెచ్చరికలు కూడా జారీ చేశారు. ఆటో నడిపేటప్పుడు మద్యం సేవించరాదని ప్రధాన చూసినగా తెలియజేశారు. నిబంధనలు పాటించాలి: ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రోడ్డు గుర్తులను ఖచ్చితంగా పాటించాలి. చిహ్నాలు మరియు లైన్ మార్గదర్శకాలను గౌరవించాలి.అవకాశమైనంత వరకు అనుమతి ఉన్న అతిక్రమణ మార్గాలను ఉపయోగించాలి: సిగ్నల్ లేకుండా ప్రమాదకరంగా రోడ్డు దాటి, నడవకుండా ఉండాలి. ఓవర్ లోడింగ్ వద్దు: అనుమతించిన సంఖ్య కంటే ఎక్కువ మందిని ఆటోలో తీసుకువెళ్ళకూడదు. ప్రయాణికుల భద్రతను గుర్తించాలి. మొబైల్ ఉపయోగించకూడదు: డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడడం ప్రమాదకరం. అవసరమైతే, వాహనం ఆపి మాట్లాడాలి. నెలనెలా వాహన పరిశీలన చేయిం చాలి. బ్రేకులు, లైట్లు, టైర్లు, ఇతర ముఖ్యమైన భాగాలు సరిగ్గా పని చేస్తున్నాయో లేదో తనిఖీ చేయించాలి. ప్రయాణికులతో మర్యాదగా, వినయంగా మాట్లాడాలి. సరైన మన్నింపు ఇవ్వాలి. ఎమర్జెన్సీ నంబర్లు కలిగి ఉండాలి: పోలీస్, అంబులెన్స్, ఫైర్ స్టేషన్ నంబర్లు దగ్గరలో ఉంచుకోవాలి. చేతి సంకేతాలు ఉపయోగించాలి: మలుపులు తీసే ముందు లేదా ఆగే ముందు స్పష్టమైన చేతి సంకేతాలు ఇవ్వాలి. చీకటి వేళల్లో హెడ్‌లైట్లు ఉపయోగించాలి: కాస్త వెలుతురు ఉన్నా హెడ్‌లైట్లు వాడటం వల్ల ప్రమాదాలు తగ్గుతాయి. పై సూచనలు అమలు చేస్తూ ప్రయాణికులతో పాటు డ్రైవర్లు కూడా సురక్షిత ప్రయాణాన్ని ఎంచుకోవాలని ఈ సందర్భంగా అన్నారు.

## ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

కసింకోట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా తూహిన్స్ సిన్హా ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు చెప్పారు. మండలంలోని తాళ్లపాలెం, బయ్యవరం ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఆటోలో డ్రైవర్ పక్కన ప్యాసింజర్ ను కూర్చోబెట్టడం గాని, అధిక లోడు వేసి ఆటోలో ను నడపడం చర్చ ఇచ్చిన నేరమని చెప్పారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన శిక్షలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కే లక్ష్మణరావు, మనోజ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## హైవే పెట్రోలింగ్ పోలీసులకు అత్యవసర సేవలపై ప్రత్యేక శిక్షణ

అనకాపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త




జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, అర్మ్ రిజర్వ్ డీఎస్పీపి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కైలాసగిరి, ఆర్మ్ రిజర్వ్ సమావేశ మందిరంలో గురువారం అనకాపల్లి జిల్లా నేషనల్ హైవే మొబైల్స్‌లో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో, నేషనల్ హైవే లో రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు, బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు అవసరమైన ప్రథమ చికిత్స, సిపీఆర్ చేయడం, అత్యవసర పరిస్థితుల్లో దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి బాధితులను వేగంగా తరలించడం వంటి ప్రాముఖ్యతగల అంశాలపై దృష్టి సారించారు. ఈ శిక్షణను అనకాపల్లి జిల్లా పోలీస్ యూనిట్‌కు చెందిన డాక్టర్ తబస్సుం అరా నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో 9 హైవే మొబైల్స్ పెట్రోలింగ్ వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి రెండు రోజుల పాటు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా హైవే పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో మరింత సమర్థంగా స్పందించి, ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు వీలు కలుగుతుందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మన్మధరావు, రామకృష్ణారావు, సంజీవరావు మరియు ఆర్ఎస్ఐ ఆదినారాయణ, ఆసుపత్రి సిబ్బంది, హైవే మొబైల్స్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బలిఘట్టం స్నాన ఘట్టాలను సందర్శించిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త



ఫిబ్రవరి 26 మహాశివరాత్రి సందర్భంగా బలిఘట్టం ప్రాంతంలోని స్నాన ఘట్టాలు మరియు పరిసరాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం సందర్శించారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు స్నానమాచరించడానికి వచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని పట్టణ సీఐ గోవిందరావుకు సూచించారు.ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, మహాశివరాత్రి హిందువులకు పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు.. నర్సీపట్నం ఉత్తర వాహినిని దక్షిణ కాశీగా పిలవడం జరుగుతుందని, పూర్వం నుండి పెద్దలు ఇక్కడ స్నానం చేసి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. 2018లో భక్తుల సౌకర్యార్థం స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశామని, గంగా హారతిని కూడా ప్రారంభించామని గుర్తు చేశారు. గతంలో లాగే, ఈ ఏడాది కూడా ఫిబ్రవరి 26వ తేదీ సాయంత్రం గంగా హారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం అన్నపూర్ణ అక్షయపాత్ర ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే, పాకలపాడు గురువుగారి ఆశ్రమం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తిశ్రద్ధలతో స్నానం చేసి, పరమశివుడి కృపాకటాక్షాలను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బ్రహ్మ లింగేశ్వర స్వామి స్థల పురాణం వీడియోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్, తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు, జనసేన ఇన్చార్జ్ రాజన వీర సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు విషయమై పరిశీలనకు వచ్చిన టిటిడి అధికారులు



నక్కపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

మండలంలోని ఉపమాక వెంకన్న అభివృద్ధి చేసే విషయంలో టిటిడి చైర్మన్ నాయుడు ఆదేశాల మేరకు టీటీడీ అధికారులు పరిశీలన కోసం గురువారం ఆలయానికి వచ్చారు. ముందుగా పూజలు నిర్వహించిన అనంతరం ఇటీవల రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చైర్మన్ కలిసి ఉపమాక ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని ఆ పనులు విషయమై ఆయనకు తెలియజేసిన విషయం తెలిసినదే.! ఆధారం స్పందించిన పనులను చేసేందుకు ప్రతిపాదన సిద్ధం చేసేందుకు టీటీడీ ఎస్ ఈ జగదీశ్వర్ రెడ్డి, ఈఈ సురేంద్ర నాథ్ రెడ్డి లు వచ్చి క్షుణ్ణంగా పరిశీలించారు. కొండపైకి రోడ్డు మెట్ల మార్గం, చెరువు కళ్యాణ మండపం, అతిథి గృహం, డార్మెటరీ వాటిని నిర్మించడానికి ప్రతిపాదనలు చేసి పంపుతామన్నారు. ఈ ఆలయానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు స్థల పరిశీలన వాటి వివరాలను మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి వివరించారు.

## ఆటో యూనియన్ సభ్యులకు కౌన్సిలింగ్




నర్సీపట్నం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:

జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు గురువారం నర్సీపట్నంలోని ఆటో యూనియన్ ససభ్యులకు టౌన్ స్టేషన్ వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా రోడ్లు భద్రత, ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. ముందు సీట్లలో ప్రయాణికులను కూర్చోబెట్టారాదని, ఓవర్ లోడింగ్, అదనపు ప్రయాణీకులను తీసుకెళ్లడం, ర్యాష్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లను ఉపయోగించకూడదని, నిషేధిత ప్రాంతాలలో అక్రమ పార్కింగ్, ప్రయాణీకుల నుండి అదనపు మొత్తాన్ని వసూలు చేయరాదన్నారు. అనంతరం డ్రగ్స్ పై అవగాహన కల్పించేందుకు ఆటోలకు కొన్ని పోస్టర్లను అతికించడం జరిగింది.టౌన్ సీఐ గోవిందరావు, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

## జనరల్ నాలెడ్జ్ సహా పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు



పాయకరావుపేట ఫిబ్రవరి ,ప్రభాతవార్త

సుచిర్ ఇండియా ఫౌండేషన్ సంస్థ గత ఏడాది డిసెంబర్ 28 న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 32వ సివి. రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల చిన్నారులు ప్రతిభను కనపరిచి యంగ్ జీనియస్ అవార్డులను సాధించినట్లు ఆ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థులల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ఆ సంస్థ జనరల్ నాలెడ్జ్ , గణితం,సామాన్య శాస్త్రం,సాంఘిక శాస్త్రం తదితరు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటి పరీక్షల్లో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల చిన్నారులు ప్రతిభను కనపరిచి ఈ అవార్డులను సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ,తృతీయ స్థానాలలో ఎమ్.హంసిని (9వ తరగతి), ఎమ్.విశ్రుత్ (5వ తరగతి) నిలిచి ఈ యంగ్ జీనియస్ అవార్డులను సాధించారు. వీరితో పాటు జిల్లా స్థాయిలో ఆర్.సాత్విక్ చంద్ర (3వ తరగతి), కె.ప్రహసిత (4వ తరగతి), డి.విఖ్యాత్ (5వ తరగతి), ఇ.నవీన్ హర్ష (6వ తరగతి), కె. సిద్ధార్థ్ వర్మ (7వ తరగతి),పి.శ్రీ గౌతమ్ కృష్ణ (8వ తరగతి) ప్రథమ స్థానంలోనూ, అలాగే వై.రిషి దుర్గ (4వ తరగతి),పి.శ్రీ వత్స (5వ తరగతి),ఎ.భువన శ్రీనివాస్ కామేష్ (7వ తరగతి) ద్వితీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హైదరాబాద్ లలిత కళాతోరణంలో జరిగిన కార్యక్రమంలో జ్ఞాపికలు సహా ప్రశంసా పత్రాలు అందచేసినట్లు తెలిపారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వికె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్వివిఎస్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

## ఆంగన్వాడీకేంద్రం సందర్శన

పాడేరు,ఫిబ్రవరి20,ప్రభాతవార్త



పాడేరు పట్టణం లోచల పుట్టు గ్రామంలో మినీ అంగనవాడి కేంద్రాన్ని పిసా చట్టం ఉపాధ్యక్షుడు బోనంగి రమణ, కార్యదర్శి. కొట్టగుల్లి సింహాచలం నాయుడు గురువారం సందర్శించారు. పిల్లలకు మధ్యాహ్నం భోజనంలో ఏం పెడుతున్నారని పిల్లల ఆరోగ్యం పై అరా తీశారు.అదేవిధంగా గ్రామంలో ఎ ఎం ఎం లు, ఆశ వర్కర్లు పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఆరోగ్యంగా ఉన్నారా లేదా అడిగి తెలుసుకున్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, PEELA ROJA KUMARI W/O PEELA SATEESH KUMAR previously called PENTAKOTA ROJA KUMARI R/O 60-33-170/10, TD COLONY, MALKAPURAM, VIZAG now changed my name from PENTAKOTA ROJA KUMARI to PEELA ROJA KUMARI Henceforth I will be called as PEELA ROJA KUMARI for all purposes. (Ro.No.43649)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## షెడ్యూల్ వారీగా పిసా శిక్షణ తరగతులు

కొయ్యూరు, ఫిబ్రవరి20 ప్రభాతవార్త



ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం మండల పరిషత్ కార్యాలయంలో పీసా శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మండల పరిధిలో గల రాజేంద్ర పాలెం, రేవళ్ళు, చీడిపాలెం, యు.చీడిపాలెం, చింతలపూడి పంచాయితీలో గల ప్రతి స్వయం సహాయక సంఘాల సభ్యులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. రెండు బ్యాచ్‌లు 237 మందికి గాను 201 మంది సభ్యులు హాజరయ్యారు, అలాగే షెడ్యూల్ ప్రకారం శుక్రవారం కూడా హాజరవ్వాల్సిన పంచాయితీల పరిధి ప్రతి స్వయం సహాయక సంఘం నుంచి ఒకరు తప్పనిసరిగా హాజరవ్వాలని, కొయ్యూరు మండల వెలుగు ఏపిఎంను ఎంపీడీవో ఎస్‌కేవి ప్రసాద్ ఆదేశించారు.

## విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలి..

పాడేరు,ఫిబ్రవరి20, ప్రభాతవార్త



గిరిజన విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఐటిడి ఏ ఇన్చార్జి పి.ఓ, జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ అన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నన్నికల్లి స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో విహార యాత్రకు వెళుతున్న 120 మంది విద్యార్థినులతో గురువారం ఐటిడిఏ సమావేశ మందిరంలో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. ధైర్యంగా మాట్లాడటం అలవరుచు కోవాలని చెప్పారు. కనీసం డిగ్రీ వరకు చదువుకుని పోటీ పరీక్షలకు సాధన చేయాలన్నారు. పది తరువాత ఇంటర్ లో చేరవలసిన గ్రూపులు, ఇంటర్మీడియెట్ తరువాత డిగ్రీ లో చేరాలని చెప్పారు. ఆతరువాత యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషన్, ఎపిపి ఎస్ సి పరీక్షలకు సిద్దం కావాలన్నార చదువు పూర్తి కాకుండా వివాహం చేసుకోకూడదన్నారు. వివాహం విద్యకు ఆటంకం కలిస్తుందని చెప్పారు. సామాజిక మాధ్యమాలకు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి తలిదండ్రులు బాల్య వివాహాలు అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ??. వేంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ బాషా, నన్నికల్లి సంస్థ ప్రాజెక్టు అధికారి లోతేటి జ్యోతి విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## కాఫీ రైతులకు ప్రోత్సహంగా ఉచితంగా టార్పలిన్స్ జిసిసి పంపిణీ

పాడేరు,ఫిబ్రవరి20,ప్రభాతవార్త



గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పన కుమారి ఐఎఎస్ ఆదేశాల మేరకు 100 కేజీలు పైగా జిసిసికి కాఫీని విక్రయించిన గిరిజన కాఫీ రైతులను ప్రోత్సవాహించాలనే ఉద్దేశ్యంతో రైతులకు ఉచితంగా టార్పలిన్స్ అందజేస్తున్నామని జిసిసి బ్రాంచ్ మేనేజర్ బుక్కా వెంకటేష్ తెలిపారు. గిరిజన కాఫీ రైతులకు ఉచితంగా టార్పలిన్స్ పంపిణీలో భాగంగా పాడేరు మండలంలో ఉన్న కరకపుట్టు, దొడ్డిపల్లి, వంతాడపల్లి, గురుపల్లి,మోదపల్లి, గుర్రగరువు,సంగోడి గ్రామాలకు చెందిన కాఫీ రైతులకు ఉచితంగా టార్పలిన్స్ బిఎం వెంకటేష్ చేతుల మీదుగా గురువారం ఆయా గ్రామాల్లో అందజేశారు. ఈ కార్యక్రమంలో జి సి సి సిబ్బంది దేవి,గిరిజన కాఫీ రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## యు.చీడిపాలెంలో తాగునీటి సమస్య పరిష్కారం

కొయ్యూరు, ఫిబ్రవరి20, ప్రభాతవార్త:



మండలంలోని అతి మారుమూల యు.చీడి పాలెం పంచాయితీలో పివిటిజి గ్రామాల్లో సర్పంచ్ దడాల రమేష్ పలు మంచినీటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక వార్డు సభ్యులు, పీసా కమిటీతో కలిసి బిళ్ళపాలెం, ఎండకోట, గొళ్లబంద గ్రామాల్లో మంచినీటి కుళాయిలను ప్రారంభించారు, ఈ కార్యక్రమానికి పాల్గొన్న పీసా వైస్ ప్రెసిడెంట్ గేమ్మెలి సింహాద్రి మాట్లాడుతూ ఎన్నాళ్లనుంచో తాగునీరు లేక చాలా దూరంనుంచి కాలువ నీళ్ళు తెచ్చుకొనే వారమని, దీనివల్ల వ్యాధులు బారిన పడేవారమని, గ్రావిటీతో ఇకపై ఆ ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ఇప్పటి వరకు తమ కష్టాలు పట్టించుకోనే నాథుడే లేడని, సర్పంచ్ దడాల రమేష్ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి మొదలయిందన్నారు. మర్రిపాకలు, జెర్రిగొంది, పాలసముద్రం, వేమనపాలెం తీగలమెట్ట, గొల్లబంద, ఎండకోట, బిళ్ళపాలెం, సంగంవలస గ్రామాలకు నీటి సమస్య తీరిందని, అలాగే బిల్లపాలెం, తోటదిబలక, పాలసముద్రం, నాలుగు గ్రామాలకు కొత్తగా విద్యుత్ లైన్ వేయించారని, చాలా గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నారని సర్పంచ్ కి రుణపడి వుంటామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ– ఎన్నో ఏళ్లుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని మారుమూల పంచాయితీని ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఎంతోకొంత అభివృద్ధి సాధించగలిగానని పంచాయితీ ప్రజల పూర్తి సహకారమే కారణమని అన్నారు. ఇందులో భాగస్తులైన ప్రజా ప్రతినిధులకు, మండల, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులకు పంచాయితీ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని సర్పంచ్ అన్నారు. పంచాయితీలో ఇంకా చాలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సర్పంచ్‌గా నాలుగు సంత్సరాలు పూర్తి చేసుకొని అభివృద్ధి విషయంలో తాను వ్యక్తిగతంగా సంతృప్తి కరంగా వున్నానని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్, వార్డు మెంబర్లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై అధికారుల దృష్టి పెట్టాలి

హుకుంపేట ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



ప్రజల సమస్యలపై అధికారులను దృష్టిపెట్టాల ని అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం కోరారు. మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని అలాగే సమయపాలన పాటించాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో సక్రమంగా సేవ భావంతో పనిచేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. మండల ప్రభుత్వ అధికారులను ప్రజల యొక్క సమస్యలపై దృష్టిపెట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు, ప్రోటోకాల్ తప్పక పాటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే పథకాలు సేవల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తే ఎంతటివారికైన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు సేవలు అందు విధంగా అధికారులు పనిచేయాలన్నారు. గ్రామస్తులు నెలకున్న సమస్యలను అధికారులు దృష్టి సారించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలన్నారు. ఎంపిడిఓ, తహసీల్దార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు మరియు మండల పరిధిలో గల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## మూగబోయిన బిఎస్ఎన్ఎల్ సిగ్నల్

ముంచింగిపుట్టు రూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



మండలంలోని పలు మారుమూల పంచాయితీల గిరి రైతులు రైతు భరోసా.పి ఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ది చేకోరేకోసం గిరి రైతులు ఈ కేవైసీ, ఆధార్ ఫోన్ నెంబర్ అనుసంధానం కోసం బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ లేకపోవడంతో సుదూర ప్రాంతాల గిరి రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రైతు భరోసా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, తదితర ప్రయోజనాలు, రాయితీలు ధృవపత్రాల కోసం సచివాలయం చుట్టూ గిరి రైతులు ప్రదక్షణలు చేస్తున్నారు. అయినా వారి సమస్య పరిష్కారం కాకపోవటంతో బిఎస్ఎన్ఎల్ అధికారులపై తీవ్రస్థాయి మండిపడుతున్నారు. ముఖ్యంగా, దుంబ్రిగుడ, మండల వ్యాప్తంగా కొల్లాపుట్టు, కోరాయి పంచాయితీ గ్రామాల ప్రజలు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న అరకు పంచాయితీ ఆర్.బి.కె కేంద్రంలో ఆటోలో ప్రయాణించి భూ ఆధార్ రిజిస్ట్రేషన్, ఆన్లైన్ 1బి కాపీ ఫోన్ నెంబర్ అనుసంధానం అయిన ఆధార్ చేయించుకుందామంటే బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సరిగ్గా పనిచేయపోవడంతో వెన్ను తిరుగుతున్నారు. భూ ఆధార్ రిజిస్ట్రేషన్ ఈనెల 25వ తేదీ లోపల గడువు ఉండడంతో గిరి రైతులు ఆందులను చెందుతున్నారు. బిఎస్ఎన్ఎల్ అధికారులు, సిబ్బంది, స్పందించి సాంకేతిక సమస్య పరిష్కరించి సిగ్నల్ అందుబాటులో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి భూ ఆధార్ రిజిస్ట్రేషన్ గడువు పెంచాలని గిరి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎంపీటీసీల గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలి

హుకుంపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త




స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట 20 నెలల ఎంపీటీసీల గౌరవ వేతనం బకాయి విడుదల చేయాలని కోరుతూ ఎంపీటీసీలు ధర్నా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కూడ రాజు బాబు మాట్లాడుతూ ఎంపీపీలు తిరగడానికి వెహికిల్ అలవెన్స్ ఇవ్వటం లేదనీ, ఎంపీటీసీల గౌరవేతనం మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ 20 నెలల నుండి గౌరవ వేతనం లేకా ఎంపీటీసీలు గ్రామాల్లో తిరగ లేక పోతున్నారని,సీపీఎం పార్టీ అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, ప్రజా ప్రతినిదులకు నెలకు రూ.17500 ఇస్తున్నారని అన్నారు. మన ఆంధ్రప్రదేశ్ లో కూడ ప్రతీ నెల 1వ తేదీ నే అకౌంట్‌లలోకి గౌరవ వేతనం పడేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎంపీటీసీలు ఆర్థిక ఇబ్బందులు గుర్తించాలని,ప్రజా ప్రతినిధులకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోతే గ్రామస్థాయిలో నిధులు సకాలంలో మంజూరు చేస్తారా అంటూ మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి బకాయి పడ్డ గౌరవేతనం ఎంపీపీ ఎంపీటీసీలకు సర్పంచ్లకు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శెట్టి మహేష్, భీమలింగేశ్వర రావు, సంబాయి కొండమ్మ,కోరాబు నాగ లక్ష్మి, కిల్లో మీనా,నైని రజని, సాంబే బాల కృష్ణ, కొర్ర నాగరాజు, సూపర్ ఎంపీటీసీలు నైని సత్తిబాబు, సంబాబు కామరాజు, కోరాబు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క రైతు ఫార్మా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి..

ముంచంగిపుట్టు ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



ప్రతి ఒక్క రైతు ఫార్మా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని దారెల సర్పంచ్ పాంగి. పాండు రంగస్వామి కోరారు. గురువారం మండలంలోని దారెల పంచాయితీ డీమ్ గూడు గ్రామంలో ఫార్మా రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో ఆయన ఈ సందర్భంగా సర్పంచ్ పాండురంగ స్వామి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగి పుట్టు మండలం దారెల గ్రామపంచాయతీ పరిధిలోగల డింబుగుడా గ్రామంలో భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రెవెన్యూ వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వాయంతో దేశంలో అదేవిధంగా మన మండలంలో ఉండే ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య (ఐడి) ఇవ్వాలని నిర్ణయించి ఫార్మా రిజిస్ట్రీ అనే ఒక కొత్త పోర్టల్ ను అందించడం జరిగిందని ,ఈ గుర్తింపు సంఖ్య వ్యవసాయం చేసే రైతులందరికీ ఇవ్వబడుతుందని ఈ ప్రక్రియ రైతు సేవ కేంద్రాల వద్ద వ్యవసాయ మరియు ఉద్యమ నాయకుల ద్వారా గుర్తించి నమోదు చేయడం జరుగుతుందని భూమి కలిగిన ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య అవసరని ప్రభుత్వం నుండి రాయితీలుగాని సహాయము గాని పొందాలంటే గుర్తింపు సంఖ్య తప్పనిసరి గుర్తించే విధానం భూమికి కలిగిన ప్రతి రైతు తనకు ఏ సర్వే నెంబర్లు భూమి ఉన్నదో తెలియజేసే 1బి లేదా పట్టాదార్ పాస్ పుస్తకం ఆధార్ కార్డు ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్ను తీసుకొని రైతు సేవ కేంద్రానికి వెళ్లినట్లయితే అక్కడ వ్యవసాయ నాయకులు నమోదు చేసి గుర్తింపు అంకెలు తమ మొబైల్ కు అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు, ముంచంగి పుట్ట మండలంలో గల సుమారు 11వేల మంది రైతులు ఉన్నారని అదేవిధంగా గ్రామపంచాయతీలో పరిధిలోగల రైతులు సుమారు 720 మంది ఉన్నారని వీళ్ళందరూ కూడా గ్రామ వ్యవసాయ నాయకులు దగ్గరికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సర్పంచ్ పాండురంగ స్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయకులు జి చంద్రబాబు, ఈఏ గిరిష్ దొర, కూటమి నాయకులు మండి కిశోర్ , మాణిక్యం, నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రీడా పోటీలు ప్రారంభం

పాడేరు,ఫిబ్రవరి20, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో పాడేరు శ్రీ గౌతమి పాఠశాలలో మూడు రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీలు ప్రారంభోత్సవానికి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే జాతీయ జెండాను నింగికి ఎగురవేసి గౌరవ వందనం చేయగా,క్రీడా పోటీలను లాంఛనంగా పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు విద్యార్థులకు ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడా పోటీలను మూడు రోజుల పాటు నిర్వహించడం పాఠశాల నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు.విద్యార్థులకు విద్యతో పాటు క్రీడారంగాల్లో రాణించాలన్నారు. మానసిక ఉల్లాసం క్రీడాలతోనే సాధ్యం అన్నారు.ఈ ప్రాంతంలో మెరుగైన విద్య క్రీడలను అందిస్తున్న గౌతమి పాఠశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌతమి స్కూల్ చైర్మన్ తామర మాణిక్యం, ప్రిన్సిపల్ దాడి వెంకటశివ,స్కూల్ యాజమాన్యం,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల నిర్వాహకులు విద్యార్థులు చేతులమీదుగా ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రాజుకు భగవద్గీత పుస్తకాన్ని బహుకరించారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం అభినందనీయమని ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని పాఠశాల సిబ్బందిని ఎమ్మెల్యే సూచించారు. విద్యతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించే క్రీడలను కూడా ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరేనాటికి ఆంగ్లంపై అవగాహన కల్పించాలి

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



అంగన్వాడీ కేంద్రాలు నుండి ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతిలో విద్యార్థులు చేరేనాటికి. ఆంగ్లం పై అవగాహన కలిగే విధంగా బోధన చేయాలని యం.ఇ.ఓ కె.వి.వి.సత్యనారాయణ దొర అన్నారు. గురువారం అంగన్వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతిపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమంను ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులు చేరే విధంగా అంగన్వాడీ వర్కర్లు కృషి చేయాలన్నారు. కె.ఆర్.పి.లు బి.మురళీకృష్ణ, పి.సరస్వతి, కె.సత్యనారాయణలు సమగ్ర అభివృద్ధి, కృత్యాలు పై వివరించారు. శారీరక అభివృద్ధి, మేదోభివృద్ధి పై కృత్యాలు ద్వారా చేసి చూపారు. ఈకార్యక్రమంలో యం.ఇ.ఓలు కె.వి.వి.సత్యనారాయణ, సి. డి.పి. ఓ దేవమణి, ప్రధానోపాధ్యాయులు ద%ా

## 673 మంది ఎమ్మెల్సీ ఓటర్లు... డిప్యూటీ తహసీల్దారు కరీముల్లా

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండలంలో 673 మంది ఓటర్లు ఉన్నారని డిప్యూటీ తహసీల్దారు కరీముల్లా తెలిపారు. 27న రాజవొమ్మంగి ఎంపిపి పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటలు నుండి 4 గంటలు వరకూ జరిగే పోలింగ్ వేళల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని అయన కోరుతున్నారు.

### నేడు జడ్డంగిలో కంటి వైద్య శిబిరం

శుక్రవారం జడ్డంగి పిహెచ్ సి వద్ద ఉదయం 9 గంటలు నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కంటి వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్టు వైద్యులు డా.యామిని ప్రియ, డా.నాగార్జున తెలిపారు. ఉచితంగా కంటి ఆపు రేషన్లు కూడా చేయడం జరుగుతుందన్నారు. ఆధార్, ఆరోగ్య శ్రీ, బ్యాంక్ పాస్ పుస్తకం తీసుకొని రావాలన్నారు.

## పాఠశాలలో మరుగుదొడ్లు నిర్వహణపై తనిఖీలు చేయండి..

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త

పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్వహణపై తనిఖీలు చేయాలని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈసందర్భం గా ఎంపిడిఓ మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. ఆధార్ లేని చిన్నపిల్లలకు మొబైల్ ఆధార్ కేంద్రాల్లో నమోదు చేయించాలన్నారు. సర్వే లో లేనివారిని చేర్పించి వేగవంతంగా సర్వే పూర్తి చేయాలన్నారు. గృహాలు జియోటాగింగ్ పూర్తి చేయాలని వెల్లడిం చారు ఈకార్యక్రమంలో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, ఇఓపిఆర్డీ కోటేశ్వరరావు, కార్యదర్శులు వంశీ, కిషోర్, నాగూర్ వల్లీ, యం.శ్రీనివాస్, శిరీష, కోనేటి రాంబాబు, సుమ్మర్ల రాంబాబు, కొచ్చా రాంబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## నర్సరీ పనులు ప్రారంభించండి.. డి.ఎఫ్.ఓ

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



అటవీనర్సరీ పనులను మొదలు పెట్టాలని జిల్లా అటవీశాఖాధికారి రవీందర్ దాన అన్నారు. రాజవొమ్మంగి అటవీరేంజ్ పరిధిలో గల పాపంపేట, ఊర్లకులపాడు గ్రామాల్లో కొనసాగిన అటవీ నర్సరీ ప్రాంతాలను అయన చూసారు. నర్సరీ పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని అటవీ సంరక్షణాధికారిణి ఉషారాణికి సూచించారు. లోదొడ్డిలో బేస్ క్యాంపును పరిశీలించారు. అడవులు సంరక్షణలో జాగ్రత్తలను పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అటవీ సంరక్షణాదికారి రవీందర్ దాన, రాజవొమ్మంగి అటవీ సంరక్షణాధికారిణి ఉషారాణి, సెక్షన్ ఆఫీసర్స్ సుబ్బయ్యమ్మ, బాలాజీ, అర్జునుడు, బీట్ ఆఫీసర్స్ లోవప్రసాద్, నరేష్ బాబు, బాపిరాజుదొర, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రీయ వ్యవసాయానికి ప్రతిపాదనలు రూపొందించండి

పాడేరు,ఫిబ్రవరి20,ప్రభాతవార్త



సేంద్రీయ వ్యవసాయాభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఖరీఫ్ కార్యచరణ ప్రణాళికలు 25–26 ఆర్థిక వ్యవసాయానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రానున్న మూడు, నాలుగేళ్ల లో సేంద్రీయ వ్యవసాయంగా జిల్లాగా అభివృద్ధి చేయాలని అన్నారు. గురువారం కలెక్టరేట్ నుండి ఐటిడిఏ పి.ఓలు, వ్యవసాయాధికారులు, ఉద్యాన వన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చత్తీష్ గడ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో సేంద్రీయ వ్యవసాయాన్ని అమలు చేస్తున్నారని దానిని ఆదర్శంగా తీసుకుని జిల్లాలో అమలు చేయాలని స్పష్టం చేసారు. జిల్లాలో 1 లక్ష 25 వేల ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న పట్టా భూములు, అటవీ భూముల్లో ఎరువులు వినియోగిస్తున్న రైతులు ఎంత శాతం వినియోగిస్తున్నారో సమగ్రమైన సర్వే చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి నేతృత్వంలో రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రామ సర్వేయరు, వి.ఆర్.ఓ, గ్రామ వ్యవసాయ సహాయకులు, వెలుగు సిబ్బంది బృందంగా ఏర్పడి సర్వే చేయాలని సూచించారు.

**ఆర్గానిక్ జిల్లాగా అభివృద్ధికి కృషిచేయండి..**

జిల్లాను ఆర్గానిక్ జిల్లా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కాఫీ హౌస్లో వ్యవసాయ, ఉద్యానవన, జెడ్ బి ఎన్ ఎఫ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.పూర్తి స్థాయి ఆర్గానిక్ వ్యవసాయ జిల్లాగా మార్చేందుకు అనుగుణంగా 2025–26 ఖరీఫ్ కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ప్రతీ రైతు కు ఆర్గానిక్ సర్టిఫికేట్ వచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో పర్చువల్గా ఐటిడిఏ పి ఓలు డా. ఎం.జె. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, దంతెవాడ కలెక్టరేట్ నుండి ఆకాష్ బద్వే, ప్రత్యక్షంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, డిపి ఎం భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి, వ్యవసాయాధికారులు, ఉద్యాన వన అధికారులు, పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్లకు సీఎస్ దిశానిర్దేశం

పాడేరు,ఫిబ్రవరి20, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. గ్రూప్ –2, ఇంటర్మీడియట్ ప్రధాన, ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు, పీ–4 విధానాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. మార్చి, ఏప్రిల్ మాసాల్లో పరీక్షలు ఉంటాయని అందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన ఏర్పాట్లు చేసుకోని సన్నద్ధంగా ఉండాలని సీఎస్ సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందే సేవలపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. మార్చిలో పీ–4 కార్యక్రమం ప్రారంభమవుతుందని, తొలి వారంలో అత్యంత నిరుపేదలను గుర్తించే కార్యక్రమం చేపడతామని కలెక్టర్లు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్సో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దిన్సేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ డా.ఎం జే అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఇఓ పి.బ్రహ్మాజీరావు, ఇంటర్మీడియట్ అధికారి అప్పల రాము, డివిజినల్ పంచాయతి అధికారి పిఎస్ కుమార్, పరిపాలనాధికారి ఎం.బి.అప్పారావు, పాల్గొనారు.

## సరళ్ గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

పాడేరు,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:




అల్లూరి సీతారామరాజు జిల్లా మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలకు చెందిన 10వ తరగతి, ఐటిఐ వెల్డర్, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన, 27 సంవత్సరాలు గరిష్ట వయస్సు ఉన్న గిరిజన యువతకు శిక్షణ, ఉద్యోగ కల్పన కోసం సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ మారిటైమ్, షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్ ), విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (విపిఎ) వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) నిధుల సహకారంతో గురువారం పాడేరులో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు.ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు మొదట ఇన్వెంటరీ కంట్రోల్ మరియు వెల్డర్ కోర్స్‌లలో 2 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.అనంతరం ఉపాది అవకాశాలు కల్పించనున్నామని ఎస్పీ తెలిపారు. అల్లూరి జిల్లాలో ఉన్న పెదబయలు, ముంచింగ్ పుట్, అన్నవరం, జి.కె.వీధి, సీలేరు, మంప, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట మరియు అరకు మండలాలకు చెందిన చెందిన 80 మంది యువతకు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్స్ మారిటైమ్, షిప్ బిల్డింగ్ సంస్థ ప్రతి నిధులు కొరుబిల్లి కనకరాజు, డిప్యూటీ పరసనల్ ఆఫీసర్ వారి ఆధ్వర్యంలో జాబ్ ఇంటర్వ్యూలు నిర్వ హించగా 60 మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు 2 నెలల శిక్షణ ఇవ్వడం జరుగుతుం దన్నారు. తాము చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకొని ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతంగా జీవించి తమ కుటుంబాలు, తమ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని గిరిజన యువతకు ఎస్పీ పిలుపు నిచ్చారు.

## అర్హులందరికీ పిఎంఏ వై 2.0 పక్కా గృహాల మంజూరు

చింతపల్లి ఫిబ్రవరి 20, ప్రభాతవార్త



పిఎంఏవై 2.0లో పక్క గృహాలు మంజూరు చేసేం దుకు అర్హులైన లబ్ధిదారులందరినీ ఎంపిక చేయాలని, ఏ ఒక్క అర్హుడిని విడిచిపెట్టరాదని పీఎం ఏవై గ్రామీణ్ 2.0 నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, రూరల్ హౌసింగ్ డివిజన్ పీఎంయు సభ్యురాలు నిషి ఖండేల్వాల్ అన్నారు. గురువారం విజయవాడ ఆవాస్ ప్లస్ సర్వే నోడల్ అధికారి ఎన్ కోటేశ్వరరావుతో కలిసి ఆమె మండలంలో పర్యటించారు. మొదటగా పీఎం ఏవై 2.0లో పక్కా గృహం కోసం ఎంపిక చేసిన టీ కోరుకొండ గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు మంజుల బుజ్జమ్మ గృహాన్ని ఆమె సందర్శించారు. ప్రస్తుతం లబ్ధిదారురాలు కుటుంబ సభ్యులు ఎటువంటి గృహంలో నివాసం ఉంటున్నారు వారి ఆర్థిక పరిస్థితి ఏమిటి అనేది స్వయంగా పరిశీలించారు. చుంచుంపూడి చింతలూరు గ్రామాల్లో 2011–2012లో గిరిజనులు పిఎంఏవై పథకం ద్వారా నిర్మించుకున్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఎంయు సభ్యురాలు గిరిజనులు హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేర్చేందుకు పీఎం ఏవై గ్రామీణ్ 2.0 కృషి చేస్తుందని ఎంపికలు పారదర్శకత చూపించాలన్నారు. పీఎం ఏవై పథకంలో పక్క గృహం నిర్మించుకోవడానికి ప్రభుత్వం 18 లక్షల రూపాయలు చెల్లిస్తుందన్నారు. అలాగే పీఎం జన్మన్ పథకం గడువును పెంచడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులు పక్క గృహం నిర్మించుకోవడానికి 2.39 లక్షల నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. పీఎం జన్మన్ పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాల న్నారు. అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేయడం జరుగుతుం దన్నారు. ఇప్పటికే పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు గిరిజనులు గృహాల నిర్మాణాలకు అవసరమైన సాంకేతిక సహకారం ఇంజనీరింగ్ అధికారులు పూర్తిస్థాయిలో అందించా లన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వెంటనే లబ్ధిదారులకు బిల్లులు వెంటనే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బాబు నాయక్, స్థానిక ఏ ఈ కె .రమణబాబు, వర్క్ ఇన్స్పెక్టర్ ఎన్ రాజ రావు, హౌసింగ్ అసిస్టెంట్ ఎస్ రామలక్ష్మి పాల్గొన్నారు.

## డిసిహెచ్ఎస్‌గా భాధ్యతలు స్వీకరణ

పాడేరు,ఫిబ్రవరి20, ప్రభాతవార్త



డీ సిహెచ్ ఎస్‌గా డా.కె.లక్ష్మి గురువారంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డైరెక్టర్ అఫ్ సెకండ్రి హెల్త్ వారి ఆదేశాల మేరకు భాధ్యతలు స్వీకరించినట్లు చెప్పారు. అప్పగించిన విధులు ఎంతో బాధ్యతగా, నిబద్ధతతో నిర్వర్తిస్తానని ఆమె పేర్కొ న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంతవరకు ఆమె రంపచోడం ఏరియా హాస్పిటల్ నందు గైనకాలజిస్ట్ గా విధులు నిర్వర్తించారు.

# బాల్య వివాహాలు నిర్మూలనకు బాలికలకు అవగాహన

సీతంపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



బాల్య వివాహాలు నిర్మూలనకు బాలికలకు అవగాహన కల్పించడం జరుగుతుందని సీతంపేట ప్రాజెక్ట్ సీడీపీఓ పి.రంగలక్ష్మి స్పష్టం చేశారు. గురువారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ హైస్కూల్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నిర్మూలన అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రంగలక్ష్మి మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యం, విద్య మరియు గ్రోత్, పౌష్టికాహారం, లైంగిక దాడులు నివారించాలని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో బాలికలు అప్రమత్తంగా ఉండాలని అపరిచితులను నమ్మకూడదని అమ్మాయిలు మోసపోవద్దని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ ప్రొబెషన్ అధికారి పారిశర్ల శ్రీధర్, రావాడ హరికృష్ణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎస్.విస్సమ్మ, జి.గౌర, ఎం.లావణ్య, మహిళా సంరక్షణ అధికారులు కమల, శిరీష, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్ 2025 సెషన్ 1 ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

టెక్కలి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

వివిధ పోటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి గాను నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ) మెయిన్ 2025 సెషన్ 1 ఫలితాల్లో భారతదేశపు ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ అన్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. అన్ అకాడమీకి చెందిన 920కి పైగా విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే ఎక్కువ సాధించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విద్య అనుసంధానంతో కూడిన హైబ్రిడ్ లెర్నింగ్ విధానం ప్రభావం చూపిందని ఈ సందర్భంగా అన్ అకాడమీ ప్రతినిధి సుమిత్ జైన్ అన్నారు. జేఈఈలో తమ అకాడమీ విద్యార్థులు మరోసారి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు.

# సూపర్ ఫాస్ట్ కనెక్టివిటీతో 5జీ

గార, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

సూపర్ ఫాస్ట్ కనెక్టివిటీతో గెలాక్సీ ఏ సిక్స్ 5జీను భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, నేడు గెలాక్సీ ఎ06 5జీని విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇది సరసమైన ధరకు అద్భుతమైన 5జీ అనుభవాన్ని అందిస్తోంది. అత్యంత సరసమైన బడ్జెట్‌లో గెలాక్సీ ఏ సిరీస్ 5జీ స్మార్ట్‌ఫోన్‌గా, గెలాక్సీ ఏ06 5జీ వినియోగదారులకు దాని విశ్వసనీయ పనితీరు మరియు మన్నికతో గరిష్ట విలువను అందించడానికి రూపొందించబడింది, ఈ రోజు నుంచి గెలాక్సీ ఏ06 5జీ భారతదేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లలో, సామ్‌సంగ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌లలో, అలాగే ఇతర ఆఫ్‌లైన్ ఛానెల్‌లలో, బహుళ స్టోరేజ్ వేరియంట్‌లలో అందుబాటులో ఉంటుంది.

# నూతన క్యాంపైన్‌లో స్కోడా ఆటో

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

భారతదేశంలో స్కోడా ఆటో 25 ఏళ్ల వేడుకలు ఆచరించుకుంటూ తన నూతన క్యాంపైన్ అందుబాటులోకి తీసుకు వచ్చింది. క్యాంపెయిన్‌లు, బ్రాండ్ సూపర్‌స్టార్ భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసింది. స్కోడా కార్లు ఆకాంక్షాత్మకమైనవి, వాస్తవంగా సరదాగా వినోదాత్మకంగా ఉండటాన్ని రణవీర్ సింగ్ పవర్ హౌస్‌తో ప్రతిధ్వనించడం మంచి ప్రేరణ పొందింది. తన మొట్టమొదటి సబ్-4 మీటర్ ఎస్‌యువి కైలాక్‌ను విడుదల చేసిన వెంటనే స్కోడా ఆటో ఇండియా మరో మైలురాయిని నెలకొల్పిందని స్కోడా హెడ్‌పీటర్ జనేబా తెలిపారు. పవర్ హౌస్ రణవీర్ సింగ్‌ను తన మొట్టమొదటి బ్రాండ్ సూపర్‌స్టార్‌గా ప్రకటించిందన్నారు.

# మహా శివరాత్రి వేడుకల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జలుమూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీముఖలింగేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా ఏర్పాట్లు పరిశీలించి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లలో భక్తులకు ప్రసాదం వితరణ, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ అలంకరణ తదితర అంశాలపై స్థానిక నాయకులు, కార్యకర్తలతో చర్చించడం జరిగింది. ఎన్నికల నియమావళి అమలులో ఉండడం వలన పూర్తిస్థాయిలో నిధులు సమీకరణ మరియు అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించలేకపోయామని అన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులతో మాట్లాడి సంబంధిత అధికారులకు మహాశివరాత్రి వేడుకలు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక సర్పంచ్ తమన్నగారి సతీష్, ఆలయ ఈఓ ప్రభాకరరావు, పురోహితుల సంఘం అధ్యక్షులు వివిఎస్ చలం, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేందర్‌నాయుడు, సర్పంచ్ దుంగ స్వామిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెలమల చంద్రభూషణ్‌రావు, మాజీ సర్పంచ్ తర్ర బలరాం, పొన్నాడ దాలయ్య తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కవిటి క్రీడాకారుడు

కవిటి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



ఇటీవల జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి మాస్టర్స్ (45+) బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సింగిల్స్ విభాగంలో కవిటికి చెందిన నాగేశ్వర బెనర్జీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై, ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు విజయవాడలో జరుగు రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తమరాల జయరాం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్న నాగేశ్వరరావు బెనర్జీకి బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ లోళ్ల రాజేష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ జెడ్పీటీసీ బెందాళం రమేష్, ఉషోదయ అధ్యక్షులు పాండవ శేఖర్, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు బెందాళం చిట్టిబాబు, ఉషోదయ కార్యదర్శి పి.వెంకటరావు, మాజీ అధ్యక్షులు ఆరంగి రాజు, పి.లక్ష్మణమూర్తి, నేషనల్ అంపైర్ తుంగాన శరత్, సీనియర్ క్రీడాకారులు బల్లెడ రవి, బీపీ జయప్రకాష్, దిలీప్ రౌళో, బి.విశ్వనాథ్, బి.సురేష్, బి.రమేష్, ఎం.ప్రసాద్, పి.మణిబాబు, పి.ఉమా అభినందనలు తెలిపారు.

# పట్టణ పరిధిలోకి భారీ వాహనాల రాకపోకల నిషేదం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



పట్టణ పరిధిలో భారీ వాహనాల రాకపోకలకు నిషేదం విధిస్తున్నట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు చెప్పారు. ఈ మేరకు భారీ వాహనాలతో లోపలకు వచ్చిన ఓనర్లు, డ్రైవర్లకు సర్కిల్ కార్యాలయంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. జాతీయ రహదారి నేరు గుండానే వాహనాల రాకపోకలు సాగించాలని హెచ్చరించారు. పురుషోత్తపురం నుంచి ఇచ్ఛాపురం వైపు, బాహుదానది నుంచి వంతెన మీదుగా ఇచ్ఛాపురంలోకి భారీ వాహనాలు ప్రవేశిస్తే పెద్దమొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. ఇటీవల వంతెన శిధిలావస్థకు చేరుకోవడంతో పాటు కూలిన సంగతి తెల్సిందే. అయినప్పటికి వాహనాలు యధేచ్ఛగా పాత వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే వీకేపేట రోడ్డులో ఉదయం 8నుంచి రాత్రి 8 వరకు భారీ వాహనాలకు లారీలకు, ట్రాక్టర్లుకు అనమతి లేదని గతంలో ఆంక్షలు విధించారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్సై ఎం.ముకుందరావు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన భారతిదివ్య

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మరియు మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య కలిసారు. దివంగత మాజీ ఎంపీ పాలవలస రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ పాలకొండలో పర్యటించారు. ఈ మేరకు అక్కడ జగన్‌ను కలిసి మున్సిపల్ పరిస్థితులు, నియోజకవర్గ పరిస్థితులు వివరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, చీదిరి అప్పలరాజు, భీమిలీ కోఆర్డినేటర్ మద్ది శ్రీను ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

మండలం జాతీయ రహదారిలో పెద్ద బమ్మిడి సమీపంలో ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలం సుబ్బారావుపేట గ్రామానికి చెందిన బాన్న ప్రత్యుష (29) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. 3వ తేదీన తన భర్త నడుపుతున్న ఆటోలో వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ప్రత్యూష తీవ్రంగా గాయపడింది. అయితే భార్యభర్తలు ఇరువురు డాన్స్ మాస్టర్‌లుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారని, మృతురాలుకు భర్త కిరణ్‌కుమార్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు స్థానిక ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈ-క్రాప్, భూసర్వేపై దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆముదాలవలస, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



ఈ-క్రాప్, భూసర్వే సహా, రానున్న రబీ పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం ఆముదాలవలస మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. రబీ పంటల స్థితి గతులు, ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ, భూసర్వే పురోగతిపై క్షేత్రస్థాయిలో సమీక్షించారు. టీ జొన్నవలస రైతు సేవా కేంద్రం పరిధిలోని సంతకొత్తవలస రెవెన్యూ గ్రామంలో కలెక్టర్ రబీ పంటలను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి పంటల సాగు, దిగుబడి, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. మునగవలస పంచాయతీ దన్నానపేట, సంతకొత్తవలస గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ కలెక్టర్ పరిశీలించారు. రైతుల వివరాల నమోదు, పంటల నమోదు ప్రక్రియను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రామచంద్రాపురం పంచాయతీ ఆనందపురంలో భూసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. భూముల రీసర్వే, హద్దుల గుర్తింపు, రికార్డుల నవీకరణపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి, సహాయ వ్యవసాయ సంచాలకులు బగ్గు రజనీ, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, తహశీల్దార్ రాంబాబు, ఇతర రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి, రైతులకు సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు.

# సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆముదాలవలస, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ సిహెచ్.రవికుమార్ అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంకింగ్ వ్యవస్థ మరియు డిపాజిట్ ఖాతాల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1930, పిఎంజెజెవై, పీఎం ఎస్‌బివై ఇన్సురెన్స్ కోసం బ్యాంక్ ఇంటిగ్రేడ్ అంబుడ్స్‌మెంట్ టోల్‌ఫ్రీ నెంబర్ 1448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. గ్రామాల్లో ఉన్న ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించి ప్రజలను గ్రామీణులను సైబర్ నేరాలకు గురి కాకుండా చూడవల్సిన బాధ్యత మనందరిపై ఉందని గ్రామాల్లో ఉన్న మహిళలకు అవగాహన కల్పించారు. ఏటీఎం కార్డుల వల్ల కలిగే లాభాలను, ఉపయోగాలను ప్రజలకు వివరించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్‌కుమార్ బ్యాంకింగ్ యొక్క సేవలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గురుగుబెల్లి నారాయణరావు, ఎస్.హరి, ఎ.హరినాథ్, ఎస్.రాంబాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి -ఎస్‌టియు పోస్ట్‌కార్డు ఉద్యమం

ఆముదాలవలస, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త




క్రాంతి భవన్ నందు ఎస్‌టియు నాయకులు అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌టియు నాయకులు ఎస్.వి. రమణమూర్తి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు అప్పటి ప్రతిపక్ష నేతగా ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గానికి ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డు లేఖలు వ్రాసామని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా ఉపాధ్యాయ ఉద్యోగ వర్గానికి అప్పటి ప్రభుత్వంలో తీసుకు వచ్చిన పిఆర్‌సిని ఇది రివర్ పిఆర్‌సి అని ఎక్కడైనా పిఆర్‌సిలో రివర్స్ ఉంటాయా అని ఎద్దేవా చేస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయిలు చెల్లిస్తామని డీఏలు, ఐఆర్ సకాలంలో ఇస్తామని మెరుగైన వేతన సవరణ తెస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలను నిర్వహించి వారి అభిప్రాయాలను గౌరవిస్తామని అప్పట్లో అన్నారని ఇప్పటి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా ఇప్పుడున్న సీపీఎస్ పెన్షన్ విధానాన్ని కూడా సమీక్షించి మెరుగైన పెన్షన్ విధానాన్ని తీసుకు వస్తామని హామీనిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తీరా అధికారంలోకి వచ్చాక ఉద్యోగులు వైపే చూడటం లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలు గడుస్తున్నా ఉద్యోగులతో సమావేశమే నిర్వహించలేదని పిఆర్‌సి కోసం వేతన సవరణ చైర్మనే నియమించలేదని, ప్రస్తుత ప్రభుత్వ తీరు చూస్తుంటే ఏరు దాటాక తెప్ప తెగలేసే చందంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేని పక్షాన ప్రభుత్వానికి ఉద్యోగుల ఆగ్రహం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, చింతల రామారావు, బి.శ్రీధర్, జి.శ్రీనివాసరావు, ఎం.తేజ, యన్.లక్ష్మణరావు, పి.వసంతకుమారి, డీవీఎన్ పట్నాయక్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొని ముఖ్యమంత్రికి లేఖలు రాశారు.

# కారిగూడలో ఐటీడీఏ ఎన్ఎఫ్ఏ ముసలయ్య సందర్శన

కొత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



కొత్తూరు డివిజన్ పరిధిలోని కొత్తూరు మండలం కారిగూడలో ప్రకృతి వ్యవసాయశాఖ ఐటీడీఏ ఎన్‌ఎఫ్ఏ ముసలయ్య, యూనిట్ ఇన్‌చార్జ్ కె.గోవిందరావు గురువారం సందర్శించారు. ఇందులో భాగంగా పలు పంటలైన రాగి, కూరగాయలు పంటలను సందర్శించి రైతులకు పలు పంటల్లో మెలకువలు గురించి వివరించారు, రాగి పంటలో గులిరాగి మరియు లైన్‌షోయింగ్ వలన కలిగే లాభాలను రైతులకు తెలియజేశారు. రాగిలో పీక పురుగును ఉద్దేశించి బ్రహ్మాస్త్రం కషాయం రైతులతో తయారు చేయించడం జరిగింది. అలాగే బ్రహ్మాస్త్రం కషాయం వలన కలిగే ఉపయోగాలు రైతులకు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఏ ముసలయ్య, లబ్బ మాజీ సర్పంచ్ ఎస్.అప్పారావు, మరియు ఎస్.సింహాచలం, యూనిట్ ఇన్‌చార్జ్ గోవిందరావు, ఐసిఆర్‌పిలు వి.శ్రీనివాసరావు, ఎస్.ఆనందరావుతో సహా పలువురు రైతులు పాల్గొన్నారు.

# నౌపడలో పారిశుద్ధ్య పనులు




సంతబొమ్మాళి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

మండలంలో నౌపడ గ్రామంలో బుధవారం పంచాయతీ సెక్రటరీ ఉప్పాడ ఉమాపతి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్యం పనులు నిర్వహించారు. వీధులు శుభ్రం చేసి మురికి కాలువల పూడికతీత పనులు చేపట్టారు. పంచాయతీ సెక్రటరీ ప్రజలతో మాట్లాడుతూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు.

# ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు

పాలకొండ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



మార్కెట్‌లోని వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లును వినియోగించినా, విక్రయించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ సామంగి సర్వేశ్వరరావు హెచ్చరించారు. గురువారం పాలకొండ నగర పంచాయతీ కార్యాలయంలో కూరగాయలు, కిరాణా, పండ్ల వర్తకులు వారితో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేదం, పాలకొండలో అమల్లో ఉన్నందున పట్టణంలో పాలిథిన్ కవర్ల ప్రత్యామ్నాయం కోసం బయోగ్రేడబుల్ కంపోజిటబుల్ క్యారీ బ్యాగ్స్ మాన్యుఫ్యాక్చర్ వారిని పిలిపించి వారితో సమావేశం నిర్వహించారు. ఇక నుంచి వర్తకులు నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేదించాలని బయోడిగ్రేడబుల్ కవర్లను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. వ్యాపారులు అతిక్రమించి పాలిథిన్ కవర్‌లను వినియోగిస్తే షాపులను సీజ్ చేస్తామని మరియు కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

# మండలస్థాయి జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం

కంచిలి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

కంచిలి జెడ్పీహెచ్ స్కూల్ ఆవరణలో మండల స్థాయి జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు సాధనిక ఎంఈఓలు శివరాంప్రసాద్, చిట్టిబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం షెడ్యూలు ప్రాప్తికి విజయవంతంగా ముందుకు తీసుకుపోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ బి.మోహనరావు పాల్గొని అగ్నిప్రమాదాలు గురించి గ్రామంలో ఇళ్లలో జరుగుతున్న అగ్నిప్రమాదాలు గురించి దానికి సంబంధించి అవగాహన కల్పించడం జరిగింది. గ్యాస్ సిలెండర్‌పై ఉన్న ఏ,బీ,సీ గురించి వివరించారు. ముఖ్యంగా గ్యాస్ సిలెండర్ అగ్నిప్రమాదాలు జరిగితే సిలెండర్‌పై తడి గోనె సంచి కప్పి, అలాగే సిల్వర్ బకెట్ కప్పివేయాలని ఇసుక, పిండి జల్లి అగ్నిని అదుపులో ఎలా తీసుకోవాలో ప్రదర్శన ద్వారా తెలియజేశారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు వై.ఎస్.నాయుడు, మాస్టర్ ట్రైనర్స్ వై.శంకరరావు, గోపి, భాస్కరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్,సిబ్బంది బాబూరావు, భాస్కరరావు, గిరిబాబు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



# జిల్లాస్థాయిలో వక్తృత్వ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

పాలకొండ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త




ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా స్థాయిలో జరిగిన విజన్ 2047 వక్తృత్వ పోటీలలో పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పెద్దింటి భువనశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏపీసి తేజేశ్వరరావు అమూల్యమైన పుస్తకాలను బహుమతిగా అందించారు. పాలకొండ మండల ఉప విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి, హెచ్ఎం మీసాల సూర్యనారాయణ, ఉపాధ్యాయులు బాబూరావు, శంకరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో శిక్షణ అంశాలను అమలు చేయాలి

## ఎంఈఓలు గోవిందరావు, ప్రతాప్‌లు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



మూడు రోజులుగా మీకు శిక్షణలో ఇచ్చిన అంశాలను మీమీ అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని మండల విద్యాశాఖాధికారులు చందక గోవిందరావు, ఎల్.వి.ప్రతాప్‌లు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో అంగన్వాడీల శిక్షణ కార్యక్రమంలో భాగంగా చివరిరోజు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఈ మూడు రోజులు మీకు అధికారుల ద్వారా శిక్షణ పొందిన కృత్యాలు తిరిగి అంగన్వాడీ కేంద్రాల్లో అమలు జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు మురళీధర్, చిన్నారావు, వేణుగోపాల్, సూపర్‌వైజర్లు సత్యప్రియ, మనోహరి, పద్మలత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతల పనులు వేగవంతం చేయండి



కోటబొమ్మాళి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

మండలంలో గల 38 గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో నీటి నిల్వలు మరియు భూగర్భ జలాలు పెంపొందించేందు కోసం ఇంకుడు గుంతల పనులు వేగవంతం చేయాలని ఏపీడీ పి.శైలజ అన్నారు. గురువారం స్థానిక ఎంసిసి కార్యాలయ సమావేశ మందిరంలో మహాత్మాగాంధీ మరియు క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో మంజూరైన ఫర్మ్ ఫండ్స్ నిర్మాణాలు వేగవంతం చేయాలని, అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని, కొలతల ప్రాప్తికి పనులు చేపట్టాలని, వేతనదారులు సమయపాలన పాటించాలన్నారు. ఇచ్చిన కొలతల ప్రాప్తికి పనులు నిర్వహించి యావరేజ్ వేజ్ పెంచాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జి.హరిప్రసాద్, ఈసీ టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా వాహన తనిఖీలు

కొత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త



స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ముమ్మరంగా వాహన తనిఖీలు జరిగాయి. వాహన తనిఖీల్లో ప్రధానంగా వాహనాలకు, వాహన చోదకులకు తప్పనిసరిగా ఉండాల్సిన పత్రాలపై ఆయన ప్రత్యేక నిఘా పెట్టారు. ఎటువంటి పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై ఆయన అపరాధ రుసుంలు వేశారు. అలాగే వాహనాలపై ఏమైనా పెనాల్టీ బకాయిలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే పెనాల్టీలు చెల్లించాలని ఆదేశించారు. హెల్మెట్ ధారణ, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం, అనుమానిత వాహనాలను తనిఖీలు చేపట్టారు. నిషేదిత వస్తువులు అక్రమంగా తరలించినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా సీఐ చింతాడ ప్రసాద్ హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో సీఐ చింతాడ ప్రసాద్ వెంట సిబ్బంది ఉన్నారు.

# చంద్రమోహన్ సేవలను గుర్తించాలి

## ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్న మత్స్యకారులు

సోంపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త



పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన విశేష సేవలు అందిస్తున్నారు. సామాజిక వర్గపరంగా మత్స్యకారులను ఏకతాటిపైకి తెస్తున్నారు. స్వజాతి మనుగడ కోసం సొంత పార్టీని కూడా లెక్క చేయని నిజాయితీ స్వభావం. ఆయనే సోంపేట మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ జెడ్పీటీసీ సూరాడ చంద్రమోహన్. సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి సోంపేట మండల జెడ్పీటీసీగా నియోజకవర్గంలో కీలక నాయకుడిగా జిల్లా కార్యవర్గంలో తనదైన పాత్ర పోషిస్తూ పార్టీ అభివృద్ధిలో కీలక భాగస్వామ్యం అవుతున్నారు. కానీ ఆయన సేవలకు తగిన గుర్తింపు మాత్రం లభించడం లేదు. రణస్థలం మండలం ధోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకు 11 మండలాల్లో మత్స్యకారులు విస్తరించి ఉన్నారు. తమకు రాజకీయంగా గుర్తించాలని వారు కోరుతూ వస్తున్నారు. కానీ తెలుగుదేశం పార్టీ మండలస్థాయి పదవులతోనే సరిపెడుతోంది. చట్టసభల్లో అడుగు పెట్టాలన్న మత్స్యకారుల ఆశలు తీరడం లేదు. ఈసారి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో సూరాడ చంద్రమోహన్‌కు సముచిత స్థానం అందించాల్సిన అవసరం పార్టీపై ఉంది. తెలుగుదేశం పార్టీలో మత్స్యకారులకు సంబంధించి సూరాడ చంద్రమోహన్ ముందువరుసలో ఉంటారు. 11 మండలాల్లో కీలక నాయకులు ఉన్నా చంద్రమోహన్ విషయంలో మాత్రం మత్స్యకారుల్లో ఒక రకమైన అభిప్రాయం ఉంది. సోంపేటలో థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకించేందుకు తీర్పరాంత మత్స్యకార ఐక్యవేదిక ఏర్పాటు చేయడంలో అందరినీ ఒక తాటిపైకి తేగలిగారు. ఈ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర ప్రజల్లో గుర్తింపు పొందింది. అప్పటి సోంపేట ఎమ్మెల్యే శివాజీ చంద్రమోహన్‌లో ఉన్న నిజాయితీ, నాయకత్వాన్ని గమనించి సోంపేట మండల కేంద్రం నుంచి జెడ్పీటీసీగా బరిలో దింపారు. ఆ ఎన్నికల్లో మంచి మెజారుటీతో విజయం సాధించిన చంద్రమోహన్ పార్టీ అధినాయకత్వం దృష్టిలో పడ్డారు. అటు పార్టీలో సైతం ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. శత్రువులను సైతం ప్రేమించే తండ్రి నుంచి సంక్రమించిన స్వభావం ఉన్న చంద్రమోహన్ అన్ని పార్టీల నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ప్రస్తుతం నామినేటెడ్ పదవులు సందడి ప్రారంభమైన నేపథ్యంలో సూరాడ చంద్రమోహన్ సేవలను గుర్తించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గంతో పాటు జిల్లాలో ఉన్న టీడీపీ శ్రేణులు, మత్స్యకారులు కోరుతున్నారు.



చిన్నకర్రివానిపాలెం, కొత్తపాలెం, బట్టివానిపాలెం గ్రామాల్లో కొలువైన శ్రీశ్రీశ్రీ కాశీవిశ్వనాధస్వామి ఆలయంలో శివస్వాములతో అంబులం పూజ మరియు సుమారు 250 మంది మహిళలతో కుంకుమ పూజ కార్యక్రమం, అలాగే అన్నదాన కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, గ్రామపెద్దలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. (ప్రభాతవార్త-కవిటి)

## నేడు పెరుమాళిలో ఉచిత నేత్ర శిబిరం

**తెర్లాం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

మండలంలోని పెరుమాళి గ్రామంలో శుక్రవారం ఉచిత నేత్ర శిబిరం జరుగుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.వెంకటేష్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కంటి వైద్య శిబిరం జరుతుందన్నారు. జిల్లా అంధత్వ సంస్థ విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో శిబిరం జరుగుతుందని ఈ అవకాశాన్ని తెర్లాం మండల పరిసర ప్రజలు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

## మెగా వైద్య శిబిరానికి అనుహ్యాస్పందన

**పాచిపెంట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



పాచిపెంట పోలీస్టేషన్ ఆవరణలో పోలీసులు నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి అనుహ్యాస్పందన లభించది. ఈ వైద్య శిబిరానికి సాలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ ప్రారంభించారు. పాచిపెంట ఎస్.ఐ వెంకట సురేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా రాగోలు జేమ్స్ ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్సలు అందించారు. ఉచిత వైద్య శిబిరానికి మండలంలో గల వివిధ గ్రామాల నుంచి ఏజెన్సీ గిరిజన ప్రాంతాల నుంచి 250 మంది రోగులు వైద్య శిబిరానికి హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి రోగులు ఆటోల్లో వైద్య శిబిరానికి పోలీస్‌శాఖ సహకారంతో హాజరయ్యారు. రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. అలాగే సాలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చేతులు మీదుగా గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేమ్స్ వ్యై సిబ్బంది పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పదోతరగతి ఫ్రీఫైనల్ పరీక్షల నిర్వహణకు పరిశీలించిన ఏఈఒ

**రామభద్రపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సోషల్‌స్టడీస్ ఫ్రీఫైనల్ పరీక్షలు నిర్వహణను మండల విద్యాశాఖాధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. పరీక్ష పత్రం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా తెలిసిన జవాబులు రాసి తరువాత కష్టమైన జబావులు రాయండని సూచన చేశారు. విద్యార్థులు ప్రశ్నల నంబర్లను విధిగా వేసే అలవాటును కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రదానోపాధ్యాయులు ఎం.నాగభూసణ రావు, పాఠశాల కార్యదర్శి రెడ్డి ప్రభాకరరావు, మురళీధరరావు, కె.దాలినాయుడు, కె.జయ, శాంతకుమారి, నిర్మల తదతరులు పాల్గొన్నారు.

## ఆటపాటలతోనే పిల్లల్లో అభివృద్ధి



**మెరకముడిదాం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

ఆటపాటలతో విద్యాభివృద్ధి సాధ్యమని మండల విద్యాశాఖాధికారులు ఎం.చంద్రశేఖర్, టి.దర్మశ్రీ తెలియజేశారు. జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడోరోజు అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెరకముడిదాంలో నిర్వహించారు. మూడోరోజు శిక్షణ కార్యక్రమంలో వివిధ రకాల చార్టులు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో సృజనాత్మక కృత్యాలు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్‌గా ఎం.రమేష్, చంద్రశేఖర్, కె.వి.కామేశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సూపర్‌వైజర్లు టి.శ్రీదేవి, లక్ష్మి శిక్షకులకు శిక్షణ ఇచ్చారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకునిగా విరేష్‌చంద్రదేవ్

**కురుపాం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండపేట నియోజకవర్గం పరిశీలకులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల విరేష్ చంద్రదేవ్‌ను పార్టీ నియమించింది. ఈ నేపథ్యంలో గురువారం ఎన్నికల వ్యూహాలను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుతో పాలు విషయాలను చర్చించారు. అలాగే తదుపరి కార్యచరణ ప్రణాళికలపై ఎమ్మెల్యేతో ఆయన చర్చించారు కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే గెలుపునకు పూర్తి బాద్యతలు వహించిన ఘనత వైరిచర వీరేష్ చంద్ర దేవ్‌కు దక్కింది. దీంతో ఆయనకు గుర్తించి పార్టీ ఈ బాద్యతలు అప్పగించింది.

## జాతరలో అక్రమ మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు



**శృంగవరపుకోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**

మహాశివరాత్రి జాతర మహోత్సవాల్లో అక్రమ మద్యం అమ్మకాలు చేపడితే గట్టి చర్యలు తీసుకుంటామని ఎస్.కోట ఎక్సైజ్ సిఐ సి.హెచ్ రాజేష్ హెచ్చరించారు. ఈ నెల 26,27 రెండు రోజుల పాటు జరగనున్న జాతరలో ఎస్.కోటలో పుణ్యగిరి అలాగే మండల పరిధిలో ఉన్న దర్మవరం శ్రీసన్యాసేశ్వర స్వామి దేవస్థానాలు వద్ద ఎస్.కోట ఎక్సైజ్ సిబ్బందితో గట్టి నిఘాను ఏర్పాటు చేయనున్నామన్నారు. అంతేకాకుండా జిల్లా ఎన్ఫోర్స్‌మెంటు సిబ్బందిని కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు దేవాస్థానాలు వద్ద అక్రమ మద్యం అమ్మకాలు చేపట్టడం చట్టరీత్యా నేరమని ఎవరైనా మద్యం అమ్మకాలు చేపడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సిఐ రాజేష్ తెలిపారు.

## జ్ఞానజ్యోతి శిక్షణ సద్వినియోగం చేసుకోండి : పిఒ

**సాలూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



సాలూరు పట్టణ ప్రభుత్వ హైస్కూల్లో ఐసిడిఎస్ పరిధిలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఫ్రీస్కూల్ ఫౌండేషన్ ఇంకా న్యూమెర్సీ కార్యక్రమంలో ఫ్రీ స్కూల్ పిల్లలకు అవగాహన కల్పించాలని ఉద్దేశ్యంతో జ్ఞాన జ్యోతి శిక్షణ ఉంటుందని ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి తెలిపారు. అంతేకాకుండా అంగన్వాడీ టీచర్స్ అందరూ జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ 120 రోజులు సర్టిఫికేట్ కోర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిఆర్పీ పైడపునాయుడు సూపర్‌వైజర్లు రవణమ్మ, అనురాధ, భారతి, అంగన్వాడీలు వరలక్ష్మి, నిర్మల, దేవి, రవణమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మపాలెంలో వైద్య శిబిరం



**కొత్తవలస, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

మండలంలోని నిమ్మలపాలెంలో గురువారం జిందాల్ స్టెయిన్‌లెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ టి.సుబ్బారావు సుమారు 40 మందికి వైద్యం అందించి మందులను పంపిణీ ఏశారు. ఈ కార్యక్రమంలో జిందాల్ డిజిఎం జి.గోపాల కృష్ణ, సర్పంచ్ కొట్యాడ నిర్మలసాయి, విలేజ్ పెద్దా గోంపా దుర్గా ఉమేస్, నాయుడు, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

## ముమ్మరంగా శివరాత్రి జాతర ఏర్పాట్లు

**శృంగవరపుకోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



మరో నాలుగు రోజుల్లో మహాశివరాత్రి పర్వదినం రానుంది. ఎస్.కోట పుణ్యగిరిలో రెండు రోజుల పాటు జరగనున్న జాతర మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మండలంలో సంబందిత అధికారులు ఎవరి ఏర్పాట్లు వారు నిమగ్నమై ఉన్నారు. ముఖ్యంగా ఎస్.కోట పట్టణంలోని దేవిబొమ్మ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ అలాగే శ్రీనివాససినిమా హాల్, వన్‌వేట్రాఫిక్ జంక్షన్ వరకు ఇరువైపుల రహదారులు అలాగే పుణ్యగిరి దేవస్థానానికి వెళ్ళి రహదారి ఇరువైపులా చోటు చేసుకున్న అక్రమణలు తొలగింపు, రోడ్లు విస్తరణ పనుల కార్యక్రమాలు ఎస్.కోట పోలీసు పంచాయతీశాఖల ఆధ్వర్యంలో ముమ్మరంగా సాగుతున్నాయి. పుణ్యగిరి జాతర వేడుకలకు వివిధ జిల్లాలు రాష్ట్రాల నుంచి ప్రతి యేటా వేలాది సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు ఎక్కువగా ట్రాఫిక్ సమస్య ఏర్పడే అవకాశముంది. ట్రాఫిక్ సమస్యలు చెక్ పెట్టేందుకు ముందుగా రోడ్డుకు ఇరువైపులా అక్రమణలు తొలగింపు విస్తరణ పనులు చేపడుతున్నారు. అవసరమైన ప్రదేశాల్లో రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. ఎవరైనా రోడ్డు పైన అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. మొత్తం మీద మహాశివరాత్రి జాతర ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

## పల్లె పండుగ పనులు శతశాతం పూర్తి కావాలి



**పార్వతీపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

జిల్లాలో పల్లె పండుగ కింద మంజూరైన పనులన్నీ శతశాతం పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పల్లె పండుగు పనులపై సంబందిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా పల్లెపండుగ కింద చేపట్టిన పనులన్నీ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అన్నారు. పూర్తి చేసిన పనులకు ఎప్పటికప్పుడు బిఉల్లలు అప్లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిబ్రవరి మాసాంతానికి శతశాతం పనులు పూర్తి కావాల్సిందేనని కలెక్టర్ తేల్చి చెప్పారు. గతంలో పనులు చేపట్టేందుకు నిధులు లేవని, ప్రస్తుతం నిధులున్నా పనుల్లో వేగం పెంచడం లేదని కలెక్టర్ తెలిపారు. కురుపాంలో పనులు వేగవంతం కావడం లేదని, దానిపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమతి ఒజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించని గుత్తేదారుని రద్దు చేసి, వేరే గుత్తేదారునితో పనులు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. అప్పగించిన లక్ష్యాలపై ఇంజనీర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా పల్లె పండుగ కింద చేపట్టిన బీటీ, సిసి రోడ్లలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, నాణ్యత లోపం ఉంటే చెలి ఒపులు జరగబోవని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్రశేఖత్, ఆర్.డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, పి.ఆర్. ఐటిడిఎ సిఐటియు ఈఈలు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోనుతో అతిసులువుగా పురుగు మందు పిచికారి

**బొబ్బిలి,పిబ్రవరి20ప్రభాతవార్త**



డ్రోను సహాయంతోవ్యవసాయానిక పురుగులు మందులు చల్లం సునాయాసంగా చేయవచ్చు అని బొబ్బిలి డివినల్ వ్యవసాయాదికారి మజ్జి శ్యామ్‌సుంద్ అన్నారు. గురువారం మండలంలో పెంటగ్రామంలో మొక్క జొన్న పంటకు పురుగులు మందు డ్రోన్ ఉపయోగించి పిచికారి చేసారు .అనంతరం ఆయన మాట్లాడుతూ పోడవాటి వ్యసాయానికి డ్రోన్ తో పిచికారి చేయడం రైతులకు సులభతరం అవుతుందని అన్నారు.ఈకార్యక్రమంలో పెంట వ్యసయా సహాయకరాలు లత పాల్గొన్నారు.

## మొరాయించిన సర్వర్లు .. నిలిచిన రిజిస్ట్రేషన్లు

**గజపతినగరం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



స్థానిక సబ్‌రిజిష్టర్ కార్యాలయంలో బుధవారం సర్వర్లు మొరాయించడంతో రిజిస్ట్రేషన్లు ప్రక్రియ నిలిచి పోయింది. దీంతో భూముల క్రయ,విక్రయదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కార్యాలయం వద్ద పడిగాపులుగాచి, చివరకు ఉసురుమంటూ వెనుదిరిగారు. బుధవారం రెండు రిజిస్ట్రేషన్లు మాత్రమే జరుగగా, ఆ తరువాతం 51మంది రిజిస్ట్రేషన్ కోసం ఇకెవైసి చేసుకున్నారు. అక్కడ నుంచి సర్వర్లు డౌన్ కావడంతో ఉదయం 11 గంటల నుంచి రిజిస్రేర్టషన్లు నిలిచిపోయాయి. ఇదిగో అదిగో సర్వర్ పని చేస్తుందంటూ బలితెన్లు వదిలిన డాక్యుమెంటు రైటర్ల గాలి కబుర్లకు ఆశగా ఎదురు చూసిన క్రయవ్కియదారులకు చివరకు వచ్చేసరికి నిరాశే మిగింది. రిజిస్ట్రేషన్ కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన చాలా మంది ఉసురుమన్నారు. ఈ విషయమై సబ్ రిజిస్టర్ తవిటయ్యను విలేకర్లు ప్రశ్నించగా రాష్ట్రవ్యాప్తంగా సర్వర్ల డౌన్ అయ్యాయని, ఆ కారణంగా రిజిస్ట్రేషన్లు ప్రక్రియకు ఆటంకం ఏర్పడిందన్నారు. ఏ సమయంలో నైనా సర్వర్లు పని చేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు తాము సిద్దంఆ ఉన్నామని తెలిపారు.

## ప్రతి రైతు పేటెంట్ పొందేలా పంటల రూపకల్పన చేయాలి

**గరుగుబిల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



ఈ రోజు జట్టు ట్రస్టు క్యాంపస్‌లో జరుగుతున్న రైతు సాధికార సంస్థ వ్యవసాయ శాఖల బాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్తలు, మెంటర్‌లకు ప్రతి నె జరిగే నాలుగు రోజుల ప్రకృతి వ్యవసాయ పి.ఇ డిప్లొమా కోర్సు శిక్షణలో భాగంగా పాల్గొన్న పార్వతీపురం మన్యం జిల్లా డిడిఎం సాధు దినేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు ప్రతి ఒక్కరూ ఆదరించాలని దీంతో పాటుగా రైతులు వినూత్నంగా ఆలోచన చేసి వారి స్థాయిలో నూతన వంగడాలను, ఉత్పత్తులను సృష్టించాలని వాటికి పేటెంట్ హక్కులు పొందాలని అలా చేసినప్పుడు వారికి సుస్థిర ఆదాయం వస్తుందని తెలిపారు. కొత్త విషయాన్ని అధ్యయనం చేసి, ఆదరించే అనుభవం సంపాదించాక విస్తరణ చేయాలంటే ఎక్కువ సమయం పడుతుందని కాబట్టి సామాజిక మాధ్యమాల ద్వారా అనుభవాల పంపిణీ చేసుకోవడం ద్వారా జ్ఞానం త్వరగా విస్తరిస్తుందని, ఆదరణ సులువు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జట్టు ట్రస్టు ముఖ్య సలహాదారు, రైతు సాధికార సంస్థ సీనియర్ సిలబస్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు, రైతు సాధికార సంస్థ బడి ఉంచి పొలం బడికి సిలబస్ కన్సల్టెంట్ తుంబలి శివాజి, రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టి.శివకేశరావు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలి

**గరివిడి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



అంగన్వాడీ చిన్నారులకు ఆట పాటలతో విద్యాబోదన చేయాలని గరివిడి మండల విద్యాశాఖాధికారి, అంగన్వాడీ టీచర్స్ కోర్స్ డైరెక్టర్ పి.రామారావు సూచించారు. కొండపాలెం ఉన్నత పాఠశాల వేదికగా జరుగుతున్న అంగన్వాడీ టీచర్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు రాయడం, చదవడం, అంకెలు రాయించడం నేర్పించాలన్నారు. అలాగే మొక్కలు నాటడం, పెంచడంపై అవగాహన కల్పించడం, కిచెన్ గార్డెన్ అలవాటు వంటి వాటిపై దృష్టి సారించే విధంగా టీచర్స్ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఆర్?పి.ఎ.వి.శ్రీనివాస్, డిఆర్ ్ప కె.వెంకటరమణ, అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, తదతరులు పాల్గొన్నారు.

## హంతకుడిని పట్టుకున్న పోలీసులు

**దత్తిరాజేరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



ఈ నెల ఆరో తేదీన గుచ్చిమి గ్రామ సమీపంలో పామాయిల్ తోటలో భార్యను హత్య కేసులో ముద్దాయి అయిన ఏకల సత్యనారాయణ గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో పెదమానాపురం బీసీ కాలనీ దగ్గర్లో నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన పిల్లర్ల వద్ద తిరుగుతూ ఉన్నట్టుగా సమాచారం మేరకు గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పెదమానాపురం ఎస్.ఐ వారి సిబ్బంది సదరు ప్రదేశానికి వెళ్ళి ముద్దాయి పారిపోతున్న అతనిని పట్టుకుని పోలీస్టేషన్‌కి తరలించామన్నారు. 14 రోజుల్లో హత్య చేసిన హంతకుడుని పట్టుకున్నారని డిఎస్పీ జి.భవ్య అన్నారు. సిఐ జిఎవి రమణ, ఎస్.ఐ ఆర్.జయంతికు ఎస్పీ వకుల్ జిందాల్ అభినందనలు తెలిపారు.

## మహిళలు రక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్

**పార్వతీపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :**



ఆడబిబ్బలను చదివిద్దాం ప్రజాస్వామ్యంలో చైతన్యం కలిగిద్దామని వన్‌స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.శాంతి అన్నారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు రక్షణ కోసమే నిరంతరం శ్రమించడంతో పాటు ఆపదలో ఉన్న మహిళలకు అపన్న హస్తం అందించడమే ఈ వన్‌స్టాప్ సెంటర్ ముఖ్యమన్నారు. ఇటీవల కాలంలో దేశంలో ఆడబిడ్డలపైన జరుగుతున్న దాడుల దృష్ట్యా కేంద్రం ఈ వన్‌స్టాప్ సెంటర్ ద్వారా ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఆడబ్బిలను చదివేద్దాం ఆడప్లిలను రక్షిద్దామే కార్యక్రమంలో ఆడవాళ్లపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచారాలు, లైంగిక వేదింపులు, కిడ్నాప్, గృహహింస, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే మన్యం జిల్లాలో వరకట్నం వేదింపులు మరణాలు, గృహహింస, సైబర్ నేరాలు తమ వద్దకు వచ్చాయని ఎప్పటికి సమస్యలు వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్నామన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త
25 Glorious years

## మంత్రి, స్పీకర్లకు జాతర ఆహ్వానం



**చీపురుపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

వచ్చే నెల 2,3,4 తేదీల్లో చీపురుపల్లిలో ఘనంగా జరగనున్న శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, స్పీకర్ అయ్యన్నప్పాతుడుతో పాటు, నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం మాధవిలను జాతర కమిటీ నిర్వాహ కులు జాతరకు ఆహ్వానించారు. కూటమి నాయకులు తెలుగుదేశంపార్టీ నుంచి గవిడి నాగరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావులతో పాటు పలువురు కమిటీ నిర్వాహకులు ఆహ్వాన పత్రాలను అందజేసి జాతరకు ఆహ్వానించారు. మూడు రోజులపాటు జరగనున్న అమ్మవారి జాతర మహోత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు



**లక్కవరపుకోట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

మండలంలోని ఎల్.కోట హాస్టల్ జంక్షన్ వద్ద ఎల్.కోట ఎస్.ఐ నవీన్ పడాల్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించి పలువురికి చలనాలు విధించారు. ఈ సందర్భంగా హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపేవారికి లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారికి మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కొందరు వాహనదారులు బండి ఆపమంటున్న ఆపకుండా పోవడం వాహనాన్ని దురుసుగా పోలీసులు మీదకు నడపడం వంటివి చేస్తున్నారని ఇలాంటి వారి బళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కువ శాతం పాత చలానాలు ఉన్న వాహనదారుల నుంచి దగ్గరలోని మీ సేవ ద్వారా చలనాలు కట్టించారు.

## పేకాట రాయుళ్లు అరెస్టు

**రామభద్రపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



మండల పరిధిలో గల కొత్తరేగ గ్రామంలో చొక్కాపు సరోజని శాల వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. ఈ ఏడుగురు కొత్తరేగ గ్రామస్తులు వీరిపై నిఘా వేసి ఎస్.ఐ వెలమల ప్రసాదరావు, సిబ్బంది అరెస్టు చేసి ఏడు వేల రూపాయల స్వాదీనం చేసుకున్నట్లు ఎస్.ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## నాటుసారా సీజ్ ఇద్దరు మహిళలు అరెస్టు



**సాలూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**

పట్టణంలో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నాటుసారా తరలిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి సారాను స్వాదీనం చేసుకున్నామని టౌన్ సిఐ అప్పలనాయుడు స్థానిక విలేకర ్లకు తెలిపారు. గురువారం ఆయన తెలియజేసిన వివరాలు రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన మహిళ అలాగే ఎరుకుల వీధిలో ఉంటున్న మహిళ వద్ద 150 లీటర్ల 1500 నాటు సారాను స్వాదీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలియజేశారు. అలాగే మమిళలపై గతంలో కూడా కేసులు ఉన్నందున క్రైం హిస్టరీ షీజ్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

## కృత్రిమ అవయవాలు పంపిణీ

**కొత్తవలస, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో గురువారం సౌత్ అసియా ఎల్‌పిజి కంపెనీ ఫ్రైవేటు లిమిటెడ్ వారి సహకారంతో కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నవీన్ మఖిజ, శ్రీ వికాస్ వర్మ, శ్రీరామనాద్‌లు విచ్చేశారు. వీరు ముందుగా డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ హాస్పటల్ భవనాన్ని సందర్శించారు. అనంతరం అతిధులు మాట్లాడుతూ శ్రీ గుదేవ చారిటటబుల్ ట్రస్టు హాస్పటల్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ చేస్తున్న సేవలను అభించారు. అనంతరం సెల్ఫ్‌జి వారి సహకారంతో హాసపట్ అడ్వాన్స్‌డ లైఫ్ సపోర్టు అంబులెన్స్‌ను సిఎస్ఆర్ ద్వారా బహూకరించారు. వంద మందికి పైగా దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయాలు వీల్ చైర్స్ కర్రలను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.ఫణీంద్ర, గురుదేవ చారిటబుల్ ట్రస్టు హాస్పట్ బృందం తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సిపి కౌన్సిలర్లు టీడీపీలో చేరిక

**పార్వతీపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



పురపాలక సంఘంలో వైఎస్సాఆర్‌సపి పార్టీకి బిగ్ షాక్ తగిలింది. వైసీపికి చెందిన కౌన్సిలర్లు ఎమ్మెల్యే విజయచంద్ర సమక్షంలో తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పురపాలక సంఘం 23,24,19 వార్డులకు చెందిన కౌన్సిలర్లు మంతిన రవికుమార్, ఉమామహేశ్వరి, బోదయ్య ఎమ్మెల్యే సమక్షంలో తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 23,24 వార్డు కౌన్సిలరు వైఎస్సార్‌సిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. వాళ్లు ఇప్పటికి రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొందారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి ఎమ్మెల్యే విజయ్‌చంద్ర నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం కలిసి సాగుదామని ఆయన అన్నారు.

## భూసారం కోసం యాజమాన్య పద్ధతులు పాటించండి

**గజపతినగరం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



రైతులు విధిగా తమ, భూములు సారవంతం కోసం యాజమాన్య పద్దతులు పాటించాలని జిల్లా భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ సహయ సంచాలకులు బానులత అన్నారు. గురువారం మండలంలోని కొత్త శ్రీరంగరాజపురం గ్రామంలో భూసార పరీక్ష ఫలతాల ఆధారంగా ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ రైతులు తమ భూమిలో మట్టి నమూనా సేకరించి పద్దతి, పోషక లోపాలు, వాటి యాజమాన్యం పద్దతులపై రైతులకు వివరించారు. భూసారం కోసం కారిచౌడు నేలలు, పచ్చిరొట్ట విత్తనాలు అయినటువంటి జీలుగు, జనుము వేసుకుని సవరించుకోవచ్చన్నారు. నత్రజని ఎరువులు మాత్రమే కాకుండా సమగ్ర పోషక యాజమాన్యం చేపట్టిన అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల కార్డు ఆదారంగా రైతులు తమ నేలలో పోషక లోపాలను ఎలా తెలుసుకోవాలి. ఎరువు ఏవిధంగా ఏ పరిమితిలో వాడాలి అనే విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ కె.మహరాజన, స్థానిక వ్యవసాయ అధికారి సి.హెచ్.ధనలక్ష్మి, సర్పంచ్ పైడపునాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు వినయ్, పవన్, రైతులు పాల్గొన్నారు.

## విద్యకు తొలిమెట్టు అంగన్వాడీ కేంద్రం

**దత్తిరాజేరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**



మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోదన నేర్పించాలని వారికి తొలిమెట్టుగా విద్యను అందించి మంచి భవిష్యత్‌కు పునాది అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి వెంకట్రావు అన్నారు. మూడో రోజు శిక్షణ తరగతులు కార్యక్రమంలో భాగంగా సిపిడిఒ నాగమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ తరగతులు నిరన్వహిస్తున్న రీసోర్స్ ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి అంశాన్ని అంగన్వాడీ కార్యకర్తలు తెలుసుకుని పిల్లలకు రాయడం చదివించడం ఎన్నో కొత్త విషయాలను తెలుసుకుని వారికి నేర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసి పిల్లలకు మేధావులుగా తయారు చేసి విద్యార్థులకు మేధాశక్తిని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూపర్‌వైజర్ శకుంతుల, ఇందిరా, భవాని పాల్గొన్నారు.

21-2-25 TERA PAGE 8.qxd:21-2-25 TERA PAGE 8.qxd 1/1/02 6:07 AM Page 1



## చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో మణిశర్మ రక్తదానం

తెలుగు చిత్ర పరిశ్రమలో ఎవరెస్ట్ శిఖరం మెగాస్టార్ చిరంజీవి. వెండితెరపై నటనతో పాటు డాన్సులతోనూ అలరించే ఆయన చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌ను స్థాపించి తన అభిమానుల సహకారంతో ఎనలేని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. చిరంజీవి మానస పుత్రిక అయిన చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు, సినీ సెలబ్రిటీలు ఎందరో రక్తదానం చేస్తుంటారు. తాజాగా ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ రక్తదానం చేసి చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇలా మణిశర్మ రక్తదానం చేయటం ఇది రెండోసారి కావటం విశేషం.



'రక్తదానం'తో లక్షలాది ఆపన్నుల ప్రాణాలు నిలపాలన్న చిరంజీవి ఆశయాన్ని తమ సంకల్పాన్ని భావించి రక్తదానం చేసిన అభిమానులెందరో.. వారిలో తన స్వరాలతో ప్రేక్షకుల్ని మైమరపించే స్వరబ్రహ్మ 'మణిశర్మ' ఒకరు. చిరంజీవి పిలుపును కర్తవ్యంగా భావించి నేడు ఈ మహత్కార్యంలో భాగమై రక్తదానం చేసిన మణిశర్మ మరెందరికో స్ఫూర్తిగా నిలిచారు. పాటలకు స్వరాలు కూర్చడమే కాదు.. మానవత్వానికి చిరునామాగా నిలవడమూ తెలుసునని నిరూపించారు మణిశర్మ. ఈ సందర్భంగా మెలోడీ బ్రహ్మ మణిశర్మ మాట్లాడుతూ "ఎప్పటి నుంచో రక్త దానం చేయాలని అనుకుంటున్నాను. నేను నా సంగీతాన్ని చిరంజీవి సినిమాలకు అందించటం ద్వారా అభిమానాన్ని చాటుకున్నాను. ఇప్పుడు రక్తదానంచేయటం అనేది సంతోషంగా ఉంది. నా వంతు కర్తవ్యంగా భావిస్తున్నాను. లక్షలాది మంది ఇందులో భాగమైయ్యారు. అందులో నేను ఒక బొట్టులాగా ఇప్పుడు చేరాను. ఇలాంటి మంచి కార్యక్రమంలో అందరూ భాగం కావాలి" అన్నారు.

## మహా కుంభమేళాలో 'ఓదెల 2' టీజర్ లాంచ్

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ఓదెల 2, ఇది 2021లో హిట్ అయిన ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్స్ పై నిర్మాత డి మధు నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నాగ సాధు పాత్రలో తమన్నా పెరోషియస్, స్టన్నింగ్ పోస్టర్స్ క్యురియాసిటీని పెంచాయి. ఓదెల2 మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్‌తో వచ్చారు. ఈ సినిమా టీజర్ ఫిబ్రవరి 22న కాశీ మహా కుంభమేళాలో లాంచ్ చేయనున్నారు. కాశీ మహా కుంభమేళాలో లాంచ్ కానున్న మొట్టమొదటి టీజర్ ఓదెల 2 కావడం విశేషం. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కుంభమేళా బ్యాక్ డ్రాప్‌లో నాగసాధుగా కనిపించిన తమన్నా లుక్ డివైన్ వైబ్‌తో పవర్ ఫుల్‌గా వుంది. ఈ చిత్రం కోసం ప్రేక్షకులను అలరించే బ్రెత్ టేకింగ్ స్టంట్స్‌ని పెర్ఫామ్ చేయడానికి తమన్నా భాటియా ఇంటెన్స్ ట్రెనింగ్ తీసుకున్నారు. ఓదెల2 భారీ బడ్జెట్, హై క్వాలిటీ ప్రొడక్షన్ వాల్యూస్‌తో రూపొందిస్తున్నారు. ఈ సినిమా ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వబోతోంది. ఎంగేజింగ్ కథనాలతో థ్రిల్లింగ్ యాక్షన్‌ను బ్లెండ్ చేయడంలో పాపులరైన సంపత్ నంది ఈ చిత్రాన్ని సూపర్ విజన్ చేస్తున్నారు. ఓదెల 2కి కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రముఖ డీవోపీ సౌందర్‌రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తారు. ఆర్ట్ డైరెక్షన్ రాజీవ్ నాయర్. డైనమిక్ టెక్నికల్ టీమ్‌తో ఓదెల 2 ఒక మరపురాని సినీ ప్రయాణంగా రూపొందుతోంది. తారాగణం: తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా, యువ, నాగ మహేష్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి, సాంకేతిక సిబ్బంది: నిర్మాత: డి మధు, క్రియేటెడ్ బై: సంపత్ నంది.



బ్యానర్లు: మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ దర్శకత్వం: అశోక్ తేజ, డీవోపీ: సౌందర్ రాజన్ ఎస్., సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్ పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.

## 'శివంగి' స్టన్నింగ్ ఫస్ట్ లుక్



ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలలో దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వంలో ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్‌పై నరేష్ బాబు పి. నిర్మించిన పవర్ ఫుల్ విమెన్ సెంట్రిక్ ఫిల్మ్ శివంగి. జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని బ్లాక్ బస్టర్ డెరైక్టర్ అనిల్ రావిపూడి లాంచ్ చేశారు. ఈ సినిమా ఎంత పవర్ ఫుల్, సెన్సేషనల్ కథతో వుండబోతోందో ఫస్ట్ లుక్ చూస్తే అర్థమౌతోంది. నల్లలుంగీ, చొక్కాతో కాళ్ళపై కళ్ళు వేసుకొని సోఫాలో డైనమిక్‌గా కూర్చున్న ఆనంది లుక్ స్టన్నింగ్ వుంది. విమెన్ సెంట్రిక్ సినిమాలలో శివంగి గ్రౌండ్ బ్రేకింగ్ కథ స్క్రీన్ ప్లేతో వుండబోతోంది. ఫస్ట్ లుక్ సినిమాపై చాలా క్యురియాసిటీని పెంచింది. ఈ చిత్రానికి ఎ.హెచ్ కాషిఫ్-ఎబినేజర్ పాల్ మ్యూజిక్ అందిస్తున్నారు. భరణి కె ధరన్ డివోపీ గా వర్క్ చేస్తున్నారు. రఘు కులకర్ణి ఆర్ట్ డైరెక్టర్. ఈసినిమా పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. మార్చి 7న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలియజేశారు. నటీనటులు: ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్, జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్, దర్శకత్వం: దేవరాజ్ భరణి ధరన్, నిర్మాత: నరేష్ బాబు పి, సంగీతం:ఎ.హెచ్ కాషిఫ్ - ఎబినేజర్ పాల్, డీవోపీ: భరణి కె.ధరన్.

## 'స్వప్నాల నావ'..'సిరివెన్నెల'కి గొప్ప ట్రిబ్యూట్

మనసంతా నువ్వే, నేనున్నాను వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు అందించిన దర్శకులు డా.వి.ఎన్.ఆదిత్య లేటెస్ట్‌గా స్వప్నాల నావ అనే యూట్యూబ్ మ్యూజిక్ వీడియో రూపొందించారు. డల్లాస్‌కి చెందిన ప్రవాసాంధ్రుడు, ప్రముఖ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ అయినటువంటి శ్రీ గోపీకృష్ణ కొటారు శ్రీ క్రియేటివ్ మ్యూజిక్ అండ్ ఎంటర్టైన్మెంట్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి తొలి ప్రయత్నంగా స్వప్నాల నావ మ్యూజిక్ వీడియోని నిర్మించారు. నిర్మాత గోపికృష్ణ కుమార్తె శ్రీజ కొటారు ఈ పాటను ఆలపించడమే కాకుండా నటించడం కూడా విశేషం. ఇక ఈ స్వప్నాల నావ థీమ్ విషయానికి వస్తే, చదువులో ఒకసారి ఫెయిలయిన విద్యార్థినీ విద్యార్థులను మోటివేట్ చేసే పాట ఇది.. దివంగత స్టార్ లిరిసిస్ట్ అయినటువంటి శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి దివ్య స్మృతికి అంకితంగా దీనిని మలిచారు. ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు పార్థసారథి నేమాని సంగీత దర్శకత్వంలో యశ్వంత్ ఆలూరు ఈ పాటకి సాహిత్యం సమకూర్చారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి అంటే దర్శకులు డా. వీ.ఎన్.ఆదిత్యకి, నిర్మాత గోపీకి, సంగీత దర్శకుడు పార్థసారథి నేమానికి, గీతరచయిత యశ్వంత్ ఆలూరుకి ఎంతో అభిమానం. వీ.ఎన్.ఆదిత్య సూపర్ హిట్ సినిమా మనసంతా నువ్వేలో కూడా సిరివెన్నెల సింగిల్ కార్డ్ పాటలు రాయడమేకాకుండా, ఈనాటికీ గుర్తుండిపోయే ఓ మంచి పాత్రని కూడా చేశారు. ఇప్పుడు స్వప్నాల నావతో సిరివెన్నెల గొప్పతనాన్ని, ఆయనపై ఉన్న అభిమానాన్ని గొప్పగా చాటి చెప్పారు ఈ టీమ్.



అందుకే ప్రేక్షకుల నుండి స్వప్నాల నావకి విశేషాదరణ లభిస్తోంది. తాజాగా శ్రీ క్రియేటివ్స్ యూ.ఎస్.ఏ.యూట్యూబ్ ఛానల్‌లో రిలీజైన ఈపాటకు 1 మిలియన్ వీక్షణలు (పది లక్షల వ్యూస్) నమోదయ్యాయి. దీంతోమేకర్స్ సంతోషం వ్యక్తంచేస్తూ వీక్షకులకి, మీడియా వారికి, కృతజ్ఞతలు తెలిపారు. ఇక స్వప్నాల నావని వీక్షించిన వాళ్లలో చాలా మంది ప్రేక్షకులు టాలీవుడ్ గర్వించదగ్గ దిగ్గజ రైటర్ కమ్ లిరిసిస్ట్ అయినటువంటి సిరివెన్నెలసీతారామశాస్త్రికి డా.వీ.ఎన్.ఆదిత్య గొప్పట్రిబ్యూట్ ఇచ్చారు అంటూ ఆయన్ని అభినందిస్తున్నారు. ఓ.ఎమ్.జీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రముఖ సినీ నిర్మాత శ్రీమతి మీనాక్షి అనిపిండి దీనికి సమర్పకురాలుగా వ్యవహరించారు. మాస్టర్ టైలన్ అనే చైనా పిల్లవాడు కూడా నటించిన స్వప్నాల నావకు క్రూ: ఛాయా గ్రహణం: బుజ్జి.కె. సహకారం: యూనస్, సహ దర్శకత్వం: ఇర్షాద్, శ్రీహరిదత్త, రాహుల్ తేజ, ఎడిటింగ్: వికాస్, శేషు, స్టైలింగ్: శృతి, నైలో.



కాజల్ అగర్వాల్ నయా లుక్

## 'శబ్దం' థ్రిల్లింగ్ స్పైన్-చిల్లింగ్ ట్రైలర్

'వైశాలి'తో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రస్టింగ్ సూపర్‌నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు. 7జి ఫిల్మ్స్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ 'శబ్దం' ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. 'వెయ్యి గబ్బిలాలు చెవిలో అరుస్తున్నట్లు వుంటుంది డాక్టర్' అనే వాయిస్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం థ్రిల్లింగ్ స్పైన్‌చిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కట్టిపడేసింది. ట్రైలర్ ఆడియో హాలోజినేషన్ కాన్సెప్ట్‌తో ఆడియన్స్‌కి సరికొత్త అనుభూతిని ఇచ్చింది. మేకర్స్ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ని చాలా డిఫరెంట్ ప్రజెంట్ చేశారు. ట్రైలర్ సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్‌ని ఇచ్చింది. ఆది పినిశెట్టి పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ క్యారెక్టర్‌లో తన ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. లక్ష్మీ మీనన్ క్యారెక్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా వుంది. అరుణ్ బత్మ నాభన్ అందించిన విజువల్స్ సినిమాలో లీనమయ్యేలా చేశాయి. ఎస్ థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సస్పెన్స్‌ని మరింతగా పెంచుతుంది. జాతీయ అవార్డు గ్రహీత సాబు జోసెఫ్ ఎడిటింగ్ షార్ప్‌గా వుంది. మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్. 'శబ్దం' ఫిబ్రవరి 28న ఆంధ్రాలో ఎన్ సినిమాస్, నైజాంలో మైత్రి డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదల కానుంది. టెర్రిఫిక్ ప్రిమైజ్, అద్భుతమైన పెర్ఫార్మెన్స్, హంటింగ్ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. నటీనటులు: ఆది పినిశెట్టి, సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లే, ఎం.ఎస్.భాస్కర్, రాజీవ్ మీనన్.



## 'జాట్' డబ్బింగ్ ప్రారంభం

బాలీవుడ్ లెజెండ్ సన్నీ డియోల్, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని మోస్ట్ ఎవైటెడ్ మూవీ "జాట్" విడుదలకు సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మక మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై డైనమిక్ ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10, 2025న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా డబ్బింగ్‌ని ప్రారంభించారు మేకర్స్. ఇప్పటికే జాట్ టీజర్ అందరినీ ఆకట్టుకొని సినిమా మోస్ట్ బ్లాస్ట్ యాక్షన్ డ్రామాగా వుండబోతోందని హామీ ఇచ్చింది. ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. "జాట్" చిత్రానికి సంగీతం థమన్ ఎస్, రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు. అనల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్ కొరియోగ్రఫీ చేసిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని హామీ ఇస్తున్నాయి. ఆడియన్స్ అడ్రినలిన్ రష్‌తో కూడిన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే జాట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తారాగణం: సన్నీ డియోల్, రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: గోపీచంద్ మలినేని, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, టిజి విశ్వ ప్రసాద్, బ్యానర్లు: మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సంగీతం: థమన్ ఎస్, డిఓపి: రిషి పంజాబీ, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సిఇఒ: చెర్రీ, ఎక్జిక్యూటివ్ నిర్మాతలు: బాబా సాయి కుమార్ మామిడిపల్లి, జయ ప్రకాష్ రావు (జేపీ), యాక్షన్ కొరియోగ్రాఫర్: పీటర్ హెయిన్, అన్ల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్, డైలాగ్స్: సౌరభ్ గుప్తా, రైటింగ్ టీం: ఎం వివేక్ ఆనంద్, నిమ్మగడ్డ శ్రీకాంత్, శ్రీనివాస్ గవిరెడ్డి, మయూఖ్ ఆదిత్య కృష్ణ కాస్ట్యూమ్ డిజైనర్లు: భాస్కి (హీరో), రాజేష్ కమర్సు, పబ్లిసిటీ డిజైనర్: గోపి ప్రసన్న, విఎఫ్ఎక్స్: దక్కన్ డ్రీమ్స్, పిఆర్ఒ: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.



## ఇకపై మీకు నచ్చే సినిమాలే చేస్తా: విశ్వక్ సేన్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఇటీవలే లైలా మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా రాణించలేకపోయింది. ఈ మూవీలో విశ్వక్ సేన్ లేడీ గెటప్‌లో అభిమానులను అలరించాయి. అయితే ఈ చిత్రం రిలీజ్‌కు ముందే వివాదానికి దారి తీయడంతో కనెక్షన్లపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల విషయంలో తీవ్రంగా నిరాశపర్చింది. ఈ నేపథ్యంలో హీరో విశ్వక్ సేన్ తాజాగా ఓ లేఖ విడుదల చేశారు. అభిమానులు ఆశించిన స్థాయిలో సినిమాలు చేయలేక పోయానని ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. విశ్వక్ సేన్ తన లేఖలో రాస్తూ, 'అందరికీ నమస్కారం..ఇటీవల నా సినిమాలు అందరూ కోరుకునే స్థాయికి చేరుకోలేక పోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శలను పూర్తిగా అంగీకరిస్తున్నాను. నన్ను నమ్మి, నా ప్రయాణానికి మద్దతునిచ్చిన నా అభిమానులకు, నాకు ఆశీర్వాదంగా నిలిచిన వారికి హృదయపూర్వక క్షమాపణలు. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే, కానీ ఆ ప్రయత్నంలో మీ అభిప్రాయాలను నేను గౌరవిస్తున్నా. ఇకపై నా ప్రతి సినిమా క్లాస్, మాస్ ఏదైనా సరే అసభ్యత ఉండదు. నేను ఒక చెడు సినిమా తీస్తే, నన్ను విమర్శించే హక్కు మీరు ఉంది. ఎందుకంటే నా ప్రయాణంలో ఎవ్వరూ లేని సమయంలో నన్ను ప్రేమతో ముందుకు నడిపించింది మీరే' అని రాసుకొచ్చారు. అంతేకాకుండా నా కెరీర్ ప్రారంభం నుంచి నేను ఎంచుకున్న కథలను మీరు ఎంతగా ప్రేమించారో తెలుసు. ఇకపై కేవలం సినిమా మాత్రమే కాదు, నా ప్రతి సన్నివేశం కూడా మీ మనసుకు తగిలేలా ఉండాలని నిర్ణయించుకున్నా. అంతేకాకుండా, నా మీద విశ్వాసం ఉంచిన నిర్మాతలు, పంపిణీ దారులందరికీ నాకృతజ్ఞతలు తెలియ చేస్తున్నా. అలాగే నా కథానాయకులు, దర్శకులు, రచయితలు నాకు వెన్నెముకగా నిలిచి, నన్ను మలిచిన ప్రతి ఒక్కరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు. మీ అందరి నిర్మాణాత్మక విమర్శలకు ధన్యవాదాలు. మీ అందరి నిర్మాణాత్మక విమర్శలకు ధన్యవాదాలు. త్వరలోనే మరో బలమైన కథతో ముందుకు వస్తా. నా మంచి, చెడు కాలాల్లో నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మీ మద్దతు నాకు ఎంతో ప్రాముఖ్యం అని ఆ లేఖలో రాశారు.



## 'ఎన్‌టిఆర్ నీల్' షూటింగ్ షురూ

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కె.జి.యఫ్ సిరీస్, సలార్ వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్స్ సాధించిన సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఇప్పుడు ఎన్టీఆర్ వంటి మాస్ హీరోతో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ నీల్ పేరుతో గత ఏడాదిలో పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ మూవీపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఇద్దరు మాస్ ఇమేజ్ ఉన్న స్టార్స్ కాంబోలో రాబోతున్న ఈ మూవీ కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. అందరూ ఆశ్చర్య పోయేలా 3వేల మంది జూనియర్ ఆర్టిస్టులతో భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరణతో షూటింగ్ మొదలైంది. ఎన్టీఆర్ వచ్చే షెడ్యూల్ నుంచి షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు.

ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందోనని అందరి కళ్లు ఇప్పుడు ఈ సినిమాపైనే ఉన్నాయి. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ భారీ పాన్ ఇండియా చిత్రం జనవరి 9, 2026లో ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ లెవల్లో విడుదలవుతుంది. ముందుగానే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయటంతో అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు సైతం సినిమా షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూడసాగారు. ఆ సమయం రానే వచ్చేసింది. రానున్న సంక్రాంతి థియేటర్స్‌కు ఈ చిత్రం సరికొత్త పండుగను తీసుకొస్తుందనటంలో సందేహం లేదు. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ అంటే బ్లాక్ బస్టర్ చిత్రాలకు కేరాఫ్.. ఆయన ఇప్పుడు ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తోన్న చిత్రాన్ని సరికొత్త మాస్ విజన్‌తో ఆవిష్కరించనున్నారు. ఇప్పటి వరకు తారక్‌ను చూడనటువంటి మాస్ అవతార్‌లో ప్రెజంట్ చేయనున్నారు. దీంతో వీరిద్దరి క్రేజీ కాంబినేషన్ సరికొత్త బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేస్తుందనటంలో సందేహం లేదు. ప్రెస్టీజియస్ బ్యానర్స్ మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మాణంలో అన్‌కాంప్రమైజ్డ్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆడియన్స్‌కు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కళ్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భువన్ గౌడ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. చలపతి ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఇంకా టాప్ యాక్టర్స్, టెక్నీషియన్స్ అందరూ భాగమవుతున్నారు. నటీనటులు: మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సాంకేతిక వర్గం: నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ: మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, రచన, దర్శకత్వం: ప్రశాంత్ నీల్, నిర్మాతలు: కళ్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు, ప్రొడక్షన్ డిజైన్: చలపతి, సినిమాటోగ్రఫీ: భువన్ గౌడ, సంగీతం: రవి బస్రూర్.



## ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో..
# హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ విజయం
### 2-1 తేడాతో రాజస్థాన్ యునైటెడ్ ఓటమి



**ఢిల్లీ:** ఐ-లీగ్ జాతీయ ఫుట్బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్బాల్ క్లబ్ (ఎఫ్సీ) జట్టు ఐదో విజయం నమోదు చేసింది. జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ 2-1 గోల్స్ తేడాతో రాజస్తాన్ యునైటెడ్ ఎఫ్సీ జట్టును ఓడించింది. 10 మ్యాచ్‌ల తర్వాత రాజస్తాన్ జట్టుకు ఇది తొలి ఓటమి కావడం గమనార్హం. శ్రీనిధి జట్టు తరఫున ఏంజెల్ ఒరెలియన్ (43వ నిమిషంలో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (73వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. రాజస్తాన్ యునైటెడ్ జట్టుకు మైకోల్ కబ్రెరా (75వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఈనెల 25న జరిగే తదుపరి మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్‌తో హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ జట్టు తలపడుతుంది. 12 జట్లు పోటీపడుతున్న ఈ ఐ-లీగ్‌లో 15 మ్యాచ్ పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 19 పాయింట్లతో ఎనిమిదోస్థానంలో ఉంది.

## జాతీయ పారా అథ్లెట్‌లో..
## తెలంగాణ అమ్మాయికి స్వర్ణం




**న్యూఢిల్లీ:** జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. చెన్నైలో జరుగుతున్న ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి, అంతర్జాతీయ పారాథ్లెట్ జివాంజి దీప్తి 400 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది.
దీప్తి అందరికంటే వేగంగా, అందరి కంటే ముందుగా 57.82 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. హర్యానాకు చెందిన పూజా 1:08.21 సెకెన్లలో గమ్యాన్ని చేరుకుని రజతం సొంతం చేసుకోగా, హర్యానాకే చెందిన భువి అగర్వాల్ కాంస్యం దక్కించుకుంది.




## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..
# ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విక్టరీ
### 7 వికెట్ల తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టీ20 టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. అనాబెల్ సదర్లాండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడం వల్ల ఈ విజయం సాధ్యమైంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఢిల్లీ ప్లేయర్లలో ఓపెనర్ కిరణ్ నవగిరె (27 బంతుల్లో 51; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభం అందివ్వగా, శ్వేత సెహ్రావత్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్) హెన్రీ (15 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో అనాబెల్ 2 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 19.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. మెగ్ లానింగ్ (49 బంతుల్లో 69; 12 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అనాబెల్ (41 నాటౌట్; 4 ఫోర్లు), మరిజాన్ కాప్ (29 నాటౌట్; 4 ఫోర్లు), షఫాలీ వర్మ (26; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేశారు. యూపీ వారియర్స్ బౌలర్లలో సోఫియా, దీప్తి శర్మ, గ్రేస్ హ్యారిస్ తలా ఒక వికెట్ తీశారు.

## ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో..
# బోపన్న జోడీ శుభారంభం



**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-నునో బోర్జెస్ (పోర్చుగల్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. దోహాలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బోర్జెస్ ద్వయం 7-6 (7/2), 7-6 (7/4)తో రెండో సీడ్ సిమోన్ బొలెలీ-ఆండ్రియా వావాసోరి (ఇటలీ) జంటను బోల్తా కొట్టించింది. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఏడు ఏస్లు సంధించింది. మ్యాచ్ మొత్తంలో రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో ట్రైబ్రేక్‌లు అనివార్యమయ్యాయి. ట్రైబ్రేక్స్‌లో బోపన్న-బోర్జెస్ పైచేయి సాధించి విజయాన్ని అందుకోవడంతో పాటు, క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీలో డేంజరస్ టీమ్
### టీమిండియాకు టెర్రర్
### మూడో మ్యాచ్‌కు ఇబ్బందులు




**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు ఇబ్బందులు మూడో మ్యాచ్ నుంచి ఎదురుకానున్నాయి. టోర్నీ మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టుతో తలపడేందుకు టీమిండియా సిద్ధమైంది. ఐసీసీ ఈవెంట్లలో భారత జట్టుకు కివీస్ పెద్ద తలనొప్పిలా మారింది. ఎల్లప్పుడూ టీమిండియాపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ఈసారి భారత్, న్యూజిలాండ్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ నెల 23 ఆదివారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రెండు జట్లు తలపడనున్నాయి. గత ఎడిషన్‌లో, భారత జట్టు తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. కానీ, చివరికి పాకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. మరోవైపు, న్యూజిలాండ్ తమ గ్రూప్‌లో చివరి స్థానంలో నిలిచింది. మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. అయితే, రాబోయే ఎడిషన్‌లో టోర్నమెంట్ గెలవడానికి భారత్, న్యూజిలాండ్ రెండూ ఫేవరెట్‌లలో ఉన్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి భారతదేశం సిద్ధమవుతుండగా, న్యూజిలాండ్‌ను చూసి టీం ఇండియా కాస్తంత భయపడుతోంది. ఐసీసీ ఏ ఈవెంట్‌లోనైనా నాకౌట్ మ్యాచ్‌లలో న్యూజిలాండ్ ఎల్లప్పుడూ భారతదేశాన్ని ఇబ్బంది పెడుతుంది. 2000 సంవత్సరంలో, కివీస్ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌ను ఓడించింది. సెమీఫైనల్స్ లో 2019 ప్రపంచ కప్ నుంచి భారత జట్టును ఓడించింది. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన ముక్కోణపు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ 78 పరుగుల భారీ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. తదుపరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 305 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో సులభంగా ఓడించింది. చివరికి పాకిస్తాన్‌పై ఫైనల్ మ్యాచ్‌ను కూడా గెలుచుకుంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీకి ముందే న్యూజిలాండ్ బ్యాటింగ్ లైనప్ ఫామ్‌ను కనుగొంది. ట్రైసిరీస్‌లో, అనేక మంది కివీస్ బ్యాట్స్‌మెన్స్ ఫామ్‌ను కనుగొన్నారు. ఐసీసీ ఈవెంట్‌లోకి వెళ్లే ముందు పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. ఈ టోర్నమెంట్‌లో కేన్ విలియమ్సన్ మూడు ఇన్నింగ్స్‌లలో 112.50 సగటుతో 225 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్ (మూడు మ్యాచ్‌ల్లో 154 పరుగులు), డారిల్ మిచెల్ (మూడు మ్యాచ్‌ల్లో 148 పరుగులు), డెవాన్ కాన్వే (రెండు మ్యాచ్‌ల్లో 145 పరుగులు) వంటి బ్యాట్స్‌మెన్ కూడా పరుగుల స్కోరు చేసిన వారిలో ఉన్నారు.

ఆట



## హాకీ ప్రొ లీగ్‌లో..
## భారత్ పురుషుల జట్టు
# సంచలనం
### వరల్డ్ ఛాంపియన్ జర్మనీపై 1-0తో గెలుపు
### స్పెయిన్ చేతిలో భారత్ మహిళల టీం ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు సంచలనం సృష్టించింది. ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో భువనేశ్వర్‌లో జరిగిన రెండో రౌండ్ రెండో మ్యాచ్‌లో టీమిండియా 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. ఆట నాలుగో నిమిషంలో గుర్జంత్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ వచ్చిన భారత్ చివరకు విజయాన్ని ఖరారు చేసుకుంది.
అంతకు ముందు జర్మనీతో జరిగిన రెండో రౌండ్ తొలి మ్యాచ్‌లో భారత్ 1-4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. మరోవైపు భారత మహిళల జట్టుకు మరో ఓటమి ఎదురైంది. స్పెయిన్ జట్టుతో జరిగిన రెండో రౌండ్ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0-1తో ఓడిపోయింది.
స్పెయిన్ తరఫున సెగూ మార్టా (49వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది.

# పిఎన్‌బి వడ్డీరేట్ల తగ్గింపు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దాదాపు ఐదేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును తగ్గించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు బ్యాంకులు కూడా రుణ రేట్లను సవరిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను తగ్గించగా, ఇప్పుడు మరో ప్రభుత్వ రంగ పిఎన్‌జి కూడా అదే నిర్ణయం తీసుకుంది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు గురువారం ప్రకటించింది. కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు తాజా ప్రకటనలో వెల్లడించింది. గృహరుణాలతో పాటు, కారు ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుంది. తాజా సరవణతో పిఎన్‌బిలో గృహరుణాల ప్రారంభ రేటు 8.15 శాతానికి దిగొచ్చింది. దీంతో రూ.లక్ష రుణానికి ఇఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇక ఆటోమొబైల్ రుణాలపై వడ్డీ రేటు 8.50 శాతం నుంచి ప్రారంభం కానుంది. విద్యా రుణాలపై కనిష్ట వడ్డీని 7.85 శాతానికి తగ్గించినట్లు పిఎన్‌బి తెలిపింది. అటు వ్యక్తిగత రుణాలపై సవరించిన వడ్డీరేటు 11.25 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 7న రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రేపో రేటును 6.50శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు 6.25 శాతానికి తగ్గించిన విషయం విదితమే. దీంతో పలు బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. గత వారం ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేట్, రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను ఎస్‌బిఐ 25బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.

# చదువు మానేయాలన్న నిర్ణయం బాధించింది: బిల్ గేట్స్



వాణిజ్యం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాప కుడు బిల్ గేట్స్ (బిల్ గేట్స్) తన కాలేజీ జీవితం గురించి పలు ఆసక్తికర విష యాలు. హార్డ్ యూనివర్సిటీలో చదువు మానేయాలనే నిర్ణయం తీసుకున్న పుడు చాలా బాధపడినట్లు చెప్పా రు. సోర్స్ కోడ్ మై బిగినింగ్స్ పేరుతో తాను తీసుకొచ్చిన పుస్తకంలో ఆసక్తికర విషయా లన్నీ తాజాగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో పంచుకున్నారు. కళాశాల రోజులు చాలా ఆహ్లాదకరంగా గడిచాయని, ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. హార్వర్డ్‌లో బాగా ఎంజాయ్ చేశాను. మనస్తత్వ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చరిత్రకు సంబంధించిన తరగతులను ఆస్వాదించేవాడిని. తెలివైన వాళ్లతో సమయం గడపడం నాకు నచ్చేది. ఆసక్తికరమైన విషయాలపై రాత్రిళ్లు చర్చించేవాళ్లం అని గేట్స్ అన్నారు. 1975లో సాఫ్ట్‌వేర్ కంపెనీ తొలి సీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు హార్వర్డ్ యూని వర్సిటీలో చదువు మానేయాల్సి వచ్చిందని బిల్ గేట్స్ ఏర్పాటు చేసింది. ఆ నిర్ణయం తీసుకోవడం చాలా బాధను కలిగించింది. డిగ్రీ పూర్తిచేసేందుకు హార్వర్డ్‌కు తిరిగి వెళ్లాలనిపించింది. అయితే వచ్చిన అందిపుచ్చు కొనేందుకు తాను, తన స్నేహితుడు అయిన పాల్‌అలెన్ను, కళాశాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని గేట్స్ చెప్పారు. ఆసమయంలో గేట్స్, అలెన్ ఇద్దరూ కంప్యూటర్ల కోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను సృష్టించగలిగితే కొత్త పరిశ్రమలో ముందంజలో ఉండగలమని భావించారు. అలా రెండేళ్ల మైక్రోసాఫ్ట్‌ను నడుపుతూనే తన చదువును బ్యాలెన్స్ కోసం ప్రయత్నించారు. తన చదువు పూర్తి చేయడానికి మరో స్నేహితుడు. మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామర్ అయిన రిక్ వీలాండ్ సాయం తీసుకోవాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. ఇక చివరకు చదువు మానే యాల్సి వచ్చిందని చెప్పారు. ఇదిలా ఉంటే, సోర్స్ కోడ్ పుస్తకాన్ని మూడు భాగాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్ 1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్ ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు చోటు కల్పించలేదు. భవిష్యత్తులో విడు దల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశం ఉంది. 2000 సంవత్సరం వరకు మైక్రోసాఫ్ట్ సిఇఒగా గేట్స్ విధులు నిర్వర్తించారు. తన పదవీకాలంలో కంప్యూటర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరిగా నిలిచారు.






# గూగుల్ పేలోనూ ఇక ఛార్జీల మోత!




**ముంబై, ఫిబ్రవరి 20:** గూగుల్‌కు చెందిన పేమెంట్ యాప్ గూగుల్ పే (గూగుల్ పే) విద్యుత్, గ్యాస్ వంటి బిల్ పేమెంట్లపైనా ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటివరకు ఈతరహా లావాదేవీలపై ఎలాంటి ఫీజూ విధించేది కాదు. ఇక నుంచి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా లావాదేవీలపై కన్వీనియన్స్ ఫీజు రూపంలో స్వల్ప మొత్తంలో రుసుము వసూలుచేసేందుకు సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవు. ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామైన పేటీఎం, ఫోన్‌పేలు ఇప్పటికే ఈ తరహా ఫీజును వసూలు చేస్తుండగా, ఇన్నాళ్లూ ఉచితంగా అందించిన గూగుల్ పే సైతం ఇకనుంచి వాటి బాటలోనే నడవనుంది. గూగుల్‌పే మొబైల్ రీఛార్జీలపై రూ.3 కన్వీనియన్స్ ఫీజు రూపంలో వసూలు చేస్తోంది. ఇకపై క్రెడిట్, డెబిట్ కార్డు చేసే విద్యుత్, గ్యాస్ బిల్ పేమెంట్లపై 0.5 శాతం నుంచి 1 శాతం వరకు ఛార్జీలు విధిస్తున్నట్లు సూచిస్తున్నాయి. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ యూజర్‌కు ఈ అనుభవం ఎదురైనట్లు ఓ ఆంగ్లమీడియా సంస్థ ఉదాహరణను ఉటంకించింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్వియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పేమెంట్ వసూలు చేసినట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. ఈ పేమెంట్ ప్లాట్‌ఫామ్ ఇప్పటికే ఛార్జీల వసూలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ రుసుములు అందరికీ వర్తిస్తాయా? లేదా? అనే విషయం ఇంకా తెలియలేదు. భవిష్యత్‌లో అందరినుంచీ ఈ ఫీజు వసూలు చేసే అవకాశం ఉందని టెక్‌లు ఉన్నాయి. అయితే ఒప్పందం గూగుల్ పే ఎక్కడా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. పే గూగుల్ వెబ్‌సైట్ ప్రకారం.. కార్డ్ పేమెంట్ ప్రాసెసింగ్ ఖర్చుల్ని కవర్ చేయడానికి ఈ రుసుము సాయపడుతుందని, ఇప్పటికే అనేక ఫిన్టిక్, క్విక్కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించాయి. ఇదే ట్రెండ్‌ను ఇతర సంస్థలూ అనుసరించే అవకాశం ఉందని, తమ ఆదాయాలు పెంచుకోవడానికి ఈ మొత్తాలు ఉపయోగపడతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, ఫిబ్రవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతి కూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు, రోజంతా అదే ఒరవడి కొనసాగించాయి. దీంతో వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిసాయి. అమెరికా అనుసరిస్తున్న టారిఫ్ పాలసీలు, దానివల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మన మార్కెట్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఐటిసి, మారుతి సుజుకి షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. చివరికి సెన్సెక్స్ 203.22 పాయింట్లు క్షీణించి 75,735.96 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 19.75 పాయింట్లు నష్టపోయి 22,913.15 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.65గాఉంది. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, హెచ్‌సి ఎల్ టెక్నాలజీస్, ఐటిసి వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్‌టిపిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.16 డాలర్ల వద్ద కొనసాగగా, బంగా రం ఔన్సు 2971 డాలర్ల వద్ద ట్రేడ యింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.